

నవంబరు, ౧౯33

౨౨:—రామచంద్రపురం తాలూకా మల్లవరం. ఇంటి చూరులో బాంబువంటిది దొరికినదని చిట్టూరి ప్రకాశరావుగారి అరెస్టు.

:—మదరాసు. కవుతా సీతారామశాస్త్రిగారి సరస్వతీనికేతనప్రారంభోత్సవము శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు జరిపిరి.

౨౩:—బెంగుళూరు. సుప్రసిద్ధఆంధ్రనటి మాడపాటి సరోజినిదేవిగారు మరణించిరి.

౨౬:—భీమవరము. 12-వ ఆంధ్ర ఆయుర్వేద వైద్య సమ్మేళనము. వైద్యపంచానన కృష్ణశాస్త్రి కావడెగారి అధ్యక్షత.

౨౮:—నిజాంపట్నము. గుంటూరుజిల్లా రైతుస్త్రీల సభ. శ్రీ గోగినేని భారతీదేవిగారి అధ్యక్షత.

30:—జేస్తవారపుపేట. కర్నూలు మండల ప్రథమ గ్రంథాలయ మహాసభ. శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు అధ్యక్షులు.

:—ఈడుపుగల్లు. కమ్మప్రముఖులు పర్వతనేని పెదకామయ్యగారి మరణము.

డిసెంబరు, ౧౯33

౨:—మోల్మేన్. ఆంధ్రమహాజనసంఘవార్షికోత్సవము.

:—రామచంద్రపురం. చిట్టూరి ప్రకాశరావుగారి విడుదల.

౪:—కడప. ముద్దనూరు బాంబుకేసులో ముద్దాయి విడుదల.

౫:—బళ్ళారిజయిలునుండి విడుదలనొంది శ్రీ కొడాలి ఆంజనేయులుగారు బందరు చేరిరి.

:—నూజవీడు. శ్రీ కాశేశ్వరరావు, కమలాదేవి గార్లకు సంవత్సరము విడిఖైదు.

౬:—రంగూనులో నాటకప్రదర్శనములు గావించి శ్రీస్థానం నరసింహారావుగారు నటబృందముతో తెనాలి వచ్చిరి.

:—దివాన్‌బహద్దరు బాలసుందరమునాయుడుగారు మదరాసు షెరిఫుగ నియమింపబడిరి.

౮:—విశాఖపట్టణము. ఆంధ్రవిశ్వవిద్యాలయము ఏడవ పట్టప్రదానోత్సవము. న్యాయమూర్తి ముత్తరాజు వెంకటసుబ్బారావుగారి కాన్వకేషను ఉపన్యాసము.

౯:—విశాఖపట్టణము. విక్రమదేవవర్మ శాస్త్రకళాశాల భవనప్రవేశోత్సవము గవర్నరుగారుజరుపుట.

:—విశాఖపట్టణము. ఆంధ్రవిశ్వ విద్యాలయ సభామందిరమున శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారి 'మానవుడు' అను విషయమునుగూర్చిన ప్రథమోపన్యాసము.

:—సామర్లకోట. ప్రపంచపర్యటనము సలిపివచ్చిన కిర్లంపూడిరాజా రావు రామకృష్ణరంగారావు బహద్దరు ఎం. ఎల్. సి గారికి స్వాగతము.

౧౦:—విశాఖపట్టణము. కవితాసమితివారు శ్రీరవీంద్రనాథఠాకూరుగారికి స్వాగతపత్రసమర్పించుట.

౧౫:—అమలాపురము. వాడ్రేవు జగ్గరాజుగారి ఎరస్టు. రాజప్రతినిధి రాక సందర్భమున అయి ఉండునని 20-వ తేదీవఱకు రిమాండు, అనంతరము విడుదల.

౧౬:—మహాత్ముని ఆంధ్రరాష్ట్రపర్యటనము. బెజవాడ చేరుట.

:—పొన్నమండ. మహాత్ముని సంచారకార్యక్రమమున పొన్నమండ చేర్చలేదని శ్రీహరిజనాశ్రమ మానేజరుగారైన శ్రీ ఉండ్రు సుబ్బారావుగారు నిరశనవ్రతము ప్రారంభించుట.

౧౯:—విశాఖపట్టణము. వైస్రాయిగారు హార్బరును దర్శించుట.



"పొలము కాపరి బోటి"

[శ్రీయుత వరదా వేంకటరత్నముగారి త్రివర్ణ చిత్రమునుండి ఎత్తిన ఛాయాపట చిత్రము.]

# ఆమె చూపులు

కలువకన్నెల మొలకనవ్వుల
  పిలుపులకు మేనెల్లఁ గ్రమ్మి
  పులకలకు తెగిపడ్డ చుక్కల
  వలపు తేజస్సో,—
సంజకెంపుల మసకచీఁకటి
  చాయలన్ జిగురాకుచాటున
  సన్నపాటలఁ బాడు కోయిల
  కన్నెవిరహంబో,—
విరిసి విరియని రేకు రేకున
  మెరుఁగురంగులఁ దోఁచు జీరల
  మురువు గులికెడి పూపపువ్వుల
  జవ్వనపుఁదలఁపో,—
కలసి యామెవిశాలనీలా
  కాశసదృశమనోజ్ఞదృష్టుల
  నలుపుదారులవెంటఁ జక్కని
  కళలతో జారెన్.
ఆమెచూపులఁ బగులకెవ్వరి
  కర్థమే కానట్టి వెన్నియొ
  యమృతమోహన నీరవ చ్ఛా
  యలు మెలంగినవి.
ఆమె చూపుల నైల్యగుణులఁ బ్రణ
  యాంబరంబులె వ్రాలిపోయెనో !
  ఆమె చూపులె జారిపోవుట
  నభ్యసించినవో !!

—వజ్ఝల కాళిదాసు.

# పెంపుడు కుక్కలు

## (వినోద వ్యాసము)

నాడు కాలేజీకి సెలవుదినంకదా అని నారాయణరావు, నేను జంతుప్రదర్శనశాల చూడడానికి బయలుదేరినాము. అక్కడ కలసినాడు మాకు ప్రకాశం. పరీక్షలలో వాడి తెలివితేటలు అట్టే ఉపచరించేవి కావుగాని, నిజంగా ప్రకాశం చాలా చురుకైనవాడు. వాడితో కూచుంటే మా హాస్టల్‌లో ఎవడికీ చదువు, సంధ్య తలపెట్టడానికి మనసు ఉండేదికాదు. తమాషా అయిన కబుర్లు చెప్పి, నవ్వించి, అందరినీ రంజింపజేసేవాడు.

కులాసాగా ముగ్గురం కొంతసేపుతిరిగి, కబుర్లు చెప్పుకుంటూ, ప్రొద్దుగ్రుంకే సమయానికి సముద్రతీరం చేరుకుని, యిసకలో కూచున్నాం విశ్రాంతికి. మావలెనే అనేకులు తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, యువకులు, వృద్ధులు, స్త్రీలు, చిన్నపిల్లలు, అందరూ 'బీచి' వద్ద చల్లగాలికి విహరించడానికి వచ్చారు. మాకు కొంచెం దూరంలో హాయిగా మాట్లాడుకుంటూ, కిలకిల నవ్వుకుంటూ ఒక దొర, దొరసాని నిల్చున్నారు కెరటాలవేపు చూస్తూ. ఆమె ఒక తెల్లని జూలుకుక్క నెత్తుకొని, దానిని రొమ్ముకదుముకుంటూ, దానితో ఏవో కబుర్లుచెబుతూ, దాని కళ్ళలోకి చూస్తూ, ఎంతో ముద్దుగా దాని చెంపను తన చెక్కిలిచేర్చి, ఓరచూపులతో మధ్యమధ్య దొరగారివైపుచూసి నవ్వుతూ ఉంది. ఆదొరసానివైపు రెప్పవాల్చకుండా అట్టే చూస్తూ, మాటామంతీ లేక కూచున్నాడు ప్రకాశం. వాడివైఖరి కనిపెట్టి నారాయణరావు, నేను, ముసిముసిగా నవ్వుకున్నాం.

"నవ్వడ మెందుకు?...నిజం చెప్పండి, ఆమె చక్కదనం మిమ్మల్నిమాత్రం ముగ్ధులను చెయ్యడం లేదా?" అన్నాడు ప్రకాశం.

"...ఆదొరగారు ఆమెప్రియుడు కాబోలు,—అదృష్టవంతుడు!" అన్నాడు నారాయణరావు.

"నే నాలోచిస్తున్నది అతగాడిగూర్చి కాదు,..." అని యేమో చెప్పబోయినాడు ప్రకాశం.

"ఆమెనుగూర్చేలే! నీచూపులే చాటుతున్నాయి ఆసంగతి." అన్నాను నేను వేళాకోళానికి.

"అదికాదోయి! నే నాలోచిస్తున్న దేమంటే, 'ఆదొర ఆమెకు ప్రియుడైనా, భర్తఅయినా, అతనికంటె వెయ్యిరెట్లు ఆకుక్క అదృష్టవంతురాలుకాదా?' అని. నా ఊహలన్నీ యిప్పుడు కుక్కలమీదికి పోతున్నాయి అంతేకాని,—" అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"ప్రకాశం! జ్ఞాపకంఉందీ నీకు, మనం లోగడ చదివిన టెన్నిసన్ పద్యం? ఎవతెనోగూర్చి వ్రాస్తూ, 'ఆమె రవికనై ఉంటే గుండె తాకుతూ ఉందునుకదా; ఆమె కాలిజోడునైఉంటే పాదాలు ఒత్తుతూ ఉందును కదా; ఆమె జుట్టునైఉంటే చెంపలు ముద్దాడుతూ ఉందును కదా!' అని విలపిస్తాడు కవి? అట్లా ఉంది కాబోలు నీహృదయారాట మిప్పుడు! దేవుడు నిన్ను మనిషిగా పుట్టించినాడు కాని, ఆకుక్కగా పుట్టించి ఉంటే, ఎంతో సంతోషించి ఉందువనుకుంటా! ఏం?—" అన్నాడు నారాయణరావు,

"నిస్సందేహంగా!" అన్నాడు ప్రకాశం.

ఆమాటకు మేమిద్దరం ఉప్పెనగా నవ్వుకున్నాం. అందుమీద ప్రకాశం మావేపుతిరిగి ముఖం గంభీరంగా పెట్టి, కుక్కలమీద చిన్నఉపన్యాసం ప్రారంభించాడు:

"సృష్టిలోకల్లా మానవుడిది ఉత్తమజన్మ అని చెప్తారు పెద్దలు. నిజమే కావచ్చును; నిలవదీసి అడిగితే మాత్రం ఋజువుచెయ్యడానికి తటపటాయించ వలసి వస్తుంది. కాని జంతువులలోకల్లా అదృష్టజీవులు పెంపుడుకుక్కలే అన్న సంగతి సులువుగా రూఢిపరచ వచ్చును. ఎద్దు, గాడిద, మేక మొదలైనవి ఎంత దురదృష్టజంతువులో ఆవు, పిల్లి, కుక్క మొదలైనవి అంత అదృష్టజంతువులు. అదృష్టజంతువులలో కల్లా

అదృష్ట జంతువులు పెంపుడు కుక్కలు !

"మానవుడే జంతువునీ ఫలాపేక్షలేక మచ్చిక చెయ్యడు. ఆవుని పాలకోసం, గుర్రాన్ని స్వారినిమిత్తం, ఎద్దుని నాగలి దున్నడానికి పెంచుకుంటాడు. అట్లే గాడిదచేత బరువులు మోయింపజేస్తాడు. మేకని, గొర్రెని, కోడిని, మాంసంకోసం పెంచి మేపుతాడు. అందుకూ పనికిరాని జంతువును తోలుకోసమో, బొచ్చుకోసమో, ఎముకలకోసమో పెంచి సంహరిస్తాడు. ఇక ఏలాభమూ తలపెట్టక పెంచే జంతువు లొక్క కుక్కలే ! అవి పనిచెయ్య నక్కరలేదు. గ్రుడ్లు పెట్ట నక్కరలేదు. బలిపశువులుగా ఉపయోగపడ నక్కర లేదు. హాయిగా తింటూ, తిరుగుతూ, మహారాజ భోగంతో బ్రతకడానికి నోచుకున్న ధన్యజీవు లవి !

"ఇది కలియుగమన్నమాట మరచిపోయి, పార్వతీ పరమేశ్వరు లెప్పుడైనా భూసంచారానికి బయలుదేరి గ్రహచారవశాత్తూ నాకంట బడడమే తటస్థిస్తే, రాబోవు జన్మలో నన్ను పెంపుడుకుక్కగా పుట్టించమంటాను. ఇట్లాంటి విషయాలలో 'స్వదేశీ' అభిమానాలు పెట్టుకుంటే లాభంలేదు. ఇంగ్లీషుకుక్కగా పుడితే నిజంగా జన్మసార్థక మవుతుంది. నరజన్మలో తీరని హృదయబాధకమైన వాంఛలు కొన్ని అప్పుడు తీర్చుకోవచ్చును. కొందరు దొరసాన్లకు తమ ఆప్త బంధువులమీదకంటె పెంపుడుకుక్కలమీద యెక్కువ అభిమానమట ! యజమానురాలితొడమీద కూర్చుని, ప్రేమతో ఒడలంతా తాకుతూ, నిర్భయంగా నలుగురిలో మూతిముద్దులాడగల మహాభాగ్యం సీమకుక్కలకుగాక ఎవరికి లభ్యమౌతుంది ? ఆమె యెడల కన్న బిడ్డలకు లేని చనువు, గృహయజమానికి లేని అధికారం చెలాయించగలవు అవి.

"సీమకుక్కలది నిజంగా దేవేంద్రభోగం. వాటి మీద గృహయజమానికి, యజమానురాలికి, పిల్లలకు, బంధువులకు, నౌకర్లకు, అందరికీ గారాబమే ! వాటికి దుస్తులు, పరుపులు, కుర్చీలు, సోఫాలు, మిఠాయిలు, నౌకర్లు, వైద్యులు, మోటారుకార్లమీద షికార్లు, ఉత్తమజాతి కుక్కలతో సంబంధబాంధవ్యాలు యేర్పరచుకుందుకు తగిన అవకాశాలు, ఒకటేమిటి ?— భూలోకంలో అనుభవించతగిన భోగాలన్నీ వాటివే !

"ఈ తెల్లవాళ్ళు కుక్కలమీద ఖర్చుపెట్టే డబ్బు యింత, అంత కాదు. వేలకువేలు పోసి కొంటారు కుక్కల్ని. మన హరిశ్చంద్రుడే తెల్లదొర అయిఉంటే అడవిలో ఉన్నప్పుడు ఓ రెండు కుక్కల్ని సంపాదించి, వాటిని అమ్మేసి విశ్వామిత్రుడి అప్పు సులువుగా తీర్చగలిగి ఉండును— పెళ్ళాన్ని అమ్ముకోవలసిన అవసరమే లేకపోవును !

"అయితే, పులినిచూసి నక్క వాతలుపెట్టుకున్నట్లు, మనవాళ్ళుకూడా యిప్పుడిప్పుడు కుక్కలమీద మోజుపడడం నేర్చుకుంటున్నారు. మన జమీందార్లకు, ఉన్నతోద్యోగస్థులకు తమ కుక్కలమీద ఉండే అభిమానంలో నూరోవంతు తమ ప్రజలమీద, సేవకులమీద ఉంటే, దేశంలో యింత అశాంతికి కారణమే లేకపోవును. ప్రపంచంలో కుక్కలనిమిత్తం వ్యయమయ్యే ధనం మనుష్యులనిమిత్తం వినియోగపడితే, ఏ దేశంలోనూ దరిద్రమనేది ఉండక నేపోవును !

"కుక్కలమీద మానవుడికి యింతమమత ఉండడానికి నిజమైన కారణంకూడా ఏదీకనబడదు. కుక్కలు అందమైన జంతువులనీ; నేర్పితే సర్కస్‌వాళ్ళవలె మొగ్గలువేసి చూపరులను రంజింపజేస్తాయనీ; దొంగలను రానీయకుండా యజమానుడియిల్లు కాపాడతాయనీ; వేటకు ఉపయోగపడతాయనీ; ఇంటో పిల్లులను, ఎలకలను చేరనియ్యకుండా చేయగలవనీ; సమయంవస్తే పాముల్నిగాని, పెద్దపులినిగాని ఎదిరించి, చంపి యజమానిని రక్షిస్తాయనీ; మనుష్యులవలెనే వాటికి బుద్ధిజ్ఞానాలు మెండుగా ఉన్నాయనీ; ధైర్యం, భక్తి, విశ్వాసం, స్నేహం మొదలైన గొప్పగొప్ప గుణాలుగల ఉత్తమజాతి జంతువులనీ, ఏవేవో అసందర్భమైన కారణాలు చెప్పడం తెలివిహీనం ! కుక్కలకంటె అందమైనవి, చురుకైనవి, విశ్వాసంగలవి, ధైర్యంగలవి అనేక జంతువులున్నాయి. కాని సమస్త జీవరాసులలోను కుక్కలే నరుడికి ప్రాణస్నేహితులై ఉంటూఉండడం కేవలం భగవంతుడి చిద్విలాసం !

"మనవాళ్ళకంటె తెల్లవాళ్ళకు కుక్కలమీద శ్రద్ధాభిమానాలు అధికం. ఇంగ్లీషుకవులెందరో వ్రాశారు కుక్కల్నిగూర్చి తమ గ్రంథాలలో. నవలలలోను, నాటకాలలోను, పద్యాలలోను కుక్కలను పొగడి, గౌరవించి, వర్ణించి, వాటిచేష్టలను మెచ్చుకొని, గుణాలనెన్ని, వాటికోసం నెత్తీనోరూ కొట్టుకొని, గుండెపగిలేటట్లు యేడ్చిన కవులున్నారు వాళ్ళలో! ఇంగ్లీషువార్తాపత్రికలలో కుక్కల ప్రసంగం లేకుండా ఉండదు. ఫలానా ప్రభువు ఆస్ట్రేలియా నుండి ఒకజోడా గొర్రెమూతి కుక్కపిల్లల్ని విమానం మీద తెప్పించారనీ, ఫలానా మిస్సమ్మగారి బొచ్చుకుక్క సుఖప్రసవమై పావుడజన్ కూనలను కన్నదనీ, ఫలానా పేరుగల పందెపుకుక్కను దొంగిలించిన వాని ఆచోకీ తెలియజేయగలవారికి వెయ్యి బంగారుకాసులు బహుమాన మియ్యబడుననీ, బ్రిటిష్ జంతుప్రదర్శనశాలకు క్రొత్తగా తెప్పించబడిన తోకలేని కుక్క న్యూమోనియా జబ్బువలన అస్వస్థతగా నున్నదనీ, నక్కవేట కొకానొక కోటీశ్వరుడు మూడువందల కుక్కలతో బయలుదేరుచున్నట్లు తెలియవచ్చుచున్నదనీ, కుక్కలనుగూర్చి ఎన్నో ముచ్చట్లు, వ్యాసాలు, ప్రకటనలు అనునిత్యం ప్రకటింపబడుతూ ఉంటాయి పత్రికలలో. కుక్కల్ని పెంచి వాటిని తరిఫీదు చెయ్యడమే కొందరు దొరలకు ముఖ్యవృత్తి. ఇంగ్లీషు జంతువైద్యశాలలు ముఖ్యంగా కుక్కలకోసమే యేర్పరచబడినవి! కుక్కలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన సైకిల్సు ఉన్నాయి. టోపీలు ఉన్నాయి. ఆట వస్తువులున్నాయి. కుక్కలకోసం ఇన్సూరెన్సుకంపెనీలున్నాయి. బిస్కట్ ఫ్యాక్టరీలున్నాయి. హోటేళ్ళున్నాయి, రెయిలుబండ్లలో ప్రత్యేకంగా పెట్టెలు యేర్పాటై ఉన్నాయి. తెల్లవాళ్ళ ధర్మమా అని, నేటి మానవసంఘంలో కుక్కకు ప్రత్యేకస్థలం యేర్పడింది.

"మనపూర్వుల కెందుచేతనో కుక్కలపట్ల అట్టే అభిమానం కుదరలేదు. భారతరామాయణాదిగ్రంథాలలో కుక్కల ప్రశంస బహుతక్కువ! కుక్కల్ని స్తుతిస్తూగాని, కుక్కలకు అంకితమిస్తూగాని మన కవులెవరూ పుస్తకాలు వ్రాయలేదు. మన ప్రబంధాలలోని నాయికామణు లెవరూ పెంపుడుకుక్కల్ని వెంటబెట్టుకొని ఉద్యానవనాలలో విహరించినట్లుగాని, కుక్కల చేత ప్రియులకు రాయబారాలు పంపినట్లుగాని లేదు. ఎంతసేపూ చిలకలు, గోరువంకలు, నెమళ్ళు, లేడిపిల్లలు మొదలైనవాటిమీదనే ముచ్చట పడేవారు. విరహవేదనలో తాము ఒళ్ళుమరచి ఉన్నప్పుడు సహితం ప్రియుడేవచ్చి యెదుట నిల్చున్నట్లు భావించుకొని చెలికత్తెలను, చెట్లను కౌగలించుకునేవారు కాని, కుక్కలమీదపడి యేడ్చేవారుకారు. మనరాజులు కూడా అశ్వాధిపతులు, గజాధిపతులు అని పేరు పొందడానికి వేలకొలదీ గుర్రాలనో, గోవులనో, ఏనుగులనో, ఒంటెలనో పెంచి భరించేవారుకాని శునకదళాధిపత్యానికి దేవులాడేవారుకారు. బహుశః, పర్ణశాలలో సీతారాములవద్ద ఒక జత కుక్కలే ఉన్నట్లయితే, రావణాసురుడు ఆపొలిమేరకు రాలేకపోవును. అడవిలో దమయంతివద్ద ఒక కుక్క ఉండి ఉంటే, నలుడు చెప్పకుండా పారిపోయినప్పుడది పసిగట్టి అతనిజాడ కనిపెట్టి యుండును. ద్రౌపది తనవెంట ఒక కుక్కను తీసికొనిపోయిఉంటే, కీచకుడు పైబడడానికి వచ్చినప్పుడు దానిని ఉసిగొలిపి సుఖముగా తప్పించుకొని యుండును. కీకారణ్యాలమధ్య చిన్న పర్ణకుటీరాలలో నివసించే మహాఋషులుకూడా ఎవరూ కుక్కల్ని పెంచుకున్నట్లు లేదు. అహల్యవంటి రూపవతియైన పడుచుపెళ్ళాన్ని యింట్లో ఉంచుకొని కూడా, గౌతమముని కుక్కనొకదానిని పెంచుకోకపోవడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే!

"మన దేవుళ్ళలోకూడా ఎద్దువాహనంవాళ్ళు, ఎనుబోతువాహనంవాళ్ళు, గద్దవాహనంవాళ్ళు, నెమలివాహనంవాళ్ళు ఉన్నారేకాని శునకవాహనం వాళ్ళెవరూ లేరు. నానాఅవతారాలు యెత్తిన విష్ణుమూర్తి సహితం నరసింహావతారం యెత్తినాడు కాని, గ్రామసింహావతారం యెత్తడానికి ముచ్చట పడలేదు!

"మన పూర్వులకు కుక్కలంటే మోజులేకపోవడం సరేకదా, మీదు మిక్కిలి వాటియెడల ఒకవిధమైన

తృణీకారభావం, అయిష్టత, ద్వేషం ఉండేవని తోస్తుంది. వాడుకలో ఉన్న సామెతలనుబట్టి చూస్తే అట్టి అభిప్రాయం దృఢపడుతుంది. నీచంగా ప్రవర్తించే వాని పని 'కుక్క బుద్ధి' కలవాడనీ, పిరికివాడిని 'కుక్కవలె తోకముడుచుకున్నాడ'నీ, కలహించేవాళ్ళను 'కుక్కలవలె కాట్లాడుచున్నార'నీ, ఉన్నత పదవిలో ఉన్న అల్పుని 'అందలమెక్కి తోళ్ళుకొరికెడు కుక్కవంటివాడ'నీ, తప్పుచేసినవారిని దండించుట 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' అనీ—ఎన్నో సామెతలున్నాయి వాడుకలో.

హిందూసనాతనులకు కుక్కలు అస్పృశ్యజంతువులు! మహమ్మదీయులకుకూడా కుక్కలంటే గౌరవంలేదు. కాబట్టే క్రమంగా హిందూదేశంలో కుక్కల ప్రభ క్షీణించిపోయి, వాటి బ్రతుకు అధ్వాన్నమై పోయింది. ఎంగిలాకులకు దేవులాడుతూ, అంట్లగిన్నెలు నాకుతూ, దొంగతిళ్ళకు ఆశించి యిళ్ళలో జొరబడి కర్రదెబ్బలు తింటూ, మానవస్నేహానికి పరితపించి నిరాశవలన వెర్రెత్తిపోతూ, దుర్భరమైన క్షుద్రజీవనం గడపవలసిన గతి పట్టింది మన ఆర్యావర్త శునకరాజములకు!

"ఎంత పుచ్చిన మిరియాలైనా జొన్నలసాటి చెయ్యవా' అన్నట్లు, కాలచక్రం క్రిందుమీదై ఒక్కొక్కప్పుడు కుక్కలబ్రతుకు అపసవ్యంగా పరిణమించినా, మొత్తంమీద వాటిది అదృష్టజీవనమే అని ఒప్పుకోక తప్పదు. ఈ ఇరవయ్యోశతాబ్దపు నాగరికత దినదినాభివృద్ధియై, మరో వందసంవత్సరాల పిమ్మట కుక్కలను నరుడి స్నేహితులుగా మాత్రమే గాక, యజమానులుగాకూడా చేసివేయగలదు! కుక్కను చంపితే గుడి కట్టిస్తేకాని ఆపాపం పోదని ఉన్నది మన ధర్మశాస్త్రాలలో. ఈ శాస్త్రాలు మారిపోయి, నవీన నాగరికతకు అనుగుణ్యంగా క్రొత్తశాస్త్రాలు నిర్మింపబడినప్పుడు కుక్కను పెంచడమే నరుడికి మోక్షసాధనమనిన్నీ, కుక్కను పూజించనివాడు రౌరవాదినరకానికి పోతాడనిన్నీ, పెంపుడు కుక్కను చంపినవాడికి మరి పుట్టుగతులు ఉండవనిన్నీ వ్రాయవలసి వస్తుంది!"

—తాత కృష్ణమూర్తి, బి.ఏ.,యల్.టి.

## నిజరాగము

జనపమోపు నెత్తిని మోసికొనుచు నెక్కె
బల్లకట్టును పాలేరు : వాని వెనుక
మేఁకపోతుతో నెక్కెను మేటిగొల్ల
డొక్కరుఁడు వెంటనే పోతు మెక్కఁదొడఁగె
పసుపురంగు పువ్వులు వసివాడియున్న
మోపు చివురులు నూతిని జాపిసాపి.
కసరెఁ బాలేరు 'ఖామందు'గారు చూచి
కోపపడుదురటంచును. గొల్లఁడువిని
మేఁకఖామందుగారోయి మేము నిన్న
రెండుపువ్వుల కేనుని గండునగియె ;
దాఁ గడ్డంబు సవరించి తనవునిమరె.

*     *     *     *     *

రోలుతలగడగాఁగను రాలు తనకు
మెత్తనగు పక్కగాఁగను సత్తమిల్లి
నిదురబోయెడు, చెంచువాఁ డదురుబెదురు
లేక చరకుటీరాంతరశ్రీ యొకఁడు.
వాని చిన్నబిడ్డ, కొడుకు, వానికూఁతు
రాకసముక్రింద నెంతయు జోకముగను
బూసినట్టి యెఱ్ఱతురాయి పూలచెట్టు
చాయలందు గొడిగరాలు చాల నేరి
యచ్చనల మాట నాడుచు నలరుచుండ్రి.
సాంధ్యరవిరశ్మి మోముపైఁ జక్కని నెఱి
శోభఁ గూర్ప వానియువతి చూచిచూచి
ముంచుచుండెను కాల్వలో మంచినీరు.
అతఁడు నిదురింప నాపిల్లలాడుకొనఁగ
నల్ల యిల్లాలి చూపులు పల్లవింప
నాస్థలం బొక్కహర్మ్యమై యాత్నమెఱసె.
వానికల నేర్వ నాపిల్ల లాననముల
నుండి యుండి మొలకలెత్తుచుండు నవ్వు
దొంగిలింప నాయిల్లాలి తొంగలికను
ఱెప్పపాటులు లెక్కింపఁ బ్రియపడియెను
నామనంబు నిమేసంబు నన్ను మఱచి.

—కవికొండల వేంకటరావు బి.ఎ.,బి.యల్.

# సూరి సిద్ధాంతం

అప్పుడేవచ్చిన ఆంధ్రపత్రిక పేజీలు తిరగేస్తూ 'ఈ హరిజనసమస్య మొత్తంమీద జనాన్ని అల్లకల్లోలం చేస్తున్నదిరా. సూరీ' అన్నాను.

సూరి బద్ధకంగా నవ్వి 'జనానికి అల్లకల్లోలం కావటం చాలా ఇష్టమని నీకు తెలుసునా?' అన్నాడు.

, నాకు కోపంవచ్చింది.

'నీకు దేన్నిచూసినా గౌరవంలేదురా, సూరీ' అన్నాను.

'ఒకరికున్నట్టు!'

'మతగురువులంతా చూడు ఎంత ఘోష పెడుతున్నారో!'

'పులివిస్తరాకుదగ్గిర కౌకులూ, ఎముక దగ్గిర కుక్కలూ, బహిర్దేశంలో పందులూ గోలచేసినట్టు!'

'మతాన్ని వాటితో పోలుస్తావా?'

సూరి బిగ్గిరిగా నవ్వటం మొదలుపెట్టాడు.

'ఇందులో హాస్యం నాకర్థంకాలేదు!' అన్నాను తీక్ష్ణంగా.

సూరి వినిపించుకోకుండా 'పోలిక మతానికి వాటికీ కాదు; మతగురువులకూ వాటికీ!' అని మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

తెలుగులో తిట్టటానికి ఉండదగినన్ని మాటలు లేవు. ఆ ఉన్నవాటినే రెండుమూడు వరసలు ప్రయోగించిన మీదట సూరి దారికి వచ్చాడు.

'ఒరే! నీకున్న మెదడే బహుకొద్ది. అకాస్తాకూడా పాయిజనయిపోయింది నువ్వు మెంటల్ గా చచ్చినవాడి కింద లెక్క.''

'ఎందువల్ల? నీమాదిరిగా పవిత్రమైన విషయాలను హేళనచెయ్యను గనకనా?'

'పవిత్రమేమిట్రా, నీమొహం! నీ దేమతం?'

'అట్లా అడగటంలో నీ అభిప్రాయం ఏమిటి?'

సూరి నావైపు వేలుపెట్టి చూపిస్తూ, 'చూశావా! అంత చిన్నప్రశ్నకు కంగారుపడకుండా సమాధానం చెప్పలేవు. నువ్వు మెంటల్ గా చచ్చావంటే ఎందుకు ఎగిరి పడతావు'

'నాది హిందూమతం.' అన్నాను గర్వంగా.

'అంటే నీకు ఆమతాన్ని చూస్తే గౌరవమనా? లేక నీకు దాన్నిగురించి ఏమైనా తెలుసునా?'

'కావలిస్తే నాకు హిందూమతాన్నిగురించి ఏమీ తెలీదని ఒప్పుకుంటాను. కాని నాపూర్వులది హిందూమతం... నాతండ్రులదీ, తాతలదీ, నాదీ ఆమతమే!'

మళ్ళీ సూరి నవ్వటం మొదలుపెట్టాడు.

'ఎందు కావెధవనవ్వు?'

'ఏమిట్రోవ్! మతంకూడా (నవ్వు) ఆస్తిల్లే—గుణాలల్లే—రోగాలల్లే (నవ్వు) హెరిడిటరీగా—సారీ!—వంశపారంపర్యంగా (నవ్వు) వస్తుందా ఏమిట్రోవ్! హః! హః! హః! హః!'

'ఏమిటా తెలివితక్కువ ప్రశ్న? ఎందుకు రాకూడదు?'

సూరి తన నవ్వును ఒక్కదెబ్బతో స్విచాఫ్ చేసుకుని పెద్దగుడ్లుచేసి నావంక చిత్రంగా చూడటం మొదలుపెట్టాడు.

'ఏమట్లు చూచెదవు?'

'మరేంలేదు. మనిషి జ్ఞానానికంతుంది కాని అజ్ఞానానికి లేదు!'

సూరి ఆమాట అన్నతరవాత నాకు చాలాసిగ్గేసింది. వాడి పద్ధతులూ అభిప్రాయాలూ నాకు విపరీతంగా కనపడవచ్చుగాక; వాడి తెలివెక్కడ నాతెలివెక్కడ! నేను వాడితో ఇంతసేపు నాకేమీ తెలీని విషయాన్ని గురించి వాదించటమేమిటి? వర్ణాశ్రమ ధర్మాలనీ, ఆచారాలనీ, నీతనీ, మతమనీ అందరూ అంటుంటే విని సంభాషణలో వాటిని గురికి ఒకమైలు అటూ ఇటుగా ప్రయోగించటమేకాని వాటినిగురించి నాకేంతెలుసు?

నేను తెల్లజండా ఎత్తి సంధికి జొరబడ్డాను.

'ఇదంతా ఎందుకూ్కాని సూరీ మతం, ఆచారాలు మొదలైనవాటిని గురించి నీకు తెలిసింది చెప్పు విం టాను,' అన్నాను.

'విను, చెబుతాను, నీకూ జంతువుకూ భేదం ఏమిటి ?'

'అ దెందు కిప్పుడు ?'

'ఒరే! ప్రశ్నకు సమాధానం చెప్పటానికి అంత గందరగోళ మెందుకురా! ఆ వెధవగుణం మానెయ్యి. చెప్పు ?'

'ఏముందీ! మనం నిలువుగా నడవగలం. ఇంకా— ఇంకా—వెధవది ఒక్కటీ జ్ఞాపకంరాదేం!'

సూరి నాకడ్డంవచ్చాడు.

'నిలువుగానడిచి నువ్వెందంగా ఉన్నదేంలేదు ఆ భేదాలన్నీ నేనే చెబుతాను. నువ్వు మాట్లాడగలవు. అందువల్ల అబద్ధం ఆడటం ఒకటి నేర్చుకున్నావు. రాయటం చాతవును. దొంగదస్కతులు పెట్టటం కూడా చాతవును—ఎవరో అన్నట్టు. సంగీతం పాడ గలవు, ఎక్కిరించగలవు. అవన్నీ అట్లాఉంచి నీకూ జంతువుకూ కల ముఖ్యమైన భేదంచెప్పు'

'నాకు తెలీదు.'

'నీకు బుద్ధిఉంది! జంతువుకులేదు!'

'కావచ్చును. కాదనను.'

'అది అట్లాఉంచు. నీదగ్గిరఉన్న వస్తువులన్నీ నువ్వు ఉపయోగిస్తున్నావని ఉందా ?'

'లేదు. నాదగ్గిర రేజరుంది ఒకసారి దాంతో చేసు కునేటప్పటికి మొహంనిండా గాట్లు —'

'సరే! సరే! అదంతా తరవాత. నీబుద్ధిని నువ్వెప్పు డయినా ఉపయోగించిన జ్ఞాపకం ఉందా ?'

'అయ్యో! ఎందు కుపయోగించను ? ప్రతిక్షణం—'

'ఓరి మూఢుడా? నీకు బుద్ధంటే అర్థంకాలేదు. మనస్సనుకుంటున్నావు. మనసు వేరు బుద్ధి వేరు. వాళ్లూ వాళ్లూ అనేకవిషయాలను గురించి అనుకుంటున్న మా టలన్నీ జ్ఞాపకం ఉంచుకుని వాటిని నిజంకింద అంగీక రించి వాటిప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించ టంకాదు.. దేన్నిగురించయినా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరుచుకున్నావా? నిజంచెప్పటం మంచిదని విన్నావు. బాగానేఉంది. నిజంచెప్పటం తప్పుకావచ్చు నిజంగా! నువ్వెప్పుడన్నా ఆవిషయం నీబుద్ధికి పని ఇస్తేగా!'

'ఆఁ! ఆఁ! నీ అభిప్రాయం నాకిప్పుడు చక్కగా తెలుస్తున్నది. ఇక పైకివెళ్ళు.'

'ఐసీ! ఇంగ్లీషును తర్జుమాచెయ్యటానికి నీకూ అభ్యంతరం లేదన్నమాట.'

'ఇంతసేపటినించీ మాట్లాడుతున్నాం. మతాన్ని గురించి నువు ఒక్కముక్క చెప్పలేదు.'

'దానికే వస్తున్నాను. నీకు తెలిసినంతలో ఏజంతువు కైనా మోక్షముందా ?'

'నా కేమతాన్నిగురించీ తెలిసి అఘోరిస్తేగా! జం తువులకు మోక్షంలేదేమో అనుకుంటాను.'

'జంతువులకు మతంకావాలా ?'

'బహుశా అవసరంలేదు'

'నీవంటి జంతువులు లోకంలో ఎంతమంది ఉన్నా రంటావు ?'

'లక్షలు! కోట్లు! సామాన్యంగా నేను తెలివిగల వాడికింద లెక్క! తెలుసా నీకాసంగతి ?'

సూరి నవ్వాడు

'తెలుసును. వీళ్ళందరికీ మతంతో ఏమీ అవసరం లేదని తెలుసుకో. వాళ్ళంతా ఆహారం, నిద్రా, మై థునం స్టేజి దాటలేదు. ఆమాడూ వాళ్ళకిప్పిస్తే మతం ఏమైనా వాళ్ళకు తొందరలేదు. సంఘం ఏంచేస్తున్నది? వాళ్ళ కామూడూ అందకుండా చేస్తున్నది. మతగురువు లేంచేస్తున్నారు? వాళ్ళకు మతం ఇస్తున్నారు. వాళ్ళకు మతం సరయిన ఆహారం కాకపోవటంవల్ల అనేకజా డ్యాలు బయలుదేరుతున్నై. నీ సూపర్స్టిషన్ అనేది ఈతరగతి జాడ్యమే. బలులు, యజ్ఞాలు, సంతర్పణలు, లక్షవత్తుల దీపాలు, లక్షపత్రిపూజ—పండికి రోజుకు అణాడబ్బులు దొరక్క ఒకచెంప కొంతమంది మాడు తుంటే!

'నీమతం ఎంతదరిద్రపుమతమంటే, ఒకచెంప వంశపారంపర్యంగా వస్తూనూ ఉంటుంది, నువ్వు పిలకకత్తిరించి క్రాపింగుపెట్టినప్పుడూ, బూటూ సూటూ వేసినప్పుడూ, వితంతువును వివాహంచేసినప్పుడూ, నీ స్నేహితులతో భోజనంచేసినప్పుడూ, చివరకు స్టీమరెక్కినప్పుడూ పోయి మళ్ళీ ఎట్లాగో నీదగ్గిరికి తిరిగి వస్తూ ఉంటుంది. ఇవాళ శూద్రవాళ్ళతో అన్నంతింటే మతంపోయింది కదా, రేపు విధవావివాహం చేసుకుంటే ఏమనటానికి వీల్లేదు. ఈలోపల అప్పుడే మతం మళ్ళీ వచ్చిఉంటుంది

'ఇంకోచిత్రం చూడు. నేను మతానికి ప్రచారం లేదంటాను'

'అది నేను వప్పుకోను. బుద్ధుడు, శంకరుడు, క్రీస్తు, వివేకానంద, మహాత్మాగాంధి, అంతా ప్రచారం చేసినవాళ్ళే.'

'అందుచేత నేను నాబుద్ధికితోచినమాట అనకూడదంటావా ?'

'నూకీ నువ్వు తెలివికలవాడివి కావచ్చుగాక శంకరాచార్యులూ, క్రీస్తూ, మహమ్మద్—వీళ్ళకంటెనా?'

'ఎందుకు కాకూడదురా ? స్వరాజ్యం, స్వేచ్ఛ అని గొంతు పోంగుకుపోయ్యేదాకా అరుస్తారే నాబుద్ధిని వాళ్ళబుద్ధులకు దాస్యం చెయ్యమన్నావా? మతం హిస్టరీ అనుకున్నావా, జాగ్రఫీ అనుకున్నావా బోధ చెయ్యటానికి? బుద్ధుడిమతం తీసుకున్నవాళ్ళలో మరొక్క బుద్ధుడున్నాడా? నిజమైనక్రైస్తవుడు క్రీస్తుకడేనా ? ఇంకొకడున్నాడా? అర్జునుడి తరవాత జీవితంలో భగవద్గీత అర్థంచేసుకున్నవాడి లక్షణాలేవైనా ఉన్నవా? పైగా ఈమతాలు ప్రచారం కావటానికి ఎంత నెత్తురు ప్రవహించిందో తెలుసునా? ఇదంతా ఎందుచేత ?'

'మిగిలినవాళ్ళు పశుప్రాయులు కావటంచేత నేనంటావు. కావచ్చును. కాదనను. సరేకాని ఈ విషయం నీకొక్కడికే తట్టటం ఎందుక ? ఇంకెవ్వరూ ఎందుకు గ్రహించలేదు ?'

'ఇంకెవ్వరికీ తట్టలేదని ఎట్లా చెప్పగలవు? లోకంలో ఉన్న పుస్తకాలన్నీ చదివావా ?'

'మనకు తెలిసినంతలోనే.'

'నిజానికి ఈవిధంగా చెప్పినవాళ్ళేమీ లేరు. కాని ఎవరికీ తట్టదనేది పొరపాటు. నేను నిరుద్యోగిగా ఉన్నాను కనక ఈవిషయం మాట్లాడుతున్నాను నీతో. లేకపోతే నాకేంపట్టింది నీతప్పులు దిద్దేటందుకు ?'

'ఎవడికైనా మతంకావలిస్తే ?'

'ఉన్నమతాలను గురించి చదువుతాడు. తనమతం సృష్టించుకుంటాడు. నాచొక్కాలు నీకెట్లా సరిపోతై? ఇంకోచిత్రం చూడు. చాలామంది అభిప్రాయం ఆచారాలే మతమని.'

'మతాన్ని తృణీకరించావు. ఆచారాలనుగురించి నీ అభిప్రాయం ఏమిటి? వాటినిచూస్తే నన్నా నీకు గౌరవం ఉందా ?'

'మీతాతగావంచానుచూస్తే నీకు గౌరవంఉందా?'

'ఆ'

'మీతాతగావంచా నువ్వుపయోగిస్తావా ?'

'నాకెట్లా పనికొస్తుంది ?'

'నిచిరిగి పాడుమాసిపోయిన ఆచారాలు నాకెట్లా పనికొస్తై? ఆచారమనేది కేవలం పనిముట్టు. మనిషి ఉపయోగంకోసం ఏర్పడ్డది ఆచారంకాని మనిషి ఆచారంకోసం ఏర్పడ్డవాడుకాడు. అని నువ్వెందుకు గ్రహించవు ? నీకేబుద్ధి ఉంటే. చిన్నతనంలో భర్తపోయిన పిల్లకు తిరిగిపెళ్ళిచెయ్యి, నువ్వెంతవరకు పశువువో ఆపిల్లా అంతేను. ఆమెకూ సంసారసుఖం కావాలి అని నీకింకెవరో చెప్పవలిసిన అవసరం ఏముంది? నువ్వు నిర్బంధంచెయ్యకపోతే ఆపిల్ల ఇంకోభర్తను చూసుకోదా? నీకు బుద్ధిలేదు కనకా, నీ బుద్ధిలేకపోవటం ఇతరప్రాణులకు అపాయకరంగా ఉంది కనకా నీమీద ప్రచారంచెయ్యాలి. గాంధీమహాత్ముడుచేసే ప్రచారం అదే. నీకు నిజంగా లాభించే ఆచారాలు నువ్వుంచుకో రోజుకు పదిస్నానాలుచెయ్యి. మడిగట్టుకో. సంధ్యవార్చు. తద్దినాలుపెట్టు. ఎవ్వరికీ అపకారంలేదు.'

'మాలవాళ్ళను ముట్టుకోవటం విషయం?'

'మాలవాళ్ళను ముట్టుకోకు. బ్రాహ్మణ్ణికూడా ముట్టుకోకు. ముట్టుకోమని ఎవరన్నారు? వాళ్ళతో కలిసిభోజనంచెయ్యకు. ఎవరితోనూ కలిసి భోజనం చెయ్యకు, భోజనంచెయ్యటం చాలారహస్యమైపని. కాని వాళ్ళను వెలివెయ్యటం ఎందుకు? నీబావిలో వాళ్ళు నీళ్ళుతోడితే నీప్రాణం ఏంపోయింది? వాళ్ళు నీయిళ్ళ మధ్య ఎందుకు నడవరాదు? అంత వాడితో సంబంధం లేకుండా ఉన్నవాడివి నీతెగిన చెప్పులు వాడి మొహాన ఎందుకు పారెయ్యటం? నీ చచ్చినగొడ్లు వాడి కెందుకు వప్పగించటం? వాడికూతురుకు నువ్వెందుకు కన్నుగొట్టటం? వాడే ఎవరిధర్మాన్నో చదువుకుని అధికారిగావస్తే వాడికి షేక్‌హాండు చెయ్యటం ఎందుకు? ఏం ఆచారంరా? నీమొహం ఆచారం! నీశరీరంలో ఏ మాలవాడి నెత్తురూ లేదని ఏమిటి నిదర్శనం?'

'ఒరే అటువంటి మాటలంటే నే నూరుకోను.'

'మాటవరసుకన్నానురా! నువ్వంటే నువ్వని కాదు. నీ ఆచారాలన్నీ తెగి దాళ్ళుపడి పోయినవని నమ్ముతావా?'

'నమ్ముతాను కాని, సూరీ, కొన్నికొన్ని ఆచారాలకు వ్యతిరేకంగా నడవటం అవినీతి కాదా?'

'హాం. నీతినిగురించి మాట్లాడుతున్నాడండీ గుంటడు. ఇదినీతి, ఇదినీతి కాదు అని రాసిపెట్టి ఉందా ఏమిటి?'

'ఎందుకులేదు.'

'నీతంటే ఏమిటని నీ అభిప్రాయం?'

'ఈమధ్య ఒకాయన రాసినవ్యాసం చదివాను

## ఓ ప్రభూ !

అట మహాదివ్యలోకహార్మ్యాంతరముల
సన్నని మెలుంగు దైన్యంబు జాలువార
ఎవ్వరో పిలుచురీతి విన్పించు నాకు
కలత నిద్దురలోన ఏకాంత మందు
కనుల నశ్రులు ధారలై గార నెవరొ
మచ్ఛిరోభాగ మభిషేకమానితముగ
సేయుచుండును——
ఇది పురాభూతసంబంధ మేమొకాని
ఎచటివో దుఃఖవేదనాప్రచలితములు
భయదనిశ్వాసములు మనఃపథము జేరి
కలచుచున్నవి ఓప్రభూ! గాఢలీల
ఈవి యోగ్రతపవ్యథాపృథులమైన
భారసహమైన జీవనవ్యాజమునకు
ఏమి యర్పింతు? తరియింతు నెట్లు? సామి!

——ఊటుకూరు సత్యనారాయణరావు.

తేరా. ఆడవాళ్ళఎదుట బూతుమాట్లాడటం అవినీతి. అవునా?'

'అవును. ఆమాటలు ఉప్పరఆడవాళ్ళ దగ్గిరా, దొమ్మర ఆడవాళ్ళదగ్గిరా మాట్లాడటం అవినీతేనా?'

'కాకపోవచ్చును.'

'కాకపోవచ్చునేమిటి? కాదు. ఒకదేశంలో మగవాడు అయిదునిమిషాలకో భార్యను చేసుకున్నా నీతిబాహ్యం కాదు. ఏమంటావు?'

'అవునులే. మనదేశం ఇంకాఅంత——'

'ఏడిచావులే. పసికూనకు పెళ్ళిచేసి వెంటనే మొగుడు పోతే 'అమ్మాయి, నీకర్మం ఇట్లా కాలింది కనక నువ్వు సంసారసుఖం కోరావా నీతిమాలినదాని వవుతావు కనక మాఅందరి తృప్తికోసం నువ్విట్లాగే పడుండు' అంటావా ఏమిటి? కొంత కొంతమంది సంఘసంస్కారులు చూస్తానుకదా, కాపరానికి పోకపూర్వం వైధవ్యం తటస్థించిన పిల్లల పునర్వివాహం విషయమే లెక్ఖచేస్తారు, ఒక సంవత్సరం, పది సంవత్సరాలు, కాపరంచేసిన మనిషికి సంసారసుఖం అక్కర్లేనట్టు.'

'ఎందుచేత?'

'పది సంవత్సరాలు కాపరంచేసిన దానికి మళ్ళీ పెళ్ళిచెయ్యమంటే అంతా తిరగబడి మాదు పగలగొడతారేమోనని. ఎనభైఏళ్ళదికానీ తిరిగి పెళ్ళిచేసుకుంటానంటే తప్పేమిటంట. ఇష్టమైనవాడే వస్తాడు.'

'ఒరే సూరీ. నువ్వు పడమటికన్నా పడమటవుతున్నావు. సంఘం ఏ స్థితికొస్తుందో ఆలోచించు.'

'వీరంతా కలిసి సంఘాన్ని ఉద్ధరిస్తున్నట్టు, నీవు

ఓపికఉంటే ఒక తమాషాసంగతి చెబుతాను విను. నేనెరిగిన ఒక కుర్రవాడుండేవాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయినారు దరిద్రుడు. ఎక్కువ తెలివిగలవాడు కాడు. ఒకరిద్దరు పెద్దమనుష్యులు పూనుకుని వాడికి వారాలు ఏర్పాటుచేసి స్కాలర్షిప్పిప్పించి చదువు చెప్పించారు. వాడు ఫిఫ్తుఫారం చదువుతూ సరిగా పరీక్షలకుముందు చచ్చేటంత జబ్బుపడి ఎట్లాగో బతికాడు కాని పరీక్షపోయింది. హెడ్‌మాస్ట రొకపిగ్ హెడెడ్ రాస్కెల్. స్కాలర్షిప్పివ్వనన్నాడు. వాడికి మొదట్లో సహాయంచేసిన ఒకరిద్దరూ చచ్చిపోయినారు. ఈ జబ్బులో వారాలు పోయినై. ఇక చదువుకునే ఆశ వదులుకుని వాడు మాతామహుడుగారింటికి పోయినాడు.

'వాడిపినతల్లి ఒకమ్మాయి ఉండేది. పెద్దమనిషయింది. కాపరానికి పోలేదు. వాడూ ఈడొచ్చిన పిల్లవాడు. అక్కడికిపోయినప్పటినించీ వాడు ఆ పిల్లతో ఫ్లిర్టింగ్ మొదలుపెట్టాడు తనకు తెలీకుండానే. ఆపిల్లా వాణ్ణి అడ్డగించలేదు. ఇద్దరూ ఒక్కచోట కూర్చుని ఆలోచనలు చేసేవాళ్ళు, ఇంకోళ్ళుచూసినా తిట్టటానికి వీలులేనంత దగ్గిరిగా కూర్చునేవాళ్ళు, ఏదో నెపం మీద ఒకళ్ళనొకళ్ళు తాకేవాళ్ళు. ఒకళ్ళవెంట ఒకళ్ళు పరిగెత్తేవాళ్ళు. ఇట్లా కొంతకాలం గడిచిపోయింది. ఒకరోజున ఆకుర్రవాడు కొద్దిగా లిమిట్ దాటాడు. ఆపిల్ల ఎదురుతిరిగి తిట్టింది. అందరితో చెప్పింది. అందరూ వాణ్ణి తిట్టారు. వాడుకూడా వాణ్ణి తిట్టుకుని, పశ్చాత్తాపపడి—పశ్చాత్తాపమంటూ ఒకటి ఉన్నట్టు—అక్కణ్ణించి లేచి పట్టణంవచ్చాడు తిరిగి...వాడు చేసినపనినిగురించి నీవ్యాఖ్యానం ఏమిటి?'

'నావ్యాఖ్యానమేముంది? నేనైతే వాణ్ణి చొక్కా విప్పి చర్మం పొంగేటట్టు తాటిమట్టతీసుకొని కొడుదును.'

సూరి కొంచెంసేపు మౌనంగా కూర్చుని, కథ సాగించాడు.

'ఎవరూ వాడికి ఉద్యోగం ఇవ్వలేదు. ఎవరో ప్లీడరుగారు దయదలిచి వాడికి తనదగ్గిర వాలంటీరుపని ఇచ్చాడు. అక్కడ కొంతకాలం పనిచేసినతరవాత వాడికా మోసం, అబద్ధాలు, దుర్మార్గం చూస్తే అసహ్యం వేసింది. అక్కణ్ణించి చెప్పకుండా లేచిపోయినాడు... దానిమీద నీవ్యాఖ్యానం ఏమిటి?'

'ఫూల్. కావాలంటే ప్లీడరుగుమాస్తాగా ఉండి న్యాయంగా ఉండకూడదా ఏమిటి?'

సూరి చిరునవ్వు నవ్వాడు.

'వాడికి చివరకొక్కటి తోచింది. మనం బ్రాహ్మణకులంలో పుట్టాం, విధ్యుక్తకర్మచేతా మనుకున్నాడు. బ్రాహ్మణార్థాలు చెయ్యటం మొదలుపెట్టాడు, తద్దినం మంత్రాలూ అవీ నేర్చుకుని.'

'భేష్. మంచిపనిచేశాడు.' అన్నాను.

'ఆ కుర్రవాణ్ణిగురించి నాకుతోచిందికూడా చెబుతాను. వింటావా?'

'చెప్పు.'

'నేను రెండేవిషయాలు చెప్పదలుచుకున్నాను. మొదటిది, రేపు చెట్లూ చామలూ మనల్నిగురించి తెలుసుకోటం మొదలుపెట్టి అవికూడా మనల్ని అనుకరించాలని ప్రయత్నంచేస్తే నేను తప్పకుండా తప్పుపడతాను.'

'రెండోది. మనిషి మూడువిధాలుగా ఉంటున్నాడు—పశువుగా, మానవుడుగా, దేవతగా. పశుత్వంలోనూ మంచీ చెడూ ఉంది, మానవత్వంలోనూ ఉంది, దేవత్వంలోనూ ఉంది (ఈ చివర విషయం బహుశా నీకు తెలీదేమో!) ఇంతవరకూ అందరికీ తెలిసే ఉండవచ్చును. అందరికీ తెలీని విషయమేమిటంటే పశుత్వంలో చెడు చాలాకొద్ది, మానవత్వంలో మంచీ చెడూ చెరిసగంగా ఉంది, దేవత్వంలో మంచికన్న చెడు చాలాజాస్తి.'

ఈ వేదాంతం నాకేమీ అర్థంకాలేదని వేరే చెప్పక్కర్లేదు. కాని వాణ్ణి ఎంతవేడుకున్నా సూరి పైన ఒక్కమాటకూడా మాట్లాడకుండా పేపరు తీసుకుని చదవటం మొదలుపెట్టాడు.

—కొడవటిగంటి కుటుంబరావు.

# అర్ధదినాభ్యాస విద్యావిధానము

## (గృహమందు వృత్తివిద్యకవకాశమిచ్చు పాఠశాల విద్య.)

### ఆవశ్యకత.

నే నీవ్యాసమందు కొంతమంది విద్యార్థుల కుపయుక్తమగు అర్ధదినాభ్యాసవిద్యావిధానమును సూచించెదను. ఈ నూతన పద్ధతి ప్రస్తుత మనుభవములోనున్న పూర్ణదినాభ్యాసవిద్యావిధానములోని సగభాగముతో చేరియుండును. ఈ కాలమందు సామాన్యజ్ఞానసంపదలు గలిగిన విద్యార్థులు విద్యమూలమున నుద్యోగమార్జించుటయే జీవితాధారమని తలఁచినయెడల వారు అవసరమగు నిత్యకృత్యములకు దక్క వేరు పనుల నేర్చుటకు తావియ్య వీలు లేదు. కాని యెడలు మండువేసంగియం దొక యేరు వారము లేదయిన పనిని తలపెట్టగల్గుదురేమో! అంతమాత్రమున సమకూరు లాభమేమియు లేదు. ఇట్టితరవిషయముల కన్నిటికి విముఖులై, మరొకపని కశక్తులై, నిరంతరము పాఠశాలయందు విద్య నభ్యసించి, స్కూలుఫైనలు వఱకుఁ జదివి, యెంతయో యత్నించి, తుద కెక్కడ నుద్యోగముగానక విఫలమనోరథులై దాదాపు షోడశవర్షప్రాయమున దీనావస్థలో కులవృత్తి ననుసరించువారు నూటికి ముప్పదిమంది యైనను నుందురు. ఇట్టివారికి నాల్గు, ఐదు, ఆరు ఫారములందు గఱపు విద్యావిషయములలోఁ గొన్ని మాత్ర మనవసరమనియు, వృథాయాసకరములనియు, కాలధనవ్యయపూరితములనియు జెప్పుటలో నతిశయోక్తి యిసుమంతయినను లేదనవచ్చును. కళాశాలలందు యఫ్.ఏ., బి.యే.లు, ఇంజనీరింగు, మెడికలు విద్యల నభ్యసించువారికిని, ఉద్యోగములకే యత్నించువారికిని పాఠశాలలందు గఱపు విద్యావిషయములన్నియు నావశ్యకమే, కాని పాఠశాలవిద్యతో విద్యాభ్యాసముఁ జాలించి యుద్యోగమార్జించలేనివారికి విద్యావిషయములలోఁ గొన్నిటిని దీసివేసినను లోటుండదు.

పరీక్షాఫలితముల నింతకంటెఁ గఠినముగాఁ జేయుటయు, విద్యార్థిరుసుముల హెచ్చించుటయు, ఉద్యోగహీనవిద్యాధికుల సంఖ్య తగ్గించుటకు మార్గములే, కాని యీ కారణములవలన దేశములోని జనుల విజ్ఞానవికాసాభివృద్ధులు తగ్గి బాధ్యతాయుత ప్రజాపరిపాలనాంగము లన్నియు నిస్సారములై కృశించును. వృత్తివిద్యల గఱపు పాఠశాలలస్థాపన మీ యుద్యోగహీనతయను వ్యాధికి రాజౌషధమేగాని సామాన్యస్థితిగల విద్యార్థుల కందుబాటులో నుండునట్లివి స్థాపితములగుట కెన్ని సంవత్సరములు పట్టునో యేరికిం దెలియదు.

### నూతనవిధానము.

ప్రతి జిల్లాయందును వృత్తిబోధన పాఠశాల లేర్పడునంతవఱకు, ఉద్యోగ మార్జించుట కవకాశములును, హెచ్చు విద్యాజ్ఞానసంపదయు లేనివారి యుపయోగార్థమై యీ "అర్ధదినవిద్యాభ్యాసవిధానము" సూచింపఁబడినది. పాఠశాలాగ్రకక్ష్యలలో నీ పద్ధతి ననుసరించు బాలకులు విద్యావిషయములలోఁ గొన్నింటికిమాత్రమే పాఠశాలకు వత్తురు. ఈభాగములను వీలగునట్లుగ నుదయ

మందుగాని, మధ్యాహ్నానంతరమందుగాని, అనగా దినమున నేదోయొకపూటయందే బోధపరుపబడునట్లు టైమ్‌టేబిలులో నేర్పాటు జేయవచ్చును. పాఠశాలకు రానవసరము లేని పూటయందిట్టి విద్యార్థులు ప్రభుత్వాంగీకారము వడసిన వృత్తివిద్యలను తమ జనకులయొద్దగాని యితర నిపుణుల యొద్దగాని నేర్చుకొనుటకు వీలుండును.

పూర్ణదినాభ్యాస విద్యార్థు లిట్లుగాక రెండుపూటలు పాఠశాలకువచ్చి అర్థదినాభ్యాస విద్యార్థుల సబ్జక్టులను వారితో బాటును, మిగిలిన సబ్జక్టులను వేరుగా రెండవపూటయందును పఠించుదురు. అందువలన పాఠశాలలందు కొందఱకు అర్థదినాభ్యాస విద్యావిధానమున నవకాశము లియ్యబడినను పూర్ణదినాభ్యాసులగు విద్యార్థుల ప్రస్తుత సౌకర్యము లేమాత్రము తొలగింపబడవు. అర్థదినవిద్యార్థు లీక్రిందఁ జెప్పబడిన సబ్జక్టులకుదక్క మిగిలినవానికి మాత్రము పాఠశాలకు విచ్చేయుదురు.

1. ఇంగ్లీషు టెక్స్టుస్ ఆఫ్ నాండిటైల్డు స్టడీ.
2. తెలుగు టెక్స్టుస్ ఆఫ్ నాండిటైల్డు స్టడీ.
3. ఆంగ్లేయదేశచరిత్ర లేక హిందూదేశ చరిత్ర.
4. భాషాంతరీకరణము.
5. అభిమానవిద్యావిషయములు [ఆప్షనల్ సబ్జక్టులు]
6. పదార్థవిజ్ఞానశాస్త్రములో ఆరవ ఫారముకు లోహచుంబకత్వము,ధ్వని ఐదవఫారములో జంతు, వృక్ష శాస్త్రములు. నాల్గవఫారములో రసాయనిక శాస్త్రము లేక భౌతికశాస్త్రము.
7. ప్రాథమికగణితము [ఎలిమెంటరీ మాథమాటిక్సు] లో ఆల్జిబ్రా, జామెట్రీ, గ్రాఫులు.

వీనిని పూర్ణదినాభ్యాసులగు విద్యార్థులు మాత్రమే పఠించెదరు. వీనియందు వారికి వేరుగా పరీక్షాపత్రము లుండును.

అర్థదిన విద్యార్థుల కీ క్రింది సబ్జక్టులలోనే బోధన చేయబడును.

| | | | |
|---|---|---|---|
| 1. ఆంగ్లేయ వచనము | వారములో | 2 | పీరీడ్లు |
| 2. ఆంగ్లేయ పద్యము | ,, | 2 | ,, |
| 3. తెలుగు వచనము | ,, | 2 | ,, |
| 4. తెలుగు పద్యము | ,, | 2 | ,, |
| 5. వ్యాసరచన | ,, | 1 | ,, |
| 6. ఎలిమెంటరీ సైన్సు | ,, | 2 | ,, |
| 7. హిందు లేక ఆంగ్ల దేశచరిత్ర | ,, | 2 | ,, |
| 8. భూగోళశాస్త్రము | ,, | 2 | ,, |
| 9. ప్రాథమిక గణితము | ,, | 3 | ,, |
| 10. చిత్రలేఖనము | ,, | 1 | ,, |
| 11. నీతిబోధన | ,, | 1 | ,, |
| | | 20 | |

ఇవియన్నియుఁ దగినరీతిని టైమ్‌టేబిలులో నైదు దినముల యుదయములలోను జేర్పవచ్చును. వీనియందు పూర్ణదినాభ్యాస విద్యార్థులకు, అర్థదినాభ్యాసవిద్యార్థులకు ప్రశ్నపత్రము లేకముగా నుండును. వృత్తి విద్యలలో పరీక్షలు జిల్లాలోని ముఖ్యపట్టణములలో జరుపఁబడి తరగతియందు త్తీర్ణతకై అర్థదినవిద్యార్థి వృత్తివిద్య పరీక్షయందు మినిమమ్‌మార్కు పడయునట్లుండవలెను.

తంత్రిబాధ్యత.

వృత్తివిద్యయందు క్రమశిక్ష [రెగ్యులర్ ట్రైనింగు] నొసంగుటకు అర్థదినాభ్యాసవిద్యార్థితంత్రి బాధ్యుడై తన అంగీకారమును వ్రాతపత్రమూలముగా ప్రధానోపాధ్యాయున కొసంగి, ఆ ప్రధానోపాధ్యాయునకైనను. లేక పాఠశాలాధికారులచేగాని, దొరతనమువారిచేగాని నియమింపబడిన నిపుణునకైనను ఆ విద్యార్థి వృత్తివిద్య నభ్యసించువిధమును, అభ్యసించిన భాగమును పరీక్ష జేయుట కవకాశము లిచ్చుటకు నొప్పుకొనవలయును.

రుసుములు.

ఒక యర్థదినాభ్యాసవిద్యార్థిరుసుము ఆతడాతరగతిలో పూర్ణదినాభ్యాస విద్యార్థియయిన యెంతరుసుము గట్టవలయునో దానిలో సగముండును. ఇదిగాక తన వృత్తివిద్యావిధానమును ప్రధానోపాధ్యాయుడుగాని, నిపుణులగు అధికారులుగాని పరీక్షచేయు నిమిత్తమై నెలకు నాలుగణాలు చెల్లించవలయును.

విద్యార్థులు : విధానమును మార్చుట.

ఒక అర్థదినాభ్యాసవిద్యార్థి తనజ్ఞాన, సంపద లభివృద్ధిగాంచినవను నమ్మికతో పూర్ణదినవిద్యాభ్యాస మొనరింపవలెనన్న నాతడు అర్థదినాభ్యాస విద్యావిధానము ననుసరించి యుత్తీర్ణుడయిన పెద్ద తరగతిస తిరిగి పూర్ణదినాభ్యాసవిద్యార్థులతో బాటు చదువుటకు వనతులుండవలయును.

ప్రత్యేకగ్రాంటు లనవసరము.

ఇట్టి అర్థదినాభ్యాసవిద్యావిధానము ప్రస్తుత మాచరణలో నున్న పూర్ణదినాభ్యాస విద్యావిధానముతో బాటు ఈ పాఠశాలలందే యీతరగతులందే యీ యుపాధ్యాయులయొద్దనే యీ సబ్జక్టులలోఁ గొన్నిటితోడనే జరుపబడునుగాన దీనికై వేరు భవనము లవసరము లేదు దొరతనమువారు దీనికై యేమాత్రము వేఱుగ డబ్బునియ్య నవసరము లేదు. పూర్ణదినాభ్యాస విద్యార్థులేమాత్రము నష్టము నొందరు వీరికై ప్రత్యేకముగా నుపాధ్యాయులను నియమింప నవసరము లేదు.

ముగింపు.

ఈక్రొత్త విధానము గుంటూరు జిల్లాలో చీరాల [నేతపని] నర్సారావుపేట [వడ్రంగిపని] దుగ్గిరాల, తురుమెళ్ళ [వ్యవసాయము] గుంటూరు, తెనాలి, ఒంగోలు [నగలపని, కమ్మరిపని, కుట్టుపని, సంగీత, సాహిత్య, చిత్రకళలు మొదలగునవి] లలో తృప్తికరమగు ఫలితము లిచ్చునను నాశ గలదు.

ఈ క్రొత్తవిధానము దీని ననుసరించు విద్యార్థులకు ప్రస్తుతము కఱపబడు విద్యలోని ముఖ్యవిషయముల [సబ్జక్టుల]ను నేర్పును. వారిని 'నిరుద్యోగ' మను విషజంతువు కోఱలనుండి రక్షించుటకు యీ విధానము సహాయపడగలదని విద్యాధికులకు, రాజకీయవేత్తలకు దోచిన యీ విధానము నొక హైస్కూలుయందుఁ బ్రవేశపెట్టి ఫలితముల కనుగొనవచ్చును.

ఏజిల్లాయందైనను వృత్తిబోధనాపాఠశాల [ఇన్డస్ట్రియల్ స్కూలు] లేర్పడిన వెంటనే యాజిల్లాలో నీ అర్థదినాభ్యాసవిద్యావిధానమును రద్దుజేయవచ్చును.

—భా. సోమసుందరరావు, బి. యే. యల్. టి.

# కీ. శే. దివాన్‌బహద్దరు చిత్రపు వెంకటాచలంపంతులు

గత ముప్పది సంవత్సరములలోను రాజమహేంద్రవరమునకు వన్నెయు వాసియు దెచ్చినవారిలో కీర్తిశేషులగు దివాన్ బహద్దరు చిత్రపు వేంకటాచలము పంతులుగారొకరు. నిరాడంబరజీవితమునకును, న్యాయశాస్త్రపరిజ్ఞానమునకును, ధర్మమార్గప్రవర్తనమునకును పంతులుగారు మార్గదర్శకులనుటలో నతిశయోక్తి లేదు.

వీరి తండ్రిగారగు వరదరాజులుపంతులుగారు ధర్మమూర్తులని కీర్తిగాంచిరి. వారు వాడ్రేవువారివద్ద దివానుపనిచేసి లంచముసంచము లనుమాట యెఱుగక పరద్రవ్యాపేక్షలేక నిష్కళంకజీవనమును నెరపిరి. వీరు వేంకటాచలముపంతులుగారు వృత్తిలో స్థిరపడి కీర్తిసోపానముల నెక్కుచుండుట చూచి కొంతకాలమానందించిన యదృష్టశాలి. చివరవరకును జనకుని యాచరణమే కుమారున కాదర్శమై వెలసెను. పంతులుగారు 19-వ యేట పట్టభద్రులైరి. తదుపరి బి. యల్ ప్యాసయి ప్రాక్టీసుచేయ నారంభించి యచిరకాలముననే తమ మేధావిశేషమును వ్యక్తపరుప సాగిరి.

1902 మొదలు వీరిరువదినాల్గు వత్సరములు ఏకధాటిగా పబ్లికుప్రాసెక్యూటరు పనిని చేసిరి. అప్పటినుండియు ఏదో ఒకవైపున వీరు పనిచేయని పెద్ద కేసు రాజమహేంద్రవరమున లేదు. రాజమండ్రి తాలూకాబోర్డునకు వైసుప్రెసిడెంటు పనులను సమర్థముగ నిర్వహించినందుకు రెండువరుసవర్షములలో రావుబహద్దరు, దివాన్ బహద్దరు బిరుదములనందెను. రామారాయణింగారి మంత్రిపదవియొక్క మొదటిరోజులలో రాజమండ్రి మునిసిపాలిటీ సరిగా పనిచేయుటలేదను కారణమున పంతులుగారిని అధ్యక్షునిగా నోమినేటు చేసిరి. ఆరునెలల కాలము వీరు మిక్కిలి సమర్థముగను నిష్పక్షపాతముగను పరిపాలించిరి. వృత్తివ్యవహారము లెన్ని యున్నను మునిసిపలుకాగితముల నేరోజు వాని నారోజు పూర్తిచేసి గాని యింటికి వచ్చువారు. కో ఆపరేటివు బ్యాంకునకు ప్రెసిడెంటుగను, ఎలక్ట్రికు కార్పొరేషనుకు డైరెక్టరుగను గూడ పనిచేసి ఖ్యాతి నార్జించిరి. రాజమండ్రిలో జరిగిన ఏసత్కార్యమును వీరి సాయమును పొందనిది లేదు.

ఒకమారొకకలెక్టరు వీరినిగూర్చి వ్రాయుచు (ది మోస్టు లాయల్ సబ్జక్టు ఆఫ్ ది ఈస్టుకోస్టు)—తూర్పుతీరమునగల మిక్కిలి రాజభక్తిపరాయణుడు—అనెను. అట్లనుటకన్న మిక్కిలి ధర్మమార్గప్రవర్తకుడనుట యెక్కువ సమంజసము. ధర్మనిర్వహణమున పంతులుగారు వెనుకాడి యెరుగరు. వాడపల్లి కాల్పులు జరిగినపుడు వీరిహృదయము కరుణతో కరగిపోయినది. కష్టమును సరకుసేయలేదు; ధనమునాసింపలేదు; అధికారుల యాగ్రహమునకు జంకలేదు. అహోరాత్రములు దీక్షతో పనిచేసి యందు నిందింపబడిన వారిని విడిపించి దేశీయుల కృతజ్ఞతకు పాల్పడిరి. శ్రీయుతులు వెన్నేటి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యము గార్ల కేసులలోగూడ పనిచేసి వారిపై నెంత యన్యాయముగ దౌర్జన్యము ప్రయోగింపబడినదో ఋజువుచేసి తన ధర్మాభిలాషను చూపించెను.

వీరు పబ్లికుప్రాసెక్యూటరుగా నున్నపుడు రాజమహేంద్రవరమున ఖూనీకేసొకటి వచ్చెను. అందు ఒక ప్రఖ్యాతపురుషునకు సంబంధమున్నదని వదంతి బయలుదేరెను. కలెక్టరుకు పిటిషన్లుగూడ వెళ్ళెను. ఎట్లయినను ఆతనిని అవమానపరుపవలెనని వారి యభిలాష. ఆరోజులలో నాతడు రాజమహేంద్రవరమును ఏలెనన అతిశయోక్తికాదు. లెజిస్లేటివు కౌన్సిలు ఎలెక్షనుల సందర్భమున దబ్బరమాటలాడెనను కారణమున పంతులుగారు ఆతనితో మాట్లాడుటమాని అప్పటికి ఎనిమిదేండ్లయి యుండెను. ఈ ఖూనీవిషయమై వ్రాసి అతనికి అరెస్టు వారంటు ఈయవచ్చునాయని కలెక్టరు పంతులుగారి నడిగెను. 'అతడును నేనును మాట్లాడి యెనిమిదేండ్లయినది. కాని అత డిట్టినీచకార్యమున కొడిగట్టు

నని నేను నమ్మజాలను. సాక్ష్యము గట్టిగానున్న దప్ప అతనిని అరెస్టుచేయుటకు నేను ఒప్పుకొనను' అని పంతులుగారు జవాబిచ్చిరి. అహా! అపకారికి నుపకారము నెపమెన్నక చేయగలిగిన యిట్టి ఆంధ్రపుత్రులు మనలో నింకెందరున్నారు?

వీరి న్యాయశాస్త్రపరిజ్ఞాన మపారము. విశాఖపట్టణమున నొకకేసులో వాదించుటకు ప్రభుత్వమువారు వీరిని పంపిరి. ఆకేసు పదిరోజులకు మించి సాగెను. ఆర్గ్యుమెంటుకు ఎదటిపార్టీ ప్లీడరును ఒక రోజుపట్టెను. వీరు 15 నిమిషములలో తమ వాదనను ముగించి కూర్చుండిరి. ఆ న్యాయాధిపతి వీరి సూక్ష్మబుద్ధికి అచ్చెరువంది బెంచిమీద కూర్చుండగనే వీరి నభినందించెను.

పేదలయెడ వీరికి దయమెండు. ఎందరెందరివిద్యార్థులకో వీరు తమ జేబులోని ద్రవ్యమునిచ్చి సాయము చేసెడివారు. కీ. శే. కొచ్చర్లకోట బంగారమ్మగారు చనిపోవుటకు ముందు వీరినిపిలచి తన డబ్బు సద్వినియోగమగు మార్గమును సూచింపుమన రాజమండ్రి ఆర్ట్సుకాలేజీలో చదువు ఆరువేల నియోగుల విద్య నిమిత్త ముపయోగపడునట్లు చేయించి, దానిని తరువాత వృద్ధిపరచి యెందరెందరికృతజ్ఞతకో పాలుపడెను.

వీరికి స్నేహితులయెడ నభిమానము గాఢము. వారికనేకవిధముల వీరు సాయముచేయుచు వచ్చిరి. అందులో కొందరికి జామీనువుండుటవల్ల ఆర్థికదుస్థితిగల యీరోజులలో దాదాపు ఏబదివేల రూపాయలవరకును పోగొట్టుకొనిరి. వీనినన్నిటిని మిక్కిలి నిర్లిప్తతతో నోర్చియుండిరి. ఒకమారు వీరు ఒక యెస్టేటుకు ట్రస్టీగా వుండి ఆయస్టేటుబాకి తీర్మానముక్రింద తమ అకౌంటులోనుంచి రు 18000 లను ఇచ్చిరి. తరువాత ఆ డబ్బు వీరికి తిరిగి రాలేదు. కాని ఆయన కించిత్తు విచారమును చూపక 'పోనీలే. ఒక సంవత్సరం సంపాదన లేదనుకుంటాను' అని నాతో అన్నారు. మొన్న మొన్నటివరకూ రాజమహేంద్రవరం వీధులలో పిచ్చిపాటలు పాడుకుంటూ తిరిగిన వేపారి అప్పన్నపంతులే వీరి యుత్కృష్టస్నేహబుద్ధికి తార్కాణము.

పంతులుగారు నౌకరులను తమకుటుంబములోనివారితో సమంగా చూసుకునేవారు. లచ్చయ్య అని వొక వృద్ధసేవకుడు వుండేవాడు. అతను రానురాను నీరసించి పనిచేయజాలకుంటే యింటివద్దనే వుండమని అతడు జీవించినంతకాలమూ పూర్తిజీతం యే నెలది ఆ నెల యిచ్చేవారు. వారివద్దనున్న గుఱ్ఱపువాడు—నైసు—పాతికముప్పది సంవత్సరములనుండి పనిచేస్తున్నాడు. మోటారుకొని గుఱ్ఱపుబండీ తీసివేస్తే వానిని పనిలోనుండి మాన్పింపవలసి వస్తుందని వీరు మోటారు కొనలేదు. ఇప్పటి రోజుల్లో మోటుగాభావింపబడే ఆ గుఱ్ఱపుబండితోనే కాలమును గడిపినారు. అస్పృశ్యతా నివారణము మాట ప్రజలెత్తనిరోజుల్లోనే వీరి యింట గుఱ్ఱపువాడు మొదలగువారు తదితరసేవకులందరివలె మెలగేవారు. సేవకులయెడ దుర్భాషలాడుటగాని, పనిచేయువానిని మాన్పించుటగాని వీరిప్రకృతికి విరుద్ధము.

పంతులుగారు ఎనమండుగురు మగపిల్లలకు పెండ్లి చేసినప్పటికీ ఒకదానికి కూడా కట్నము కానుకల విషయము ప్రస్తావించలేదు. వారుచూచినది యెదటివారి సాంప్రదాయము మాత్రమే. ఏపెండ్లిలోను మాట పట్టింపులుకూడా లేవు. పిలిచినంతనే భోజనమునకు బోవుట, ఇచ్చినదానితో సంతసించుట తాము సుఖముండి యితరులను సుఖపెట్టుట వీరి ప్రధానగుణములు. వీరి అయిదవకుమారునకు ఒక పేరుమోసిన పెద్దమనిషి పిల్లనీయవలెనని పోయిమాట్లాడగా ఆయన యిట్లనెను: 'మా పెద్దబావమరది చనిపోయినాడు. అతని కొకకూతురున్నది. వాళ్ళస్థితి నీరసం. అల్లాంటప్పుడు నేను మా అబ్బాయికి ఆపిల్లను చేసికొనడం విధి అయివుంది' కట్నముకొరకు కాట్లాడే యీదినములలో నింతటి విశాలహృదయులు మనకెందరు గోచరింతురు?

వీరి నిరాడంబరత్వమునకు సర్ ప్రఫుల్లచంద్రరాయిగారి నిరాడంబరతగూడ తీసికట్టు. వీరి నింటివద్దచూచిన అపరిచితు లెవరును వారే వెంకటాచలముపంతులుగా రనుకొని యుండరు. ఎందరో యిట్టి పొరపాటుచేసిరి

ఒకమారొకరువచ్చుసరికి పంతులుగారు చుట్టకాల్చుచు గూర్చుండిరి. ఆయన వీరినిచూచి 'నాయనా! పంతులుగారు లోపలవున్నారా? నీవు పంతులుగారియింట వున్నావా? వారు చాలమంచివారు' అంటూ ప్రసంగించెను. చివరకు వారే పంతులుగారనివిని యాతడెన్నో క్షమాపణలు చెప్పబోవ 'నన్ను మంచివాడని భూషించారుగాని దూషించలేదు గదా. మీకెందుకు భయం?' అని యూరడించిరి. వీరికి మొక్కలను పెంచుట మిక్కిలి ప్రీతికరము. ప్రతిదినము ఉదయాస్తమయములందు విశాలమగు తమపెరటిలో పనిచేసి కూరలుగాయించి యనేకులకు పంచిపెట్టెడువారు. బచ్చలకూర, దనాసరిగోంగూర, తోటకూర వీరియభిమాన శాకములు. దంపుడుబియ్యము, ఉడకబెట్టిన కూరలనే గాని మరబియ్యము, వేపుడుకూరలను వీరు దరికి రానిచ్చెడివారుకారు. నూతినుండి స్వయముగదోడికొని చన్నీట స్నానముచేసెడివారు.

శిష్టాచారసంపత్తిగలవారు వీరు. శ్రీమద్రామాయణమునెడ వీరి కభిమానముమెండు. స్వదేశవస్తువులనెడ ప్రీతిగలదు. పలుకుబడి యెంతయున్నను వీరికి అహంభావముగాని, కోపముగాని యిసుమంతయు లేకుండెను. మృదువును, చమత్కారమును ఒలుక మాటాడగల నేర్పరి. పరద్రవ్యమును విషతుల్యముగ జూచిన నిర్లిప్తుడు. తెలిసి పాపముచేయుటగాని, ఎఱిగి అనృతమాడుటగాని యెఱుగని పుణ్యపురుషుడు. అందుచేతనే మహాత్ములు మనసార వాంఛించు ముక్కోటి యేకాదశీమరణమును, చివరవరకును వ్యక్తతయును పొందగలిగిరి. ప్రకటనకొరకు ప్రాకులాడని కర్మవీరుడగు వేంకటాచలంపంతులుగారి జీవితము ఆంధ్రయువకులకు ఆదర్శపాత్రమును, అనుకరణయోగ్యమునై చిరకాలము వెలయగలదు.

ఈసిద్ధపురుషుని యాత్మ పరమేశ్వరుని కరకమలముల అక్షయమగు శాంతిని, ఆనందమును పొందుదురుగాక.

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

## తీవకన్నె

ఈ యివురాకుఛత్త్రముల
  నెత్తినపుష్పితగాత్రి వెవ్వరే
తీయనివాసనల్ గుబులు
  తెమ్మెర కానుకలిచ్చి భృంగక
న్యాయతగీతరాగముల
  నాయెద రంజిలజేయబూనె దీ
మాయలు పన్నిగాని నను
  మన్నన లందగ జేయజాలవో!
ఆ చలినాటి వేగుదల
  నవ్వయి సేవకు బోయి త్రోవలో
తోచినభావముల్ మదిని
  దూపిలజేయగ సోలివచ్చి నీ
పూచిన పందిలిం గదియ
  బోవుచు పోవుచు నాగిపోవ నన్
చాచినబాహువల్లరుల
  సాకితివేలనో చెప్పవే చెలీ!
మున్నొకనాటిరేయి తన
  పూచినపందిటిక్రింద నే సుఖా
సన్నత నిద్రవోవునెడ
  జల్లగ జేరి కవుంగలించి లే
గన్నెవికుల్ విదిర్చి మరి
  క్రమ్మరిపోవుచు నాసుమాక్షతల్
చిన్నెలుగాగ నిల్పె, తన
  చేసినచిత్రము లేనెఱుంగనో!
ఈమెయి నాకయి యెంతో [వరో
నీమముతో తపమునలుపు నెచ్చెలి యె
కామినియే యైనన్ తా
సీ, మిషబూనన్ కలఫలమేమో చెపుమీ!

—కొ. శశిశేఖరరావు.

# శస్త్రవైద్యుల కరకౌశలం

గాంధిమహాత్మునకు ఉదరములో చేయబడిన ఆపరేషను వివరములు చాలమందికి ఇంకను బాగుగా జ్ఞప్తిలో ఉండిఉండును. ముప్పదియైదు కోట్ల భారతీయులకు ప్రాణాధికుడగు వ్యక్తి—లోకమువారిచే ఏసుక్రీస్తు అపరావతారముగ ఎంచబడుచున్న పురుషోత్తముడు. అట్టివాని ఉదరములో ఆపరేషను సాగించుట. ఏమాత్రము ఒడుదొడుకు వచ్చినను ప్రపంచచరిత్రలో ఆశస్త్రవైద్యునకు శాశ్వతమైన అపకీర్తి. ఆయూరపియనుసర్జను మనస్సును గజిబిజిచేయుటకు ఈ పరిస్థితులు చాలనట్లు ఆపరేషను మధ్యలో ఎలక్ట్రిక్ దీపములు ఆరిపోయినవి. సామాన్యమైన హరికేనులాంతరు ఈయగల వెలుతురులో ఉదరమధ్యమున ఆపరేషను ముగించవలసివచ్చెను. ఆనిముసములలో ఆయూరపియనుసర్జను శరీరమున రక్తము ఎంతటి వేగమున ప్రవహించినదో! ఆపరేషను జయవంతముగ ముగిసిన పిమ్మట ఆత డెంతటి శాంతిని, ఆనందమును పొందెనో! విశ్రాంతివేతనమును గొనుచు ఇపుడు స్వదేశమున నున్న ఆఇంగ్లీషు సర్జనుని రౌండుటేబిలు సభకు పోయినపుడు మహాత్ముడు కలసికొనెను. అప్పుడు తిరిగి వెనుకటి ఆపరేషన్ సంగతి, లోకాతీతపురుషుడైన అతని ప్రాణము లప్పుడు తనగుప్పెడిలో ఉన్నందుకు తాను పొందిన అదురు ఒకరప్పపాటులో ఆసర్జను మనమున మెఱుపువలె మెఱసియుండును!

ఆమధ్య విశాఖపట్టణము కింగుజార్జిఆసుపత్రిలో నొక యూరపియనుసర్జను ఆపరేషను చేయుచుచేయుచు రోగిని వదలివైచి అదేకాలమునకు తాను ఎవరికడకో వత్తుననుటను జ్ఞప్తికి తెచ్చుకొని వెళ్ళిపోయెనన్న సంగతి వార్తాపత్రికలలో చదివియున్నాము. దీనిని బట్టి శస్త్రవైద్యు లందఱు తమరోగుల ప్రాణములను ఇంత చులకనగా చూచెదరనియు, వారికి దయాఅనునది ఉండదనియు అనుకొనరాదు. పెద్ద ఆపరేషనులు చేయవలసిఉండినచో సాధారణముగా శస్త్రవైద్యులు తమ రోగులచే వీలునామాలు వ్రాయింతురు. ఎటుబోయి ఎటువచ్చినను తమకు బాధ్యతలేనట్లు మాట్లాడుదురు. కాని మనస్సులో మాత్రము రోగిప్రాణరక్షణకోసము వారుపొందు ఆవేదనకు అంతుఅనునది ఉండదు.

ఈవిషయమై 'పాప్యులర్ సైన్సు మంత్లీ' అను అమెరికాదేశపు పత్రికలో ఫ్రెడరిక్ డామన్ (యం.డి) అనునత డీక్రింది చమత్కారవృత్తాంతమును తెలుపుచున్నాడు: "నాసోదరశస్త్రవైద్యు డొకడు కొద్దివారములక్రితము క్లిష్టమైన బ్రెయిన్ ఆపరేషను ఒకటి చేయుచుండ నేను దగ్గఱఉండుట తటస్థించెను. ఆపరేషను చేసినచో రోగి బ్రతుకునా బ్రతుకడా అని ప్రబల సందేహముగా నుండెను. ఆపరేషను జరుపుచున్నంతకాలమును సర్జను పైకి శాంతచిత్తముతో ఉండినట్లే కనిపించెను. ఆపరేషను జయాకరముగానే ముగిసెను. కాని సర్జనుకే కాళ్ళుచేతులాడుటలేదు. మంచముగడ్డవైచి ఉంచబడిన జలముగల గ్లాసును స్వయముగ నాతడు నోటిదగ్గర పెట్టుకొనలేక పోయెను. నేను గ్లాసుఎత్తి పట్టి త్రాగించవలసి వచ్చెను. తరువాత ఆతడు తనకు కారునడపుటకు భయమువేయుచున్నది కావున కారునడిపి ఆతనిని ఇంటికిగొనిపొమ్మని నన్ను వేడెను. శస్త్రవైద్యులు దయలేనివారని భావించువారు గొప్పగా పొరపడిరనియే చెప్పవలసియున్నది. కత్తి వరిమ్ముల్లువాసి అటుఇటు అయినను లక్షలు విలువచేయు రోగిప్రాణములు పోవునుగదా అను భయభావము శస్త్రవైద్యుల నరములను సదా ఉత్కంపింపచేయుచుండును. కాగా శస్త్రవైద్యుల ఆయుఃపరిమాణము

అత్యల్పమైయుండుటలో ఆశ్చర్యమేమి ?"

ఇదియుకాక శస్త్రవైద్యులు ఒకొక్కప్పుడు అకస్మాత్తుగ మఱికొన్నికష్టములను ఎదుర్కొనవలసి వచ్చును. ఈమధ్య పారిస్ నందలి రాత్ చైల్డుఆసుపత్రికి రక్తము కాలువలుకట్టుచు కారిపోవుచున్న స్థితిలో ఒక స్త్రీరోగి కొనిరాబడెను. వెంటనే కొంత క్రొత్తనెత్తురు ఆమెకు ఇంజెక్టుచేసినగాని ఆమె బ్రతుకుస్థితిలో లేదు. అక్కడఉన్నవారి నెత్తురులన్నియు పరీక్షింపబడెను—ప్రధానశస్త్రవైద్యుని ఒక్కని రక్తముమాత్రము ఉపయోగార్హమైనస్థితిలో ఉండినట్లు కనుగొనబడెను. ఎట్టి తటపటాయింపును లేక తన నాళములనుండి వలసినంత రక్తమును వెలార్చి ప్రధానశస్త్రవైద్యుడు రోగికి ఇంజెక్టుచేసి, అనంతరము జయప్రదముగా తానే ఆపరేషను సాగించి ఆమె ప్రాణములను కాపాడెను.

ఇట్టి అగత్యములకు తాము సంసిద్ధులై యుండుటకును, ఆపరేషనులు సాగించుటలో ముఖ్యావసరమగు తమ కరకౌశలమును నిలుపుకొనుటకును సర్జనులు—మల్లులవలె—శరీరసాధన చేయుచుందురు. ఆహారనిద్రావిహారవిషయమున వారు సంయమ మవలంబింతురు. శస్త్రవైద్యులలో పలువురు మద్యమునుముట్టరు; పొగాకును దరికి చేరనీయరు. కొందఱు కాఫీని, తేయాకును రుచియైనచూడరు. శస్త్రవైద్యులందఱును రాత్రిళ్ళు బాగుగ నిద్రపోవుటనుగూర్చి విశేషశ్రద్ధాళువులై యుందురు.

'అలసటచెందిన సర్జను రోగికి యముడు' అని న్యూయార్కు లో సుప్రసిద్ధినందిన డాక్టరు అబ్రహామ్ ఊల్బ్రాస్టు నిర్వచనము. ఆపరేషనులు ఎక్కువగ చేయవలసియుండు దినమునకు తొలిదినపు సాయంకాలములందు వినియమముగా ఆతడు ఉల్లాసముగూర్చు నవలలనుగాని, అపరాధపరిశోధకకథలనుగాని చదివి మనమునకు విశ్రాంతి కల్పించుకొనును. ఆశవదలుకొన్నమాస్టాయిడ్ (చెవిగ్రంథులు) కేసులను ఆపరేటుచేసి కుదుర్చుటలో మాంత్రికుడను లోకఖ్యాతి నార్జించిన డాక్టరు మారిస్ లీషైన్ ప్రతి ఆపరేషను చేయుటకును ముందు పంచము మీద వెల్లకిలబరుండి తనకు ఆఆపరేషనులో సాయము చేసి జయము కలిగింపవలసినదిగా భగవంతుని ప్రార్థించును. న్యూయార్కునందలి ప్లాస్టిక్ సర్జనులలో విఖ్యాతుడగు డాక్టర్ హెచ్. లాయిన్సు తాను చేయబోవు ప్రతి ఆపరేషనునకును ముందు తనగదిలో ఒంటరిగా కూర్చుండి పదినిముసముల కోడికునుకు తీయుచు తీరకొనుచుండును. శస్త్రవైద్యుల ఇట్టితీరులన్నిటియందును అతివిచిత్రమైనది న్యూయార్కు నందలి మఱియొక స్పెషలిస్టునుగూర్చినదియై యున్నది. ఆపరేషనులు సాగింపవలసినదినమునకు తొలిదినపు సాయంకాలములందు ఆతడు తప్పక సినీమాకుపోవును-ప్రదర్శనము చూచుటకుగాదు ; రోగుల, వారి చుట్టముల ప్రశ్నపరంపరల నుండి తప్పించుకొనుటకు. సినీమామందిరమున ఆత డొక మూల ఎట్టికలతయులేక నెమ్మదిగ ఒదిగి కూర్చుండి తాను మఱునాడు చేయవలసిన ఆపరేషనులో ఏది ముందు చేయవలయును, ఒకొక్కటి ఎట్లెట్లుచేయవలయును అని యోజించుకొనును.

శస్త్రచికిత్సచేసి మూర్ఛరోగమును కుదర్పగలుగుటను ప్రదర్శించిన ప్రఖ్యాతశస్త్రవైద్యుడు డాక్టరు కే. విన్ ఫీల్డునే అనువాడు ఆపరేషనుగదియందలి అతిప్రయాసకు తాళగలిగియుండుటకై తనజీవితమును గడియారముమాదిరిగ త్రిప్పును. ఆతడు ఎనిమిదిగంటలకు పడకనుండి లేచును—ఆసుపత్రికి ఎన్నడు ఆలస్యముగ పోయియెఱుగడు. ఉదయముపూట ఆపరేషనులు సాగించును ; మధ్యాహ్నము రోగులనుచూచును. మధ్యాహ్న భోజనమునకు పూర్వము ఒకగంట నిద్రించును. సాయంకాలము చతురంగమాడును, లేదా బ్రిడ్జియను పేకాటయాడును, లేదా గభీరనాటకప్రదర్శనమునకు పోవును. రాత్రి పదునొకండుగంటలు మొదలు మూడుగంటలవఱకు చదువుటయందును, శాస్త్రవిషయకవ్యాసరచనయందును గడుపును. ఆతనికి రోజుకు ఆరుగంటల నిద్ర సరిపోవును. రాత్రి మూడుగంటలు మొదలు ఉదయము ఎనిమిదిగంటలవఱకును, పగలు ఒకగంటయు—ఆతడు నిద్రించును. హెచ్చునిద్ర ఏకాగ్రతకు భంగము కలిగించుట అతని అనుభవము.

తనకరాంగుళముల శస్త్రచికిత్సాకౌశల్యము పెంపొందుటకై మట్టిముద్దలతో రూపములను దిద్దుచును, కొయ్యపలకలపై చెక్కడపుపని చేయుచును, విగ్రహాదులు చెక్కు శిల్పవిద్య అభ్యసించుచును డాక్టరు నే తన తీరికసమయములను వెళ్ళబుచ్చును. వడ్రపుపనిముట్లతో పనిచేయుచు ఆతడు తనవిశ్రాంతిసమయమున చేతివ్రేళ్ళను లాఘవపఱచుటలో పర్యాప్తుడైయుండును.

తమకరకౌశలమును పెంపొందించుకొనుటకును, స్ఫురించు ఆలోచన నందుకొని అవయవములు పనిచేయు శక్తి అతిశయింప జేసికొనుటకును శస్త్రవైద్యు లందఱును తఱచుగా ప్రయత్నములు సాగించుచుందురు. తనవ్రేళ్ళకు హెచ్చులాఘవముకలుగుటకై ఒక డాక్టరు లోహాదులపైని ద్రావకాదుల సాయమున చిత్రములుచెక్కు (ఎచ్చింగు) పనిని నేర్చుకొనెను. పలువుర సర్జనులు తమచేతులు ఎక్కువ చుఱుకుగా పనిచేయుట కలవడుటకై సారంగియను వాద్యమును, ఫిడేలు వాద్యమును అభ్యసింతురు. మూత్రపిండములను ఆపరేటుచేయుటలో అసాధారణ ప్రజ్ఞచూపినడాక్టరు ఫోర్బిస్ హాకిన్స్ తన కరాంగుళముల సాధనమునకై పియానోవాద్యమును అభ్యసించెను. ఆపరేషను జరిపిన తరువాత చర్మమును కుట్టుటలో పూర్ణప్రజ్ఞాన్వితుడగుటకు న్యూయార్కు సర్జను బ్రూక్లిన్ అను వాడు ప్రతి సాయంకాలమును పఱుపు అంచులను కుట్టుచు, దారమునకు ముళ్ళువైచుచు విశేషసాధనచేయును. ఆపరేటింగు రూమునందు శరవేగముగ గాయములను కుట్టివైచుటయందు ఆతడు అతిలోకుడై యున్నాడు.

తననేత్రములు, కండరములు శస్త్రకర్మావసరమున తుల్యయోగితనంది పనిచేయుటకు గరిడిసాధన మఱియొక శస్త్రచికిత్సకు డవలంబించిన విధానము. ఈ గరిడిసాధనకు తోడు తనరెండుచేతులను సమముగా ఉపయోగింప నేర్పు సంగీతవాద్యములతో విశేషసాధన ఆతడు చేకొనెను. సాధారణమైన పనివాడు తనరెండుచేతులతో ఏదోఒక్కదానినే పనితనముతో నుపయోగింపగలిగియుండును. కాని శస్త్రచికిత్సకులలో ప్రముఖులు పలువురు కుడిచేతి నుపయోగించిన వాటముతో డనే ఎడమచేతినికూడ నుపయోగింపగలరు. కోయుటలోను కుట్టుటలోను మొదట ఒకచేతిని, పిమ్మట మఱియొకచేతిని అప్పటప్పటికి ఏది ఊసుతై ఉండిన దానిని శస్త్రచికిత్సకమహాశయులు ఉపయోగించియుండుట తాను స్వయముగ చూచితినని ఫ్రెడరిక్ డామ్రస్ (యం. డి.) వ్రాయుచున్నాడు.

శాస్త్రపరిశోధనచేయుచు జంతువులపై శస్త్రకర్మ ఆచరించుట అతిసున్నితమైన ఆపరేషనుపనులను చేయుటలో తమచేతులకు తరిబీతునొసంగుటకై సర్జను లవలంబించు మఱియొకసాధన. శాస్త్రపరిశోధనచేయుటలో తఱచుగా శోధకుడు సూకనుచ్చువంటి అతిసూక్ష్మములైన మాంసగ్రంథులతో (గ్లాండ్లు) పెనగులాడవలసియుండును. కత్తి చిరువెంట్రుకవాసి చెదరినను చేసిన పరిశోధన అంతయు చెడిపోవును. కెనడాకు చెందిన టొరంటోయందలి డాక్టరు ఫ్రెడరిక్ బాన్టింగు ఇట్టి సూక్ష్మపరిశోధనావసరముననే ఇన్సులిన్ అను దానిని కనుగొనియున్నాడు. డయబెటీసు అనబడు మధుమేహమువలన తీసికొను రోగులపాలిటి వరప్రసాదముగనున్న ఈ ఇన్సులిన్ కనుగొనుట వైద్యప్రపంచమున నొక గొప్పవిషయమై క్రాలుచున్నది.

ఒక్క అమెరికాసంయుక్తరాష్ట్రములయందే ఒక ఏడాదిలో జరుగు ఆపరేషనులసంఖ్య పదిలక్షలు అనుమించియున్నది. విశాలవిశ్వము మొత్తముమీద ఈ సంఖ్య ఎంతయుండునో? ప్రపంచమున ప్రస్తుతము శస్త్రచికిత్సవలన మృత్యుముఖమునుండి తప్పింపబడిన ప్రాణుల సంఖ్య దినదినము పెరుగుచున్నది. ఇందులకైన గణ్యతలో విశేషభాగము తమ శస్త్రకళావైదగ్ధ్యమును పెంపొందించుకొనుటకు సర్జనులుచేయు నిరంతరపరిశ్రమకును, శస్త్రచికిత్సాకలాపమును నిర్వర్తింప ప్రయత్నపడుటలో సర్జనులుపొందు అనంతమైన వేదనకును చెందవలసియున్నది.

కోయుట, కుట్టుట నిర్దిష్టకాలములో జరిగిపోవలయును. అరసెకండు ఆలస్యమైనను ప్రాణము లికలేవు. ఎక్కడకోయవలయునో కత్తి సరిగా అక్కడే పడవలయును. తలవెంట్రుకవాసి అటు ఇటు అయినను ప్రాణ

ములు మఱిలేవు. వాయువువలె వేగముగా పనిచేయవల యునే కాని దానివలె ప్రసరింపరాదు. విద్యుచ్ఛక్తివలె నిశితమైయుండవలయునే కాని దానివలె అదరుపుట్టింప రాదు. సూది శరమువలె సూటిగా గ్రుచ్చుకొనవలయు నేకాని దానివలె ప్రాణముతీయరాదు. ఆకాశమునుండి భూమిమీది నలుసంతటి కోడిపిల్లను చూడగల గ్రద్ద దృష్టిబలము—భూమిమీదనుండి దమ్మిడికాసును అల వోకగా ఎత్తగల ఏనుగుతొండపుమొన చాకచక్యము ఆనిముసములో సర్జనుచేతులనుండవలయును. అవయవము లకు అతిశీఘ్రచలనము—మనస్సునకు అంతులేని ఆరాటము గల ఆ సమయములో తప్పక క్రమ్మగల ముచ్చెమ్మటలలో ఒక్క బిందువుకూడ జారి రోగి గాయమున పడరాదు. దీనికిమించిన అసిధారావ్రతము ఇక నేమిగలదు? ఆపరేషనుచేయు ఆ రెండు నిమిషముల యందును భగవంతుడేవచ్చి ఆ సర్జనులో ప్రవేశించియుండి—ఊహించుటకే నెఱపుగొలుపు—ఆ శస్త్రికర్మలను గావించునేమో!

—పి. బ్రహ్మాజీరావు, ఎం.బి.బి.యస్.

# అనపత్యత

[బిడ్డలలేమినిగూర్చి వర్ణించుట ఆంధ్రప్రబంధలక్షణములలో నొకటి. అగుటచే ఆంధ్రప్రబంధకవులలో పలువురు ఈ విషయమై వర్ణనము సాగించియున్నారు. వానిలో కొన్ని అతిమనోహరములు. అనపత్యతను వర్ణించు నాచనసోమనాథుని ఈ పద్యరత్నమును గమనింపుడు:

"తడియొత్తుచీరతో దాదికౌఁగిటఁ జేర్చి చూపంగఁ గన్నారఁ జూడనైతిఁ
దడవియాడకమున్న తట్టాడుమునిపట్టి వడఁకంగ సెజ్జపై వ్రాలనైతి
నల్లంతదవ్వుల నప్పలప్పలనంగ నెనురుగాఁ బరతేర నెత్తనైతి
వియ్యాలచే నిచ్చి వేడుక నను వారు తిట్టింప విని దప్పిదేరనైతి

నకట మిథ్యామనోరథుండైతిఁ గాని
కొడుకులంగని దమవారు గొంఢసేయ
నుండలేదయ్యె సంపద లుబ్బనేని
లేబరమకాదె బిడ్డలు లేనిబ్రదుకు."

సంతానసంపదకు నోచనిదంపతులసంసారమును 'ఎన్నులేని సస్యము'అని తెనాలి రామకృష్ణుడు పిలుచుచున్నాడు. ఈ విషయమై తెనుగుప్రబంధములనుండి ఎన్నైన నిదర్శనములు చూపవచ్చును. అయితే మన ప్రబంధకవులందఱును అనపత్యతను వర్ణించునపుడు పైజాతికుటుంబములనే మనమునందుంచుకొనిరి కాని క్రింది జాతి కుటుంబములనుగూర్చి తలపెట్టలేదు. క్రిందిజాతికుటుంబము లందును—కొద్దిగనే కావచ్చు—సంతానము లేని కుటుంబములు కొన్నియుండుట కాంచుచున్నాము. సంతానము పొందనప్పుడు అట్టి కుటుంబములలోని స్త్రీలభావము లెట్లుండును? ఈ క్రింది ఖండకావ్యమునందలి కవితావస్తువు ఈతరగతికి చెందినది. వస్తువు ఇట్లు కొంతవఱకు క్రొత్తదైయున్నది. ఇందు ఒక గొల్లదాని నిస్సంతుసంతాపము ప్రస్తరింపబడినది. —సంపాదకుడు.]

చెల్లెను కాలమంతయును చెప్పికొనంగను వ్రేలిడేనియుఁ
బిల్లడు నింటలేడు సుఖమేటికి? సంపద లేల? వెఱ్ఱిమా
గొల్లడు నొక్కగొఱ్ఱెకయి కొండలవెంబడి బోయిరాడు ఈ
పల్లియకెల్ల నేనొకతె వంధ్యగనుంటిని దిష్టిబొమ్మనాఁ.

చెట్టులు చేమలాది చిరుచీమలదాఁక సమస్తజీవులున్
బుట్టుక సార్థకంబగుడు బొత్తిగ నావలె గొడ్డువోకయే
పెట్టును శక్తిసారముల బిడ్డల నేటికి నొండొ మొండొగా
నిట్టుల బుట్టి, బుట్టినటు లేగెడు మూలవినాశ ముందురే.

పసుపును నూనె గుడ్డలకు పట్టట చన్నులనిండ పాలుఁ జే
పి సుతుని నడ్డలందునిచి ప్రేమను ముద్దుల నాడుకొంటయున్
బసినయనంబులన్ దనను పాపడు చూచుచు నవ్వుచుంటయున్
బొసగుట యెట్టిపుణ్యములు నోచినయింతికి గల్గునో గదా ?.

ఒక్కడు గుండెపైఁ గునుకు నొక్కడు ఱొమ్ముల నానుచుండ వే
ఱొక్కడు లేచి యేడువగ నొక్కనిపై కరముంచి చేతితో
నొక్కని జోగుగొట్టి కడు నోర్పునఁ బిల్లలకోడి భంగి నా
ప్రక్కను నిద్రఁ జెందగల భామది కాదొకొ భాగ్యమన్నచోన్.

కూరలు కాయలున్ గలిగి కూడును కమ్మగ వండి నేను మా
వారలు నొంటిగా తినెడి పట్టున పిల్లలు లేని లోపమున్
దీరనిశోకవారిధిని దింపగ గుండెలు విచ్చిపోయెడిన్
నోరను నీళ్లు గారు మదినొచ్చి భుజింపగ తోచదేబుయున్.

పగలెల్లన్ బనుమంద మేపికొని సంపాదింపగా రాత్రులం
దు గృహంబందొక కుక్కదీసి దినముల్ దార్లింపగా జేయు మా
మగవారెట్లొ సహింత్రుగాని పగలున్ మాయింటిలో నొంటి నే
నెగులుం బొందుచు నెట్టుగా మరతు నీ సిస్తంతుసంతాపమున్.

ఇంపుగ నాదుగర్భమున నింతకు బిడ్డడు పుట్టకున్న బో
పెంపునకైన నాయెడఁ పిల్లలతల్లులు జాలిబొందగా
సంపగిపూవువంటి సుతు చంకకు జేర్చు నుపాయమెంచి మా
కొంపకు దీపమున్ నిలిపి కొండలరాయడ! తండ్రి! బ్రోవుమా!

కడుపులనిండ కూడు తినగాంచని వారి యదృష్టమేమొగా
కడిపెడుబిడ్డలం గనియుఁ గానుకలిచ్చెదమన్న గ్రాసమున్
గడపెదమన్నగాని తమ కానుపులం దొక నిచ్చి తీపులన్
గడపరు కన్నయమ్మకును కన్నది వాపుగదా తలంపగన్.

ఉపవాసంబులఁ జేతు నిన్ మనసులో నూహించి కొండన్న నే
జపమంత్రవ్రతముల్ జరింతు నిక నా సంకల్పమున్ దీర్చుచో
నపహాసంబగు పోతు నిత్తు జనులానందింప సంతర్పణా
ద్యుపచారంబుల సల్పెదన్ సుతుడు నాకొక్కండు ప్రాప్తించినన్.

—మిత్తింటి నరసింహమూర్తి, బి.ఏ., బి.యల్.

# పాశ్చాత్యదేశాల్లో ముద్దులు

మన పూర్వులు ఒక్కొక్క విషయాన్ని గురించి చేసిన పరిశోధన చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. నిదర్శనంగా ఒక్క ముద్దును గురించి చూడండి మన వాళ్ళు ఎంతటి పరిశోధన చేశారో! కామశాస్త్ర గ్రంథాలలో ఋగ్వేదం అనతగ్గ వాత్స్యాయనుని కామసూత్రాల్లో-వ్యాకరణశాస్త్రాల్లో సంధిక్రియలకు వలె-ముద్దులకు ఒక ప్రకరణం ప్రత్యేకింపబడి ఉంది. సంస్కృతకావ్యాల్లో దొరికే ముద్దులకు హద్దులేదు. ఇక ఆంధ్రప్రబంధకవులు పద్యపాదానికి ఒకటి రెండు ముద్దుల చొప్పున కల్పించి తమ సంతతివారు తలా ఒకటి రెండు పంచుకున్నా తరిగిపోనన్ని ముద్దులను సృష్టించారు. ఇవి చాలనట్లు ఈనాడు భావకవులు కొందఱు ముద్దును గూర్చి ఒక్కొక్కసారి నాలుగైదు పద్యాలను చెప్తున్నారు. కృష్ణాతీరాన్ని భావకవి ఒకడు ఈ మధ్యని ఆటవెలదుల్లో ముద్దులు కురిపించి సీసాలదాకా సాగి అంతటితోనే చెంపకాయలదాకా రావడంచేత చంపకమాలల్ని ఎత్తుకోక వట్టి తేటగీతాలతో సెల్లూరు వచ్చినాడట. గోదావరీతీరాన్ని మధురకవి నాళం కృష్ణారావుగారు 'ముద్దు' అను పేరుతో ఒక ప్రత్యేకఖండకావ్యమే రచియించారట. ముద్దుగా ముద్రించారట కూడాను.

ఇట్లు కవితాసుందరి మన దేశంలో ఇంటింటా తనతో బుట్టువగు ముద్దులదేవిని అనాదినుండి నాట్యంచేయిస్తూ ఉండగా పరదేశాలలోను, పాశ్చాత్యదేశాలలోను పాపం ముద్దులదేవికి అసలే స్థానం లేకుండాపోతోంది. పాశ్చాత్యదేశాలలో ముద్దుల భవిష్యత్తు— హిందూదేశపు రాజ్యాంగసంస్కరణాలకన్నా—అయోమయంగా వుంది.

ఒకసారి ఫ్రెంచిశాసనసభ గాలరీలో మగవాళ్ళు ఆడవాళ్ళు కలిసి కూర్చున్నారు. ఆనాడు శాసనసభ అట్టే రక్తిగా లేదు. అందుచేత సేకాబోలు ఆ గాలరీలో కూర్చున్నవారిలో ఒక స్త్రీ ఒక పురుషుడు ఉబుసుపోకకు ఒకరినొకరు ముద్దుపెట్టుకున్నారు. శాసనసభలో ముద్దులు పనికిరావని వాళ్ళ ఇద్దఱినీ భద్రంగా బయటికి పంపేశారు.

ఫ్రాంసుదేశానికి పొరుగునఉన్న వియన్నాలో కూడా ముద్దులపరిస్థితులు ఇంతకంటె బాగుండలేదు. అచటి విద్యార్థి ఒకడు తనతో చదువుకునే ఆడపిల్లను వాళ్ళ తలవాకిట వీడ్కోలు ముద్దు పెట్టుకున్నాడు. ఆ సమయంలో ఒక కంపెనీగుమాస్తా ఆదారిని పోతూ ఈ అనురాగచేష్ట పరకీయం అవడంచేత అసూయపడ్డాడో ఏమో వెంటనే పోలీసువారికి రిపోర్టుచేశాడు. ఆలస్యం అయితే ఏ ఆకాశం అంటుకుంటుందో అని పోలీసువారు రిపోర్టు వచ్చిన తక్షణం ఆ కుర్రాణ్ణి కోర్టుకులాగేరు. పెళ్ళయి మొగుడితో కాపురంచేస్తూ ముద్దులరుచిని ఎఱిగిన స్త్రీ ఒకతె ఈ కేసులో ముద్దాయికి ప్రతికూలంగా సాక్ష్యం చెప్పింది! తమజాతివారైనా ఇతరస్త్రీలకు ముద్దులు లభిస్తుంటే స్త్రీలు ఓర్చలేరేమో!

ఈ రెండుకేసులలోను ముద్దులు పెట్టుకున్న స్త్రీపురుషులు భార్యాభర్తలు కారు. ఒకవేళ భార్యాభర్తలు కాకపోవడంచేతనే వీళ్ళ ముద్దులు కోర్టుకు ఎక్కివుంటాయని ఉపపత్తి కల్పించుకుందామన్నా అచ్చటి భార్యాభర్తల ముద్దులజాతకాల చక్రాలూ ఇదేమోస్తరుగా ఉన్నాయి. అమెరికాదేశంలో కాన్సాసు పట్టణంలో ఒక భర్త ప్రేమ పట్టలేక తన భార్యను రోడ్డుమీద ముద్దు పెట్టుకొనగా ఆ భర్తపై కేసు పెట్టబడింది. ముద్దుల మజా ఎఱుకో, ఎఱిగి ఉన్నా పోలసీకోఅకో అచటి న్యాయాధిపతి ఆ భర్తకు పెద్ద జరిమానా విధించాడు. భార్యను ముద్దుపెట్టుకొన్నందుకు భర్తకు పెద్ద జరిమానా? అన్యాయపట్టణంలో ఆలుమగలకు రంకు అనే సామెత ఇక్కడ నిజమైంది. పోనీ అమెరికావారి జీవితం ఏమన్నా గొప్ప నీతినియమాలతో ఉందా అంటే అదీ లేదు. త్రాగుడు నిరోధము తొలగింపబడిన ఈరోజులలో కూడా అమెరికాదేశంలో ముద్దులు నిరోధింపబడడం చాలా ఆశ్చర్య

మైందే. త్రాగుడులో కనిపించినరుచి ముద్దుల్లో వారికి కనిపించలేదేమో! బురద మెచ్చే పందికి పన్నీరుపస ఎక్కనట్లు—

భార్యాభర్తలైతేమాత్రం రోడ్డుమీద ముద్దుపెట్టుకోడం ప్రజానీతికి విరుద్ధమేఅని తండ్రితద్దినంకూడా పట్టుపంచిమడిలో నిర్వహించే బ్రాహ్మణోత్తములు కొందఱు అనవచ్చును. ఒక భార్యాభర్త ఉంటారు, వారు ఓగుర్రబ్బండిలో ప్రయాణంచేస్తుంటారు, ఉబలాటంపుట్టి ఒకర్నిఒకరు ముద్దుపెట్టుకుంటారు - ఇదికూడా ప్రజానీతికి విరుద్ధమైందని ఆబ్రాహ్మణోత్తములంటారా? వీరు అంటారో అనరో కాని చీనాదేశంలో హాంకాంగుపట్టణంలో ఒక మేజిస్ట్రేటు ఈముద్దుకూడా ప్రజానీతికి విరుద్ధమైందేనని నిర్ణయించాడు. ఒట్టి నిర్ణయంతో వదలిపెట్టలేదు. ఆభార్యాభర్తలకు ఐదు పౌనులు జరిమానా వడ్డించాడు. అనగా భార్యాభర్తలు పెట్టుకునే ఒకముద్దు ఖరీదు ఐదుపౌనులు అయిన దన్నమాట. ఐదుపౌనులంటే హిందూదేశపు నాణెములలో ఇప్పటి మారకపురేటుప్రకారం నూరు రూపాయిలు. ముద్దుకి నూరేసిరూపాయిల చొప్పున కోర్టువారికి జమ కట్టవలసినవిధి ఏర్పడితే నలకూబరుడువంటి ధనవంతుడుకూడా తనభార్య రంభవంటి రూపసి అయినా ఆమెను ముద్దుపెట్టుకోడానికి జంకుతాడు. జంకు తాడేమిటి? ముద్దుపెట్టుకోనే పెట్టుకోడు—అసలే ఇవి డబ్బు కాటకపురోజులు.

కోర్టువాళ్ళు ఇల్లాగముద్దులమీద దండెత్తడంతోటే ఆయాదేశాలలో రైల్వేవాళ్ళుకూడా ధైర్యంతెచ్చుకొని రైలుస్టేషన్లలోనుంచి ముద్దులకు ఉద్వాసన చెప్పి వానిని బహిష్కరించవలసిందిగా ఫర్మానా జారీ చేశారు. పాశ్చాత్యదేశాలలో భార్యాభర్తలు ఎవరైనా ఒకరు రైలుప్రయాణం అయితే రెండోవారు కూడా సాధారణంగా స్టేషనుకి వెడతారు. ప్రయాణముచేసేవారు రైలుపెట్టెలోకి ఎక్కి కిటికీగుండా ముఖం ఈవతలకి దూరుస్తారు. రెండోవారు ప్లాటుఫారంమీద నిలబడి వీడ్కోలుముద్దు పెడ్తారు. కొందఱు భార్యలు ఇట్లా ప్రయాణమయ్యే తమభర్తలకు వీడ్కోలుముద్దులు ఇచ్చే సందడిలో మునిగిఉంటూండడంమూలాన్ని మఱికొందఱు భార్యలు తమ భర్తలను సకాలంలో రైలు ఎక్కించలేక పోతున్నారు కాబట్టి ఇకముందు స్టేషన్లలో వీడ్కోలుముద్దులు ఉండకూడదని అచ్చటి రైల్వేవాళ్లు శాసిస్తున్నారు.

న్యూయార్కును చెందిన బ్రాంక్సువిల్లాలో గడచిన అక్టోబరు 21-వ తేదీని అచటి పోలీసుకమీషనరు ఫిలిప్ ఇట్లు ప్రకటించాడు: "ఇకముందు స్టేషన్ ప్లాటుఫారములమీద భార్యలు భర్తలను ముద్దుపెట్టుకోకూడదు. రేపటి సోమవారము మొదలుకొని స్టేషనులో ఇద్దఱు స్పెషల్ ఆఫీసర్లు నియమింపబడతారు. వారు ఒక వారమురోజులవఱకు 'భార్యలారా! మీ భర్తలను ముద్దుపెట్టుకోకండి' అని వార్నింగులు ఇస్తూఉంటారు. పై మంగళవారంనుంచీ ఇట్టి వార్నింగులు ఇవ్వబడవు. పిమ్మట ఏ భార్యఅయినా తనభర్తను ముద్దుపెటుకొనుచుండగా చూడబడితే వెంటనే పోలీసుకోర్టులో ఫిర్యాదు చేయబడి ఆమెకు సమన్లు పంపబడును." ముద్దులతనిఖీకి ఇద్దఱు స్పెషలుఆఫీసర్లు! భార్య భర్తను ముద్దుపెట్టుకుంటే సమను!—

కిరసనాయిలు పెట్రోలు డిపోల్లోను- తుదకు వంటచెఱుకుడిపోలలోకూడా - చుట్టతాగకూడదనిన్నీ; పెద్దపెద్ద గ్రంథాలయాలలో బిగ్గరగా మాటలాడకూడదనిన్నీ; ప్రతి పట్టణంలోని కొన్ని వీథులమొగలయందు ఉచ్చపోయకూడదనిన్నీ; నలుగురు జనులుకూడే ప్రతిచోటా—తుదకు సత్రవులలోకూడా—ఉమ్మివేయకూడదనిన్నీ; ప్రతి ఆఫీసులలోను—తుదకు అచ్చుఆఫీసులలోకూడా—అనుజ్ఞ లేనిదే లోనికి రాకూడదనిన్నీ నేటి నాగరికతతోబాటు పెచ్చుపెరిగి ఉన్న వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అరికట్టు—నోటీసు బోర్డులు కనిపిస్తూఉన్నవి. కాని వాటికి ఎవరూ వింతపడడం లేదు. స్టేషన్లలో ముద్దుపెట్టుకోకూడదని కేకలువేస్తూన్నారంటేమాత్రం చాలామందికి విచిత్రంగాఉంది. ఈ విచిత్రానికి కారణం అసంగతి నోటితో చెప్పడంమూలాన్నేమో! నోటీసుబోర్డులు వేయిస్తే సరిపోవచ్చు! ప్రతీరైలుపెట్టెలోను 'దొంగలున్నారు జాగ్రత్త' అని

ఉండనే ఉంది కాబట్టి దాని ప్రక్కను 'ముద్దుపెట్టుకో వద్దు' అనికూడా నోటీసులు చేర్చితే బాగా వుంటుంది. రెండూ ఒకచోట చేర్చడంవల్ల 'దొంగలున్నారు జాగ్రత్త: ముద్దుపెట్టుకోవద్దు' అని కలిపిచదివి భాషా ప్రవీణులు కొందరు అన్వయంచేసినా, వారికి మనం ముద్దుపెట్టుకుంటే పట్టుకునే దొంగలున్నారు జాగ్రత్త అని అర్థంకాగలదని చెప్పి సమాధానపఱచవచ్చును. కాబట్టి ఈవిషయమై నోటీసులు ఏర్పాటుచేయవలసిన అవసరం పాశ్చాత్య దేశపు పోలీసుకమీషనర్లు ఎంత త్వరగా గ్రహిస్తే వారి కంతమంచిది. నోటీసుబోర్డుల కున్నశక్తి నోటిమాట్లకు లేదు—

'తెల్లవారవచ్చింది. ఇక మీ ప్రణయకోపాలను మాని ఒకరిని ఒకరు కౌగలించుకోండి' అని దంపతులనుద్దేశించి ఆంధ్రదేశంలో ప్రబంధకాలంలో కొందఱు కవుల ధర్మమా అని తొలికోళ్ళు కూసేవి. అమెరికా దేశంలో ఈకాలంలో ఒక పోలీసుకమీషనరు పాపమా అని 'ట్రాఫిక్కు' అడ్డువస్తోంది. ఒకరిని ఒకరు ముద్దుపెట్టుకోవద్దు' అని దంపతులను ఉద్దేశించి స్పెషల్ ఆర్డర్లు అరుస్తున్నారు.

ముద్దులను నిషేధించే ఈజాడ్యం ఒక్క అమెరికా దేశపు రైళ్ళలోనే ప్రబలలేదు. ఆస్ట్రియాలోకూడ వ్యాపించింది. 'ఎవడు ఆదర్శకప్రయాణీకుడు?' అను ప్రశ్నకు కొందఱు రైలుపెట్టెలో ఉమ్మివేయనివాడనీ, తను ఒకప్రక్కబల్లమీద కూర్చుని రెండవబల్లకు కాలు తన్నిపెట్టని వాడనీ ఇల్లాంటి సమాధానాలు చెపుతారు. ఆస్ట్రియారైల్వేఅధికారులకు ఈసమాధానాలు ఏవీ సరిపడవు. ఎవడైతే రైలుపెట్టెకిటికీలోనుంచి ముఖాన్ని ముందుకుదూర్చి భార్యచేత వీడ్కోలుముద్దుపెట్టించుకోకుండా వుంటాడో వాడే వాళ్ళదృష్టిలో ఆదర్శక ప్రయాణీకుడు. ఇది వాళ్ళు ప్రకాశంగా అనేమాటే గాని అన్యంకాదు. అల్లాఅని అనడమేకాదు ఆసంగతి పుస్తకాలలో అచ్చువేశారు. రైలుపెట్టెకిటికీలో నుంచి ముఖం ఈవతలికి పెట్టి ముద్దుపెట్టుకోవడంలో పెట్టుకునేవారు పెట్టించుకునేవారుకూడా సమానంగా ప్రమాదానికి లోనగుతారనీ, అప్పటి ప్రమాదాలకు తాము బాధ్యులముకామనీ వారు ప్రయాణీకుల నిబంధనలలో స్పష్టంగా వ్రాశారు.

సరుకును, జనులను మోసుకొనిపోతో మానవులకు చాకరీ చెయ్యడానికి ఏర్పడ్డ రైలువాళ్ళు; దొంగతనాలు, చోరీలు, ఖూనీలు జరక్కుండా జాగ్రత్తపెట్టి ప్రజలను సేవించడానికి ఏర్పడ్డ పోలీసువాళ్ళు; న్యాయాన్యాయాలు విచారించి తీర్పుచెప్పి ప్రజాసౌఖ్యానికి తోడ్పడడానికి ఏర్పడ్డ కోర్టుఅధికారులు పాశ్చాత్య దేశాలలో ఇట్లు ముద్దులను ద్వేషిస్తున్నారు, బహిష్కరిస్తున్నారు, వానిని బయట ఎక్కడాకనిపించడానికి వీలులేని ఘోషాస్త్రీలనుగాచేసి పారేస్తున్నారు.

నరుదృష్టికంటబడితే నల్లరాయిఅయినా పగులుతుంది అంటారు ఏళ్ళుగడచిన పెద్దలు. నల్లరాళ్ళస్థితే అల్లాఉంటే ఇక కేవలం జున్నుముక్కలకంటె మెత్తనైన ముద్దులసంగతి వేరే చెప్పాలా? అవి పగిలిపోవడమే కాకుండా ఆగిపోవలసివస్తే కొంచమేనా ఆశ్చర్యపడనక్కఱలేదు.

నాలుగు పెదవుల ఏకాంతమనీ, వలపుయొక్క బీగమనీ, ప్రేమరాజ్యపు బావుటా అనీ, ప్రేమ అను తాపీపనివాడు ఉపయోగించు సిమెంటు అనీ, నోళ్ళు అనబడు వీణలయొక్క శ్రుతిఅనీ ఇత్యాదిగా కవిపుంగవులచే గొప్పగా వర్ణింపబడిన ముద్దులకు-ఇప్పుడు పాశ్చాత్యదేశాలలో కోర్టుసమన్లతో నలిగిపోయి సాక్షిసంపన్నాలతో తారుమారై పోలీసువారి కళ్ళబడి దృష్టిదోషానికి గురై జరిమానాలతోను, శిక్షలతోను తారెత్తి శాసనసభలలోకాని తలవాకిళ్ళలోగాని, రోడ్లమీదగాని, రైలుస్టేషన్లలోగాని, తుదకు జట్కాబళ్ళలోకాని స్థానంలేక ఉత్తరహిందూదేశపు ఘోషాస్త్రీవలె పరులకంట బడడానికి వీల్లేక తెనుగుదేశపు శోభనపు పెళ్ళికూతురులాగ పడకగదిలోనే ఉండిపోవలసినగతి పట్టేటట్టుంది. 'ఏనాటి కేమిరానున్నదో' అని పాడే వేదాంతులు వెఱ్ఱివాళ్ళుకారు.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.

" ఆంధ్రశ్రీ "



డా. కే శవన్ రావ్ పిళ్లై

# జాన్ డేవిసన్ రాక్‌ఫెల్లర్

[దరిద్రుడై పుట్టి కిరసనాయిలు, పెట్రోలియము మొదలగు నూనెల వర్తకముచేసి లోకమునందలి ధనికులలో రెండవస్థాన మాక్రమించుచున్నవాని విచిత్రచరిత్రము.]

రాత్రులయందు చీకటిని పోద్రోలు దీపములను వెలిగించు కిరసనాయిలు—త్వరప్రయాణలాభమును కలిగించు మోటారును నడుపు పెట్రోలియము మొదలగు నూనెల వర్తకమునకు నిరంకుశాధిపతియగు వానిచరిత్ర తెలిసికొనుటకు ఎవనికి కుతూహలముగ నుండదు? తన జీవితకాలములో 150,000,000 పౌనులను దానము చేసిన వ్యక్తి ప్రపంచచరిత్రలో నేటివఱకు ఒక్కడే గలడు. వివిధములైన పండ్రెండుదేశములలో ధర్మసంస్థలకు, ఆసుపత్రులకు, కళాశాలలకు, విద్యార్థివేతనములకు కోట్లకొలది పౌనులు, డాలర్లు ఇచ్చి దానకర్ణులలో నెల్ల దానకర్ణుడనిపించుకొనిన ఆవ్యక్తి తనజీవితారంభమున పాలికాపు. అప్పు డాతనికి దినమునకు పదునైదుగంటలచొప్పున పని, ఇరువదియైదుసెంట్ల జీతము.

మనదేశపునాణెములలో ఆ ఇరువదియైదు సెంట్లును దాదాపు పండ్రెండు అణాలు అగును. అదేవ్యక్తి ముప్పదివత్సరములకుపిమ్మట ఒక సెకండునకు అరువది నాలుగు సెంట్లచొప్పున ఆర్జించుచుండెను కడచిన ఇరువదివత్సరములలో హెన్రీఫోర్డు తరువాత ప్రపంచమున ఆతడే అధికధనవంతుడయ్యెను.

కోటికి కోటి పడగలెత్తిన ఆ వణిక్పుంగవునినామము జాన్ డేవిసన్ రాక్‌ఫెల్లరు. అతని ఎనుబది తొమ్మిదవ ఏట ఆ దానకర్ణుని ఆస్తి మొత్తపువిలువ 80,000,000 పౌనులుండెను. ఈ మొత్తములో ఆతడు తనకుమారున కిచ్చిన 60,000 000 ను చేరియుండెను. 150,000,000 పౌనులు దానముచేసినను ఇంకను 80,000,000 పౌనులు మిగిలియుండెను! ఒక్కవ్యక్తి 280,000,000 పౌనులను—యుద్ధమునకు పూర్వము గ్రేటుబ్రిటనుప్రభుత్వమువారి సంవత్సరాదాయముతో సమమైన మొత్తము - ఆర్జించెను! ఇది ఎట్లు పొసగెను? ఈ ప్రశ్నకు ఏకపదసమాధానము చెప్పవలెనన్నచో 'నూనె' అనిన చాలును.

నూనెగనులు కనుగొనబడుటతో ఈ పాలికాపు కుబేరుడయ్యెను. రాక్‌ఫెల్లరు అను అతనినామము ప్రపంచమున ధనవంతుడనుటకు పర్యాయపదమయ్యెను. అట్టి విచిత్రపురుషుని జీవితచరిత్ర ఇచట ఒక్కింత విపులముగ చెప్పబడుచున్నది.

న్యూయార్కురాష్ట్రమునకు చెందిన టియోగాకౌంటీయందలి రిచ్‌ఫర్డుచెంతగల నొక పాళెములో జాన్ డి. రాక్‌ఫెల్లరు 1839-వ సంవత్సరమున జననమందెను. అప్పటికి ఆతనికుటుంబము ఆ ప్రాంతమునగల కుటుంబముల అన్నిటిలోకిని లోపానైనది. ఇల్లు మిక్కిలి జీర్ణస్థితిలో నుండెను. ఈరాక్‌ఫెల్లరు చిన్నతనమున ప్రక్కపై వెల్లకిలపరుండి ఇంటికప్పులోని చిల్లులద్వారా ఆకాశమునందలి చుక్కలను తేఱిపాఱచూచువాడు. సూర్యచంద్రులను కట్టివైచిన ఆ యింటిలో భయంకర దారిద్ర్యము—ఏ పూటకు సరిపడిన ఆహారమును ఆ పూట సంపాదించుట వారికి ప్రతిదినసమస్య—నేడు ప్రపంచమునందలి ధనవంతులలో ద్వితీయస్థాన మాక్రమించుచున్న రాక్‌ఫెల్లరు ఆయింటియందే పెరిగి పెద్దవాడయ్యెను.

ఆ దినములలో నాతడు వృకోదరుడైయుండెను. కాని ఆ నిరుపేదయింటబుట్టిన అతని ఆకలికి సరిపడిన ఆహారము దొరకదయ్యెను. విచిత్రమేమన కోటీశ్వరుడైనపిమ్మట అతని జీర్ణశక్తి మందమైపోయెను. ఇపు డాతనికి ఒక చిన్నరొట్టెముక్క, ఒకదొప్పెడుపాలు కష్టముమీద అరిగించుకొనగల విందుభోజనమైయున్నది.

పొరుగునఉన్న పలుకుటుంబములుకూడ దరిద్రములైనవే. కాని రాక్‌ఫెల్లరు కుటుంబముకంటె ఎన్నియో

రెట్లు మంచిస్థితిలో నుండినవి. ఆ కుటుంబములందలి వారు వీరియింటి జీర్ణస్థితి, పేదతనమునుజూచి జాలి పడుచు తమకు చేతనైనసాయమును చేయుచుండువారు. జాన్ క్రమముగా శైశవస్థితిని వీడుచుండెను—కాని అతడు తెలివైనవాడుగా, చురుకైనవాడుగా చూపట్ట లేదు. ఆ మొద్దబ్బాయినిచూచి వారు తలలూపువారు; భావికాలమున అత డెట్లు బ్రతుకుతెరువు కనుగొనగల డా అని విచారించువారు.

కాని రాక్ ఫెల్లరుమాత్రము భావికాలమున తా నెట్లో గొప్పవాడనుకాగలనని ఆ దినములలోకూడ భావించు వాడు. ఆ బాలుడు స్నేహితుడగు మఱియొకబాలునితో నదీతీరమున తిరుగుచు ఇట్లు చెప్పెను: "నేను పెద్ద వాడినైనప్పుడు నూరువేల డాలర్లుకూడ బెట్టదలచియు న్నాను." అప్పటి కాతనిఊహలో నూరువేలడాలర్లు ఒక గొప్ప మొత్తముగానుండెను. కాని అనంతరకాల మున తాను ఈ నూరువేలడాలర్లకు నాలుగురెట్లచొప్పున దినమునకే ఆర్జింపగలుగుదునని అతడు అప్పుడు కలనైన భావించియుండడు!

రాక్ ఫెల్లరు సాధారణమైన పొలముపనులుచేయ గలపాటి వయస్సువాడయ్యెను. ఆ రోజులలో అమె రికాయందు పేదరైతులబిడ్డలు వేసవిలో పొలముపనులు చేయుచు శీతకాలమున బడికిపోవువారు. మన కథా నాయకుని విషయమునకూడ ఇదేపద్ధతి. పొలముపని తెల్లవాఱగట్ల నాలుగున్నరగంటలకు ప్రారంభమై బాగుగా చీకటిపడువఱకుండెను. ఈ పదునైదుగంటల పనికిని ఆతనికి దినమునకు ఇరువదియైదుసెంట్లచొప్పున ఇచ్చువారు.

పనిని నెమ్మదిగాచేయు రాక్ ఫెల్లరునుచూచి పొల ముకాపులు విసవిసపడువారు. ఆ రోజులలోకూడ రాక్ ఫెల్లరు తాను చేయవలసిన పనినిగూర్చి ముందుగా యోజించికొని అది నిర్వహింపవలసిన విధానమును నిర్ణ యించుకొనువాడు. 'ఈ విధానమువలన ఏకార్యము నైన చక్కగ చేయగలపద్ధతి లభించునది' అని జాన్ డి. రాక్ ఫెల్లరు చెప్పెను. పొలముకాపులుమాత్రము ఈతని దూరపుటాలోచనను గ్రహింపలేకపోయిరి. వట్టి మందుడని కసరికొట్టిరి. ఇతరులు ఇతనికంటె చురు కుగా చేయుచున్నను చిట్టచివరకు ఇతనియంత పొందిక గా చేయజాలకుండి రనుసత్యమును తెలిసికొనుపాటి తెలివి ఆ రైతులకు లేకపోయెను

శైశవమునుండియు ఏపనియున్నను రాక్ ఫెల్లరుకు ఇష్టమైయుండియుండునని ఆతని నేటిధనసంపదనుబట్టి పలువురు తలంతురు. కాని నిజముచెప్పినచో ఈ తలం పులు నిరాధారములగును. తనకంటె అదృష్టముపెట్టి పుట్టిన తోటిబాలురు పాఠశాలలకు పోవుచుండగా తాను పొలము పనిచేయవలసివచ్చినందులకు ఆతనికి కష్ట ముగ నేయుండునది. పొలముపనిలో వెళ్ళబుచ్చిన ఆ దినములనుగూర్చి నేడు స్మరించుచు ఆతడు అవి తనకు ఇచ్చిన అనుభవసంపదను పేర్కొనును. 'తాళిమి నే నచ్చట నేర్చుకొంటిని' అని ఆతడు చెప్పెను.

రాక్ ఫెల్లరు ఇంకను బాలుడైయున్న ఈ దినముల లోనే ఆతని తల్లిదండ్రులు ఉన్నతావు విడిచి క్లీవ్ లాండుపట్టణములో స్థిరపడిరి. కుటుంబపుటాదాయము నకు తనశక్తికొలది చేర్చుటకుగాను ఏదైనపని సంపాదిం చుట అచ్చట ఆతని ప్రథమకృత్యమయ్యెను. హూ విట్ టటిల్ అను పేరబరగు నొక కంపెనీలో ఆతడు వారమునకు రెండు మూడు డాలర్లజీతముపైని పనికి కుదిరెను.

పొలముపనిలోకంటె ఈపనిలో జీతము హెచ్చు; దానికంటె ఇది తనకు పట్టినది. కొద్దికొద్దిగ వ్యాపా రానుభవము కలుగుచున్నది; బహురీతుల మనుష్యులను చూచుటకు అవకాశమేర్పడినది, పట్టణములోని జీవిత విధానము అవగతమగుచున్నది—ప్రపంచమున తానును ఒకముఖ్యస్థానము ఆక్రమింపవలయుననువాంఛ ఆతని కీదినములలోనే కలిగెను. కీర్తినిశ్రేణికపై తన కాలుం చుటకు అవకాశము కల్గించు శుభసమయమునకై నిరీ క్షించుచు ఆత డీదినములలో తాను ధనవంతుడగుటకు మనోనిశ్చయము చేసికొనెను.

ఈ తర్బీతుకాలములో ఆతడు నేర్చుకొనిన గొప్ప పాఠము—ధనమును ఆర్జించుట, వ్యయము చేయుట లనుగూర్చి. ధనమును ఆర్జించుటయు, వ్యయము చేయు

టము నొక గొప్పకళయనియు, ఆకళ నేర్చినవారు ప్రపంచమున మిక్కిలి తక్కువగానుందురనియు జాన్ డి. రాక్‌ఫెల్లరు నమ్మకము. ఆత డొకసారి ఇట్లు చెప్పెను: 'ప్రతి యువకుడును తన ధనవిషయమై విశేషమైన జాగ్రత్త చూపవలయును. తాను ఎంత ఆర్జింపగలడో అంతయు ఆర్జింపవలయును, ఎంత కూడబెట్టగలడో అంతయు కూడబెట్టవలయును, ఎంత దానము చేయగలడో అంతయు దానముచేయవలయును.'

ఈ దినములలో ఆత డార్జించిన, వ్యయముచేసిన ప్రతి సెంటునుగూర్చియు జమాఖర్చులను తెల్లపు మాసిపోయిన ఎక్కౌంటుపుస్తకము నేటికికూడ ఈ తైలవణిక్పుంగవునికడగలదు. ఆదాయముకొలదియైనను ఆ దినములలోకూడ నాతడు కూడినంతధనమును దానము చేయువాడు. 1855 సెప్టెంబరు 1856 జనవరి మధ్యమున ఆతడు ఏబదిడాలర్ల నార్జించెను. బస, భోజనము, చాకలి ఖర్చుపోను ఇందుండి ఆతడు కొంత మిగల్చగలిగెను. ఈ మిగిల్చినదానిలో 'ఆదివారపుబడి'కి వారమునకు ఒక సెంటుసొమ్మును, ఇతర మతసంస్థలకు మఱికొంత కొద్దిపాటిసొమ్మును ఇచ్చువాడు. ఇచ్చినది కొంచమే. కాని ఆ దినములలో ఆతడు మిగల్చ కలిగినది అంతియే. కాని తాను సంపాదించినదానిలో కొంతదానమునకై ప్రత్యేకించు అతని సుగుణము ఈ దినములయందే అతనియందు స్ఫుటముగా ద్యోతకమై అనంతరకాలమునందు ఆతనికి దానకర్ణుడను ఖ్యాతి నార్జించెను.

ఒక సంవత్సరమునకుపిమ్మట అదే ఎక్కౌంటు పుస్తకము ఆతని నెలజీతము ఇరువదియైదుడాలర్లకు పెరుగుటను; ఒక్కనెలలో ఆతడు న్యూయార్కునందలి ఒక మిషన్‌సొసైటీవారికి పండ్రెండుసెంట్లును, మఱియొక విజాతీయ మిషన్‌సొసైటీవారికి పది సెంట్లును ఇచ్చియుండుటను చూపుచున్నది. అర్హుడగువానికి సాయముచేయుటకు ఒకడు గొప్పవాడైయుండనక్కర లేదని ఇతరులకు జాన్ డి. రాక్‌ఫెల్లరు ఆచరణపూర్వకముగా బోధించినాడు. జేబునందిముడు పరిమాణమునుమాత్రము గలిగి పలువత్సరముల నాటిదగుటచే బాగుగా మాసియుండి నేటికిగూడ ఒక నిక్షేపమువలె దాచబడుచున్న ఆదినములయందలి ఆతని ఎక్కౌంటుపుస్తకము నేడు కోటీశ్వరుడై ఆతడు ఏ దానగుణమును బోధించుచున్నాడో ఆగుణము నాతడు యౌవనకాలమునగూడ కలిగియుండుటను నిదర్శించుచున్నది.

మఱియొక కంపెనీలో గుమాస్తాపని దొరకెను. జమాఖర్చులను వ్రాయుచుండుట ఆతనిపని. అంకెలు అనిన ఆతనికి ఎంతుచేతనో అతిప్రేమ. ఒక్కొక్కప్పుడు నిముసములకొలది ఆతడు రెప్పవేయక జమాఖర్చుల అంకెలను తేరిపాఱచూచుచుండువాడు. పైము అయిపోయి తాను ఇంటికి పోవలసిన సమయమునగూడ తఱచుగా నాత డిట్లు అంకెలను తేరిచూచుచు ఉండిపోవువాడు. పాలముపనిచేయుటలోగల ఆతని జడత్వము ఇచట లేకుండెను. ఈకంపెనీలో ఉండగనే ఆతనికి పెద్దవర్తకుల పలువురితో పరిచయము అగుచుండునది. కొద్ది పెట్టుబడితో వారెట్లు కష్టపడి వ్యాపారప్రారంభము కావించి నేడు ధనవంతులైరో వినుచుండువాడు. తాను వారివలె ఎందుకు కాగూడదు?

ఇరువదియేండ్లయిన నిండలేదు. అనుకూలము ఏర్పడిన మఱునిముసమునందే స్వంతముగ వ్యాపారము చేయుటకు ఆతడు ఊఱకలువేయుచుండెను. ఉద్యోగరీత్యా ఆతడు తలిదండ్రులను విడిచి వేఱొకతావున ఉండవలసివచ్చెను. వారమునకు ఐదుడాలర్లు జీతము. ఊరిలో మారుమూల చవకగ దొరుకుచోట గది అద్దెకుపుచ్చుకుని అతిక్లిష్టముగ జీవించువాడు. భోజనమునకు బసకు ఒకడాలరు మాత్రము వెచ్చించి మిగిలిన నాలుగుడాలర్లు మిగుల్చువాడు. చిన్న వ్యాపారము పెట్టుటకైనను పెట్టుబడి వలయును. ఆరోజులలో క్లీవ్లాండునం దొకకలపవర్తకుడు వర్తకమున గొప్ప నష్టమును పొంది ఒడుదొడుకులలోనుండి తన కలపను మిక్కిలి తక్కువవెలకు అమ్మజూపెను. తానంతవఱకు కూడబెట్టియున్న ధనముఅంతటితో—మనసున విశేషమైన అలజడిపొందుచునే—రాక్ఫెల్లరు కొనివైచెను. ఆరోజుననే దానిని తానుకొన్న దానికి పండ్రెండురెట్లు హెచ్చుధరరాగా అమ్మివైచెను. అది ఆతని ప్రథమ

స్వతంత్రవ్యాపారము. అది శుభమునే సూచించెను. ఆనాటిరాత్రి ఆతడు నిండారిన సంతోషముతో ఇంటికి నడచివెళ్ళెను. వ్యాపారపురుచి తెలిసివచ్చినది.

గుమాస్తాగిరి వదలి క్లార్కు అనువానితో కలసి వ్యాపారము ప్రారంభించెను. కూరగాయలదగ్గరనుంచి సమస్తము దిగుమతిచేసి అమ్మి వ్యాపారము. కంపెనీ లాభములు పెంచుటకు ఆతడు ఎద్దువలె పనిచేసెను. జాయింటుయజమానికదా అని ఆతడు కూలివాండ్రతో కలసి పనిచేయుటకు ఎప్పుడును వెనుదీయువాడు కాదు. ఒకసారి ఆతడు గిడ్డంగిలో రాత్రిఅంతయు ఉండి ఒకపెద్దచిక్కుడుకాయలరాశిని రకమువారిగా విడతీసినాడు. పనివానినే ఆరాత్రి కాపనిని చేయుమనిన అదనపుకూలి అడుగును. అవసరమగుచో తానే కూలివాడుగా పనిచేయుచు రాక్ఫెల్లరు అదనపుకూలి ఈయవలసిన అవసరములేకుండ చేయువాడు.

విలియమ్సు అను ముతకనీళ్ళకాలువ గొట్టముల వర్తకు డొకనికడ ఆదినములలో రాక్ఫెల్లరు అక్కవుంటుగుమాస్తాగాచేరెను. సాలుకి వేయిడాలర్లజీతము. —వారమునకు నాలుగుపౌనులు పొలములో పాలికాపుగా జీవితమును ప్రారంభించిన వానికి ఇది మంచి ఉద్యోగమే. యజమాని రాక్ఫెల్లరును గూర్చి ఆదినములలో ఇట్లు చెప్పెను: "శాంతుడు, శ్రద్ధగలవాడు, యువకుడు, పనికి వెలువనివాడు, శక్తిసంపన్నుడు; సూక్ష్మగ్రాహి." ఇన్ని గుణములుకలవాడు ఆదర్శోద్యోగి కాక ఎట్లుండును?

విలియమ్సు చెప్పినటుల రాక్ఫెల్లరుకడ సూక్ష్మగ్రాహిత్వము, శక్తిసంపన్నత ఉండెను. ఈరెండు గుణములే ఆతని భావికాలపు-దిగ్భ్రాంతి గొలుపు-జయమునకు కారణభూతములు. అప్పటికి కొలది కాలమునకు క్రితమే అమెరికాదేశమున నూనెగనులు కనుగొనబడియుండెను. సూక్ష్మగ్రాహియగు రాక్ఫెల్లరు రాగల కాలమున ఆనూనె ప్రజాజీవితమున ఎంతటి ఉపయోగమునొందునో, ఆనూనెల పరిశ్రమకు అధికారిగాగలవానికి ఎంతటిధనము సమకూరనున్నదో గ్రహించెను. ఉద్యోగరీత్యా విలియమ్సుకంపెనీవారి లెక్కలకు సంబంధించిన అంకెలతో ఆతడు కట్టుపడియున్నను కాలము వృథచేయక తీరికసమయములందెల్ల వేళల ఈనూనెగనులనుగూర్చి ఆతడాలోచనానిమగ్నుడగుచుండువాడు. నూనె ఎచ్చటపట్టుకొనబడుచున్నది, ఎచ్చట జాగ్రత్తచేయబడుచున్నది, ఎట్లు ఇతరదేశములకు ఎగుమతిచేయబడుచున్నది మొదలగు విషయములనుగూర్చి ఆతడు కూలంకషముగ చదువువాడు. మనస్సున ధైర్యముకలిగినతోడనే ఆతడొకనాడు తన యజమానివద్దకు పోయి జాయింటుగా ఈనూనెల వ్యాపారము ప్రారంభించుటను గూర్చి ఉపపాదించెను —విలియమ్సువలసిన పెట్టుబడిపెట్టుటకు, రాక్ఫెల్లరు పనిచేయుటకు. నూనెల వ్యాపారమున విశేషధనమార్జించుటకు అవకాశముకలదని రాక్ఫెల్లరు చెప్పుదానిలోని సత్యమును విలియమ్సు గ్రహించెను; ఆతని ఉపపాదనకు అంగీకరించెను. తన్ను నూనెల రాజుగాచేసి విఖ్యాతిగొనివచ్చిన వ్యాపారమున రాక్ఫెల్లరు అడుగుపెట్టెను.

పెట్రోలియము పరిశ్రమకు అవి ప్రారంభదినములు. వర్తకులలో వర్తకులకు పోటీహెచ్చుగా నుండెను. ఫలానాప్రదేశములలో నూనెగనులు కలవని తెలిసినచో అవర్తకులు వానినికొనుటకై విఱగబడువారు. కాబట్టి ఏప్రదేశమున నూనెగనులుకలవో కనుగొనుటకై రాక్ఫెల్లరు బోరింగులుదింపుట అతిరహస్యముగ చేయవలసియుండెను. అందుచే తన జాయింటుదారగు విలియమ్సు ఇంటియందలి ఒక నేలమాళిగయందు ప్రథమమున బోరింగుదింపుటకు నిశ్చయింపబడెను. ఆచుట్టుపట్ల పలుతావులయందు నూనెగనులుకలవు—ఈ విలియమ్సు ఇంటిక్రిందమాత్రము ఒక పెట్రోలియము చెలువు ఎందుకుండకూడదు? ఇట్లని రాక్ఫెల్లరు భావించెను. బోరింగు పాతాళలోకమునకు దింపబడెను. —నూనె కనుగొనబడెను—కాని ఎగజిమ్మబడు తైలమునకు అంతులేకుండెను. ఇంటి అడుగుమట్టమంతయు నూనెవఱదలో మునిగిపోయెను. ఇంటిరూపు చెడిపోయెను.

తైలనిక్షేపము దొరకినందులకు రాక్ఫెల్లరు మిన్నందుచుండెను. కాని విలియమ్సు, అతని కుటుంబమువారు ఈ సంతోషమున భాగస్వాములు కాలేదు. శక్తిసంప

న్నుడగు తనభాగస్వామి తనభవనమును పచ్చముపాడో నర్చెను విలియమ్సు పేదవాడుకాడు—కనుగొనబడిన తైలనిక్షేపము విశేషధనమును కొనిరాగలదు. అయినను ఇల్లుపోయినందులకే ఆతడు కించపడి రాక్ఫెల్లరు నూనెవ్యాపారములో తనకు భాగము అక్కఱలేదని నాడు. భాగస్థులు విడిపోయినారు. జీవితమున చక్కని ప్రారంభమునుకల్పించి విలియమ్సు రాక్ఫెల్లరును విడనాడినాడు. అనంతరము విలియమ్సు చికాగో నగరమునకుపోయి తన తొలుతటి వ్యాపారము గుములుగుంటి కాలువగొట్టముల నిర్మాణమునుసాగించి కోటీశ్వరుడయ్యెను. కాని కోటికి కోటి పడగలెత్తిన రాక్ఫెల్లరు విశేషధనముతో పోల్చినపు డది ఏపాటిది?

రాక్ఫెల్లరుమాత్రము నూనెగనులను విడనాడలేదు. అతని కది ద్రవరూపముననున్న బంగారము. ఒక గని తరువాత మఱియొక గని. ఓహియోయందును, ఇతర రాష్ట్రములయందును నూనెగనులు కనుగొనెను. స్టాండర్డు ఆయిల్ ట్రస్టు ఏర్పడెను అతని ఇప్పటివయస్సు ముప్పదివత్సరములు మాత్రమే. క్రమముగా నూనె ప్రపంచమున ఆతడు ప్రతిస్పర్థిలేని చక్రవర్తి, ప్రపంచమునందలి కుబేరులలో రెండవవాడు ఆయెను.

మెషినులకు; ఇండ్లయందును, వీథులయందును దీపములు పెట్టుటకును; మఱికొన్ని ఇతర పరిశ్రమలకు మాత్రమే అప్పుడు ఈ నూనెల నుపయోగించువారు. క్రొత్తమార్కెట్టులను కనుగొనుటలో స్టాండర్డు ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ప్రపంచమునంతను చుట్టువారు. 400,000,000 మంది జనాభాగల చీనాదేశమున దీపములకు కిరసనాయిలు ఉపయోగము ఇంకను తెలిసికొనబడకుండెను. ఈ సంగతి వినినతోడనే రాక్ఫెలరు దీపములకు కిరసనాయిలు ఉపయోగింప నిశ్చయించు చీనావారి కందఱకును పారఫిన్ ల్యాంపులు ఉచితముగా ఇచ్చునట్లు ఏర్పాటుచేసెను. ఎన్నివేల ల్యాంపులు ఈయబడినవో లెక్కలేదు. ఇందువలన రాక్ఫెల్లరు అనుకొనినదానికన్న హెచ్చులాభమే వచ్చెను. అచిరకాలముననే చీనాదేశమున ఏడాదికి స్టాండర్డు ఆయిల్ కంపెనీవారి కిరసనాయిలు 5,000,000 గాలనులు ఖర్చు అగుచుండెను.

వర్తకప్రపంచమున ఒక్క ప్రత్యేకవిషయములో ప్రతిస్పర్థిలేని చక్రవర్తియగుట సుకరముకాదు. రాక్ఫెల్లరు వారమునకు ఆరురోజులు పని, రోజుకు పదిగంటల పరిశ్రమ—ఇట్లు ముప్పదివత్సరములు పనిచేసెను. పది ఏండ్లలో ఆతడు లెక్కకు మూడు రోజుల సెలవులైన గైకొనక పాటుపడెను. విశ్రాంతిగొనుసరికి ఆతడు నియమిత కాలములందు పలుసారులు పదిలక్షలడాలర్ల చొప్పున దానముచేసియుండెను. వ్యాపారకార్యనిర్వాహణమున ఆతడు యూరపుఖండమును రెండు సారులు సందర్శించెను—అమెరికాసంయుక్తరాష్ట్రములను మూడుసారులు చుట్టివచ్చెను.

రాక్ఫెల్లరు వ్యాపారవిస్తృతిని కొంతవఱకు ఈ క్రింది అంకెలు చెప్పగలవు: నేడు స్టాండర్డు ఆయిల్ కంపెనీ ఉద్యోగుల, పనివారలసంఖ్య 35 000. వీరందఱికిని ఏడాదికి ఈయబడు జీతములమొత్తము 4,000 000 పౌనులు. 20 000 మైళ్ళు వ్యాపించిన నూనెపంపులు ఈ కంపెని స్వాధీనమునగలవు. సముద్రములమీద విదేశములకు నూనెలగొనిపోవుటకు 250 పెద్ద స్టీమరులు, భూమిమీద ఒకతావునుండి ఒకతావునకు నూనెకొనిపోవుటకు 50 000 మోటారుట్యాంకులు. గడచిన ఐదు సంవత్సరములలో ఏడాదికి సగటున 4 000,000 బారెళ్ళల, 400,000,000 కాన్ల నూనెను ఈ కంపెనివారు ఉత్పత్తిచేసియుండిరి. ఈ కంపెనీ తన అధ్యక్షుడగు రాక్ఫెల్లరునకు ఏడాదికి 30,000,000 పౌనుల ఆదాయమును కలిగించుచున్నది.

ధనమార్జించుట, దానముచేయుట అను కృత్యములలో రాక్ఫెల్లరు జీవితమునందలి ప్రతిక్షణమును నిండారియుండెను. ధనమార్జించుటలో ఎంతశ్రద్ధయో దానముచేయుటయందును ఆతని కంతశ్రద్ధ. వృద్ధాప్యమున సుఖించుటకుగాని, అనంతరకాలమున విలాసలాలసత్వమున మునుగుటకుగాని, యాత్రలుసాగించి వివిధదేశదృశ్యసందర్శనముతో వినోదించుటకుగాని ఆర్జింపక దానముచేయుటకొఱకుమాత్రమే ధనమార్జించిన వ్యక్తి ప్రపంచచరిత్రలో ఆత డొక్కడే.

రాక్ఫెల్లరు తీసికొనిన పెద్ద శలవులలో మొదటిది అయిదువారముల పరిమితిగలది. తనతో ఒకప్పుడు భాగస్వామిగా ఉన్న విలియమ్స్ ఇంట తాను పెట్రోలియమును గనుగొనిన ముప్పదిసంవత్సరములకు పిమ్మట ఆతడు సెలవునుగొని అలాస్కాకుపోయెను. ధనసంపదలో మోటారురాజు హెన్రీఫోర్డు అప్పటికి రాక్ఫెల్లరును మించలేదు. కావున రాక్‌ఫెల్లరే అప్పటికి లోకమునందలి కోటీశ్వరులలో మొదటివాడైయుండెను. అట్టివాడు అలాస్కాలో నిజుపేదలతోకూడ సంభాషించుచు, ప్రయాణికులు ఆనందించు అన్నివేడుకలందును పాల్గొనుచు, మంచుదిబ్బలనెక్కుచు వినోదించెను. రైలుమీదనైననేమి, పడవమీదనైననేమి, బండిమీదనైననేమి ఆతడాయాత్రలో పదివేలమైళ్ళప్రయాణము సల్పెను. ఐదువారముల అనంతరము ఆతడు ఆఫీసుకు తిరిగివచ్చి అందరి ప్రతి ఒక్కొక్కరికంటెను ఎక్కువదీక్షతో తిరిగి పనిచేయనారంభించెను.

ఆతని ఎనుబదితొమ్మిదవఏట ఆతనిదియు, ఆతని కుటుంబపుదియునగు ఆదాయము ఒక రెప్పపాటుకాలమునకు నాలుగురూపాయిలు. యువకుడగు ఒక ఎక్కవుంటుగుమాస్తా తన తీరికసమయముల వ్యర్థపఱుపకనూనె పరిశ్రమనుగూర్చిన వాఙ్మయమునంతను సంపాదించి చదివి అవకాశమునందుకొని పరిశ్రమ చేయుట చేతనే ఇంతటి ఆదాయము కూర్పబడినది. రాక్ఫెల్లరు మనస్సునపుట్టిన ఆనాటితలంపు, ఆతనివలెనే రైతుబిడ్డయైపుట్టి మోటారుకారులను కనుగొనిన ఫోర్డు మనస్సునపుట్టిన తలంపు—ఒక్కొక్కటి ఎంతటి ధనమును ఆర్జించినదో! రాక్ఫెల్లరు, ఫోర్డు. రాక్ఫెల్లరు పెట్రోలులేనిదే ఫోర్డు కారు నడవదు. కారులేనిదే పెట్రోలుకు ఖర్చులేదు. ప్రపంచధనవంతులలో ప్రథమ ద్వితీయస్థానము నాక్రమించుచున్న ఫోర్డురాక్ఫెల్లరుల సంపద అంతయు ఇట్లు అన్యోన్యాశ్రితమైయున్నది. ఇరువుర జీవితములును అతివిచిత్రములైనవి.

ప్రస్తుతము రాక్ఫెల్లరు విశ్రాంతిగొనుచున్నాడు. న్యూయార్కుపరిసరముల నతిక్రమించియున్న ఒకానొక గ్రామసీమయందు ఆతని ఉనికి. చుట్టములను సందర్శించుట ఆతని ఈ విశ్రాంతిసమయకృత్యములలో నొకటి. తొంబదిఏండ్లు నిండినవాడు. ఆతడిప్పుడు వనములను, పొలములను ప్రేమించు వేదాంతి; ప్రకృతిని మనోహరముగ వర్ణింపగల వ్రాయసకాడు. తన పల్లెటిగృహము, కుటుంబము ఈ రెండునుగాక ఆతనిదృష్టి నిపుడు ఆకర్షించువానిలో ముఖ్యమైనది ఇపుడిపుడే వ్యాపారజీవితారంభమును గావింప నుంకించుచున్న యువకుల సంగతి. అప్పుతెచ్చి వ్యాపారము ప్రారంభించుట యువకులవిషయమున అనేకులు అంగీకరింపరు. కాని ఇందునుగూర్చి రాక్ఫెల్లరుమాత్రము ఇట్లు చెప్పెను: “ఒకడు జీవితమున జయమునందుట కార్యకలాపము నిర్వర్తించుటకు ఆతనికడగల ధనముపై ఆధారపడియుండును. కాబట్టి ధనవంతుల విశ్వాసమును, నమ్మకమును సంపాదింపుము, అప్పుగొనుము. వలసిన ధనము సమకూరినతరువాత కోటీశ్వరుడగుటగాని, కూటిపేదయగుటగాని ఆవ్యక్తి పురుషకారము మీదనే ఆధారపడియుండును”

దానకర్ణుడగు ఆ కోటీశ్వరుడు గర్వమనునది ఎఱుగడు. ఫొటోతీయించుకొనుటకు ఆతడెన్నడును అంగీకరింపలేదు. ఆతనిఫొటో మొదట లోకమునకు చేకూరినవిధము కొంతవఱకు చమత్కారమైనది. యువకుడగు ఫొటోగ్రాఫరు ఒకడు రాక్ఫెల్లరు చర్చికిపోయిన సమయము కనిపెట్టి ఆతడు వచ్చుదారిలో తనకెమెరాతో పొంచియుండెను. రాక్ఫెల్లరురాగా ఆతనికి తెలియకుండ ఫొటోతీసెను. అనంతరము నెగటివ్‌ను డెవలప్‌చేసి—‘ఇది మీ ఆమోదమును బడయదేని వెంటనే నాశనముచేయుడు’—అను విన్నపముతో రాక్ఫెల్లరుకు పంపెను. తనకు తెలియకుండగ తన ఫొటోను ఇంత చక్కగతీసి తన అంగీకారములేకుండ ప్రచురింపనొల్లని ఆ యువకుని ఉచితజ్ఞతకు రాక్ఫెల్లరు ఎంతయు సంతసించి, ఆతనికి కబురుపంపి ఆతడు వాంఛించినపుడెల్ల ఆతని కెమెరా ఎదుట తాను నిలబడుటకు తనసమ్మతిని తెలిపెను.

రాక్ఫెల్లరున కిప్పుడు తొంబదినాలుగవసంవత్సరము. ఏ పనిచేయుటకును అశక్తుడు; అజీర్ణరోగమునకు దాసు

డు. వైద్యకళయందు అసదృశమగు అభివృద్ధిచూపు చున్న యూరపు, అమెరికాఖండముల భిషగ్రత్నములు కూడ ఆతని అజీర్తిరోగమును మాన్పలేకపోయిరి.

గడించినధనమును, దానముచేసిన మొత్తమును తలంచుకొనుచో రాక్ఫెల్లరు చర్చికిపోవునపుడుగూడ నిర్మలమనమునే కలిగియుండవచ్చును. తండ్రివలెనే జాన్ డేవిసన్ కూడ క్రైస్తవులలో బాప్టిస్టుశాఖను చెందినవాడు. న్యూయార్కునందు విశేషధనవ్యయముతో ఆతడే కట్టించిన ఫిఫ్తు ఎవెన్యూ బాప్టిస్టుచర్చి ఆతని పూజాగృహము. అచటకూడ విశేషజనమధ్యమున నిలబడి బిగ్గఱగా ప్రార్థించుట ఆతని యలవాటు. ప్రార్థనావసరమున ఆ కోటీశ్వరుడు 'స్వామీ! ఈనాటి ఆహారము మాకు ప్రసాదింపుము' అను వాక్యమును ఉచ్చరింపవలసివచ్చినప్పుడు నొక్కి వక్కాణించును. బైబిలులో పేదవారి ధన్యజీవనమును ప్రస్తరించు ఘట్టములు ఆ కుబేరుని అభిమానఘట్టములు!



" మోమువంచిన నేమి మొలకనవ్వులకాంతి చెక్కుటద్దములపై జీఱువాఱెఁ
జూడకుండిన నేమి సొబగురెప్పలమించి తేటవాల్మెఱుఁగులు దిచ్చరించె "

—చిత్రకారుడు : పి. వి. రామారావు.

# విడ్డూరములు

### ౧. ఇద్దరుభర్తలు : ఇరువదిఇద్దరు మగపిల్లలు.

క్రాయిడన్ నందలి లాన్సింగురోడ్డునందు ఒక వృద్ధస్త్రీ నివసించుచున్నది. ఆమెనామము సాలీ హార్ట్ ఫీల్డు. ఆమెవయస్సు ఇపుడు దాదాపు ఎనుబది వత్సరములు. ఆమె ఒకరితరువాత నొకరిని ఇరువురు భర్తలను పెండ్లాడి ఇపుడు వితంతువైయున్నది. మొదటిభర్త నటకుడు ఆతనివలన ఆమె పదముగ్గురు మగపిల్లలను కనెను. రెండవభర్త కసాయివాడు. ఆతనివలన ఆమె తొమ్మండుగురు తనయులను గాంచెను. ఈరెండవభర్త పదిసంవత్సరముల క్రితము మరణించెను. ఇరువది ఇద్దరు మగపిల్లలలో పదిమంది యుద్ధసేవలో పరమపదించిరి; ముగ్గురు అకస్మాత్తుగ కలిగిన ప్రమాదములచే మరణించిరి; మిగిలినవారు మామూలుగ చనిపోయిరి. ఇప్పుడు ఆమెకు నా అన్నవాడెవడును సజీవుడైలేడు. ఆమె పొట్టిగా సన్నముగానుండును; బుద్ధి శ్రవణము మొదలగువానియందు ఇంకను వృద్ధాప్యచిహ్నములు కలుగలేదు. ఆమె ఇపుడు మునిసిపలితవారి విరతివేతనమును పొందుచున్నది. ఆమెతల్లికి వరుసగా మూడుసారులు కవలలు పుట్టిరి. తల్లికిపుట్టిన పదిమంది బిడ్డలలో ఆమె పెద్దది.

### ౧. పాలబుడ్డికంటె పొగచుట్టను హెచ్చుగ ప్రేమించు బిడ్డ.

చికాగోలో డార్విన్ షాపిరో అను పదునెనిమిది మాసముల మగపిల్లడుగలడు. ఆతడొకసారి పొగచుట్టను రుచిచూచెను. అప్పటినుండియు పాలబుడ్డికంటె పొగచుట్టే ఆతనికి విశేషప్రేమపాత్రమయ్యెను. అప్పటినుండియు దినదినము చుట్టదమ్ము దొరకినగాని ఆబిడ్డ గగ్గోలుపెట్టును. ఇప్పటి కాతనికి రెండుఏండ్లు. శాస్త్రవేత్తలును, వైద్యులును ఈ విచిత్రస్వభావమునకు చాల ఆశ్చర్యపడుచున్నారు.

### ౧. తేనెపట్టులోని ఈగలను లెక్కించు యంత్రము

న్యూయార్కునందలి వ్యవసాయశాఖవారు రేడియోవలన తేనెపట్టులోని ఈగలను లెక్కించు యంత్రమును కనుగొనియున్నారు. తేనెపట్టు ముఖభాగమున ఒక మైక్రొఫోను ఉంచబడును. ఈమైక్రోఫోను మీదుగా ఈగలు ప్రాకిపోవుచుండగా వానికాళ్ళు లెక్కగొను నొకయంత్రసాధనకు పనిచెప్పును.

### ౧. ముప్పదినాలుగు అంగుళముల మీసము

జపానుదేశపు వాయువిమానసంఘపు పూర్వపు టధ్యక్షుడగు జనరల్ నాగొకా మీసము కుదురునుండి కొసవఱకు ఇరువది అంగుళముల పొడవుండెను. లండను నుండి టోకియోకు గాలియోడలో ప్రయాణము సల్పినందులకు ఆమిహోజాన్సను కన్యను అభినందించుటకై ఆయన ఏర్పాటుచేసిన విందులో ఈపొడుగు మీసముతోడనే ముద్దుగొనెను. ప్రపంచమునందలిఅన్ని మీసములలోకిని ఇదియే పొడుగుపాటిదని అప్పుడు నమ్మబడెను. కాని లండనులోనున్న హిందూదేశపు విలేఖరి వ్రాతలవలన ప్రపంచమున కంతటికిని పొడుగు మీసముగలకీర్తి జపానునుండి హిందూదేశము లాగుకొనుచున్నది. లాహోరునందలి భూగోళశాఖలోని ఆంజనేయాలయమున పనికికుదిరియున్న దేశ్వార్ అను హవల్దారుని గొయ్యమీసము ముప్పదినాలుగు అంగుళముల నిడివిగలదైయున్నది. ప్రపంచమున కంతటికిని ఎత్తయిన ఎవరస్టుశిఖరము ఉండుటతోబాటు పొడుగయిన మీసముకూడ ఉండుటవలన మన హిందూదేశపు కీర్తి ఇనుమడించుచున్నది. మన ఎవరెస్టు శిఖరమును ఎక్క ప్రయత్నించుచును, ఇచటి పొడుగుపాటి మీసమును గూర్చి లోకమువారికి తెలుపుచును మనప్రభువులగు ఆంగ్లేయులు హిందూదేశపుకీర్తినింపా పెందించుచున్నారు.

### §. కలపనుండి కలకండ చేయబడుట

డాక్టరు ఫ్రీడ్రిచ్ బెర్జియస్ – జర్మనీదేశపు రసాయనికశాస్త్రవేత్త - కలపనుండి కలకండచేయుటను కనుగొనియున్నాడు. కెమికల్ ఇంజినీర్ల సంఘసమితిమున ఈ తయారుచేయు విధానమును చూపియున్నాడు. ఈవిధానముచే కఱ్ఱనుండి చెఱుకునుండికంటె చవుకగ పంచదారచేయవచ్చును. కలప విస్తరించియుండు దేశములకు ఇది గొప్పలాభమును కలిగించును. రాతిబొగ్గునుండి పెట్రోలుచేయనగుటను, నత్తగుల్లలనుండి తైలము తీయనగుటను కనుగొనిన ఈ విచిత్రప్రపంచము కఱ్ఱనుండి పంచదారతీయుటలో ఆశ్చర్యమేమి? ఈ విధానము విశేషప్రచారమునందినచో కలపవర్తకులందరును కలకండవర్తకులు కాగలరు.

### §. బ్రిటిష్ సామ్రాజ్యములోకెల్ల పెద్ద గడియారము

లండనునందలి ట్రెఫాల్గర్ స్క్వేర్ లోని బ్రహ్మాండభవనమున నొక పెద్ద గడియారము నిర్మింపబడినది. బ్రిటిష్ సామ్రాజ్యమునకంతటికిని ఇది పెద్ద గడియారమని చెప్పబడుచున్నది. దీనిముఖవైశాల్యము 759 చతురపుటడుగులు ఇంతకుముందు ప్రపంచములోని గడియారములకెల్ల పెద్దదిగా భావింపబడుచున్న బిగ్ బెన్ ముఖవైశాల్యము 400 చతురపుటడుగులుమాత్రమే. ఈ పెద్ద గడియారమున నిముసములుచూపుముల్లు ఒక బారు దూలమనియే చెప్పదగియున్నది. అది 17 అడుగుల పొడుగుగలదై యున్నది. ఈ గడియారము యంత్రసాహాయ్యమున రాత్రిళ్ళుకూడ గంటలను చాలదూరమువఱకు చూపగలిగియున్నది. ఈ గడియారమునందలి పెద్ద అక్షరము 8 అడుగుల 9 అంగుళములు; మిక్కిలి చిన్న అక్షరము 2 అడుగుల 6 అంగుళములు. దీనికి సంబంధించి దాదాపు నూరుమైళ్ళ నిడివిగల ఎలక్ట్రిక్ తీగలుగలవు. సదా గ్రీన్‌విచ్ టైముతో సరిపోవునట్లు ఈ గడియారము తిరుగుచుండును. ఈ గడియారము చేయుటలో 14 టన్నులఉక్కు ఉపయోగింపబడెను. విద్యుచ్ఛక్తిచే నడుపబడుచుండుటచే దీనికి ఎప్పుడును కీ ఈయనక్కఱలేదు. లండను మహానగరమునందలి వ్యక్తులు తమ గడియారములను దీనిని చూచి దిద్దుకొనుచుందురు.

### §. మోటారుప్రమాదములు: వాని ఖర్చు

జోశువా బ్రూక్సు అనునతడు ఫాక్ట్సు అండ్ ఫాలసీస్ అను తన పుస్తకములో నిట్లు వ్రాయుచున్నాడు: “మోటారులు ప్రచారములోనికి వచ్చినప్పటినుండియు రోడ్డు ప్రమాదముల సంఖ్య హెచ్చుపెరుగుచున్నది. ఒక్క బ్రిటను దేశమునందే మోటారులవలన దినమునకు పదునార్గురు పాదచారులు చనిపోవుచున్నారు. 1925 లో అమెరికాదేశమున మోటారులవలన 27,000 లకు ఎక్కుడుగనే మనుష్యులు చచ్చిరి. మోటారు ప్రమాదములవలన వికలాంగులైనవారు మొదలగు వారి ఔషధపరిచర్యకు ప్రపంచమునందలి వివిధదేశములలోని ఆసుపత్రులన్నియు కలిసి సంవత్సరమునకు 250,000 పౌనులను వెచ్చించుచున్నవి.

### §. మందముగ కొట్టుకొను గుండెకాయ

మామూలుగ ఉన్నప్పుడు మనగుండెపై చేయివైచుకొని చూచితిమేని నిముసమునకు అది డెబ్బదిరెండుసారులు కొట్టుకొనుచుండుటను తెలిసికొనగలము. దేహపరిశ్రమచేయునపుడుగాని, ఇతరమైన ఉద్రేకమును పొందినపుడుగాని మనగుండె ఇంతకంటె చుఱుకుగా కొట్టుకొనును. నిముసమునకు ఇరువదిసారులుమాత్రమే కొట్టుకొను మిక్కిలి మందమగు గుండెకాయ ఒకనికుండుట ఈనడుమ కనుగొనబడినది యుద్ధభటుడుగానుండి ఇపుడు విశ్రాంతిగొనుచున్న రాయిగ్లిన్ అనునతడు ఈ నడుమ ఆస్ట్రేలియాఖండమునందలి రాండ్విక్‌లోని ఆసుపత్రికివచ్చెను. పరీక్షింపగా ఆతనిగుండె మూడు సెకండులకు ఒకసారి మిక్కిలి మందముగ కొట్టుకొనుచుండుట కనుగొనబడెను.

### §. మూడుగంటలు ఒక ముద్దు

దీర్ఘకాలము నిలిచియుండు ముద్దుకు న్యూయార్కులో పోటీబహుమానముపెట్టిరి. బెట్టీబరస్సు అను నామెయు, మైకేల్ కాల్ బ్రీస్ అను పురుషుడును 3 గంటల 2 నిముసముల ముద్దుముద్రలోనుండి బహుమానము బడసిరి.

—ఆ. వెం. శాస్త్రి.

## విధి




—చిత్రకారిణి: శ్రీమతి దామెర్ల సత్యవాణి, రామారావు ఆర్టుసొసైటి.

తెలుఁగు దేశాన మొలచిన తెల్లప్రత్తి
తెలుఁగు కన్నియ వడికెను జిలుఁగు గాఁగ
నేసె మన తెల్గుదేశంపు నేఁతకాఁడు
అభిమతము నీకుఁ గాదొకో యాంధ్రపుత్ర!
క్షాత్రరక్తంబు తొలుదల్త జాలువార
పరమపావనమైన భూభాగమందుఁ
బూర్వులయశస్సులకుఁ దీసిపోని ప్రత్తి
మొలచె నది నీకు దగదొకో తెలుఁగుబంట!
దీర్ఘశుష్కోపవాసబంధితులు, తెలుఁగు
నేతకాండ్రొందు దురవస్థ జూతువేని

కలికయిన నేమి దేశీయకల్పితంబు
వడుకునూల్బట్ట చేఁజేత విడువఁగలవె!
అక్కచెల్లెండ్రె వడకువా రన్నదమ్ము
లే సొబఁగు నేఁతకాండ్రు నీదాసజనమె
ఫల మనుభవించువారలీ తెలుఁగ వల్వ
ననుమతింపుమి మైదాల్చ నాంధ్రతనయ!
భరతవర్ష దరిద్రజీవనము బాప
నిదియ; కర్తవ్యమని యెలుఁగెత్తి పలికె
బ్రహ్మతేజస్వి భారతబాంధవుండు
అతని యానతి తలఁదాల్పు డాంధ్రులార!

—శ్రీ శేషాద్రిరమణకవులు.




# ఛాయామూర్తి ప్రతీకారము

౧

గదిలోవున్న మేజాబల్లపై పెట్టిన లాంతరు ప్రకాశమానంగా వెలుగుతోంది. గోడలపై తగిల్చిన చిత్రపటాలు, చైనా మేపులు, లీల కుట్టినపూలుపటాలు మిలమిలా మెఱయుచున్నవి. ఒక్క గడియారము చేస్తోవున్న సవ్వడితప్ప అంతా ప్రశాంతమయం.

ఆ గదిలోవున్న పేముకుర్చీలో నిశ్చలంగా కూచుంది లీలాదేవి. ఎదురుగుండా బల్లకానుకుని లీలాదేవి విలోల నీరజనేత్రాలలోకి చూస్తోనుంచున్నాడు వెంకట్రావు.

లీల నీరవయై యోచనాముద్రలో మునిగిపోయింది. ఏ భావతరంగమో నైశ్చల్యత సడల్చింది, లలితగాత్రం చిరుగాలికిమల్లే కంపించుట మొదలుపెట్టింది. సుందర సమున్నతవక్షం సముద్రతరంగంవలె లేస్తో పడుతోంది అప్పుడు వెంకట్రావు లీలా, ఏమంటావు త్వరగా చెప్పు మరీ, అన్నాడు; దానికి లీలాదేవి సమాధానం చెప్పలేక వెక్కి వెక్కి ఏడువనారంభించింది. ఎగుపులువచ్చాయి. ఆమె హృదయంలో పెద్దతుపాను రేగింది.

తత్క్షణం వెంకట్రావు ఆమెను దగ్గరకు లాక్కొని గట్టిగా తనవక్షాని కదుముకొని ఆమెకళ్ళమీద, కపోలములమీద, ముద్దుమొగముమీద చుంబించి నీలాలక సముదాయము సరిచేస్తో 'ఛా! ఏమిటి లీలా! యీవెత్తి నీకు,' అన్నాడు.

లీలాదేవి

(కన్నీరు తుడుచుకొంటూ) ఎల్లారాను నీతోటి నన్నే ఆధారంగా పెట్టుకొని జీవిస్తోవున్న తండ్రిగార్ని వదిలేసి, తల్లిపోయినదుఃఖం అసలే ఎఱగను, నాభర్త ప్రాజ్ఞత రానప్పుడే పోయాడు కనుక ఆబాధ అసలే లేదు, కాని? ఈయన్ని - మానాన్నే - ఏలా విడవను, ఆ మాటతలచుకొంటేనే ఏడుపొస్తోంది, ఎల్లా-

వెంకట్రావు

లీలా! ఏమిటావెఱ్ఱి, నిన్న ఆయనమాటలు విన్నావు కాదూ. నన్ని గుమ్మంలోకి రావద్దన్నాడా? నిన్నువిడిచి నేను బతగ్గలనా? తప్పదు లీలా! నువ్వు నాతో రాక తప్పదు. నేనే భర్తనైతే వస్తావా రావామరీ. అప్పుడు మీనాన్నమాట వింటావా?

లీలాదేవి

వస్తే నన్నుతప్పకుండా వితంతువివాహం చేసికొంటావా?

వెంకట్రావు

ఆ? తప్పకుండా!

లీలాదేవి

అల్లా అని చేతిలో చేయివెయ్యి.

వెంకట్రావు 'ఇదిగో దైవంతోడు,' అని చేతిలో చేయివేసి 'ఇంక రామరి తెల్లారుతోంది' అని ఆమె చేయి పట్టుకొని తీసికొని పోవనారంభించాడు. ఇద్దరు వడివడిగా చీకటిలో లీనంఅయ్యారు.

౨

రామనాథం లీలాదేవితండ్రి. ఆయన కిప్పుడు స్పృహలేదు. సన్నిపాతజ్వరం, అపస్మారం ఎక్కువగా వుంది. కంఠంలో శ్లేష్మం, కళ్ళలో యెఱుపు, సర్వాంగాల్లో శైత్యం వచ్చినవి.

వైద్యుడు వచ్చిచూచి 'నాడీ స్థానం తప్పింది. ఆశలేదనిచెప్పి వెళ్ళిపోయాడు. విశ్వాసపాత్రుడు ఒక్క నౌఖరుమాత్రమే అక్కడవున్నాడు.

పాపం రామనాథానికి కూతురుసంగతి తెలిసాక ఆ మరునాడునుంచి మతిపోయింది, నిద్రచెడింది, ఆహారం లేదు, జ్వరంపట్టుకుంది, చూచేవాళ్ళు లేరు, చివరకి విషమించింది.

అచుట్టుప్రక్కలవాళ్ళంతా జాలిపడి ప్రతిరోజూ వచ్చి చూచిపోయేవాళ్ళు వైద్యుణ్ణి నియమించారు.అవసానదశకి నౌఖరే గతయ్యాడు. భార్యాపుత్రులు మునుపే లేరు. నమ్మి,డబ్బిచ్చి, చదువు చెప్పించి ఆశ్రయమిచ్చినందుకు దూరపుబంధువుడైన వెంకట్రావు ఇల్లా చేసాడు. కన్నకూతురే మోసగించింది.

సాయంకాల మవుసరికి రామనాథానికి శ్లేష్మం తీవ్రంగా లేచింది, దోరాటన. కళ్ళకిమూతలేదు. పైచూపే. మధ్యమధ్య 'లీలా, వెంకట్రావూ' అని భయంకరమైన కేకలు: చుట్టుప్రక్కల వాళ్ళంతా చేరారు. నాభివఱకూ శరీరం కట్టై అయిపోయింది

సమానవాయువు పెద్దశ్వాసతో లేచింది, తల గిరగిర తిరిగిపోయింది. వెంకట్రావుఅని భూలోకంలోంచి పరలోకందాక చొచ్చుకుపోయే ఒక్క పెద్ద వికృతరావంతో ముసలివాడిహంస యెగిరిపోయింది.

౩

అలసవిలాససుందరవదనంతో లీల కూచుంది. ఆమె పాండురముఖంలో స్త్రీజీవనంలో మార్పుదళ సూచించే మార్పురేఖలు కనపడుతూన్నవి. కాని, అవి విషాద మేఘచ్ఛాయలలో అంతర్హితములైన శశిరేఖాసమూహాలు.

అంతలో వెంకట్రావు అక్కడికివచ్చాడు. ఆతన్ని చూచి లీల మౌనంగా సమీపించింది, అప్పుడు

వెంకట్రావు

ఏమి లీలా! అల్లావున్నావు?

లీలాదేవి

మీ రిల్లా కాలయాపన చేయడం నాకు చాలా అనుమానంగావుంది. నాతండ్రికి దూరంచేసి యింతదూరం తీసికొనివచ్చారు. నన్ను వివాహంచేసికొంటానని నమ్మించి ఎన్నిసార్లు చెప్పినా ఆమాటకి తగిన సమాధానం చెప్పరు. ఇది బాగాలేదు. మీరేదోవకటి యీ వేళ తేల్చివేయాలి. ఇప్పుడు నేను పట్టిమనిషినికాను.

వెంకట్రావు

ఓహో, అల్లాగా (అని నవ్వుకొన్నాడు.)

లీలాదేవి (కోపంతో)

నా కీవెకిలినవ్వుతో పనిలేదు. ఇంక మోసము పనికిరాదు, నిష్కర్షగా చెప్పండి.

వెంకట్రావు

లీలా! నా కిదివరకే వివాహం అయిపోయింది.అపిల్ల కొలదిరోజులలోనే కాపరానికి వస్తుంది. నీవు నా ప్రణయినివి. నీవుకూడా ఆపాడువివాహబంధంలో తగులుకొనడం మంచిదికాదు, లీలా!

లీలాదేవి (కోపోద్రేకంతో)

ఛీ దొంగా? నన్నింత ద్రోహంచేసావు. ఇహపరాలు రెంటికిచెడగొట్టావే? నన్నేవూతకఱ్ఱగా నమ్మిన వృద్ధుని విడచివచ్చానే?

వెంకట్రావు

పోనీ మరలపోరాదా? ఆయన దగ్గరికి.

లీలాదేవి (కన్నీళ్ళతో)

ఓ మూర్ఖుడా! నిన్నునమ్మి ప్రేమించుటచేత యింత పని జరిగింది. నిన్ను స్వేచ్ఛగా పునర్వివాహం గావించుకొని తర్వాత తండ్రిగారిని కలిసికొని క్షమాభిక్ష వేడుకొందామనుకొన్నాను. దీనికి తగినఫల మాపరలోకంలో అనుభవిస్తావు. నా తండ్రి గతించినట్లుగా నాకు

తోస్తోంది. ఒక్కసారి ఆయన కాళ్ళమీదపడి యీ పాపశంకిల దేహం విడుస్తా.'

ఇట్లని ఆమె విసవిస నడచిపోయింది.

౪

రాత్రి రెండవయామము జరుగుతోంది. వెంకట్రావు పరున్న దోమతెఱమంచ మల్లలాడిపోయింది. అతడు మెలకువవచ్చి కనులు తెఱచిచూచాడు.

ఎదురుగుండా నిలబడ్డాడు రామనాథము. నేత్ర గోళాలు అగ్నిజ్వాలలు కురుస్తున్నాయి, పాపం వెంకట్రావు స్థంభించిపోయాడు.

అప్పుడాముసలి రామనాథము తలవూపుచు 'ఓరి పశువా? స్వామిద్రోహి, నేను చనిపోయి యిప్పుడు ఛాయామూర్తినై వచ్చాను నీమీద పగతీర్చుకోడానికి, రేపుసాయంకాలము సరిగా ఆరుగంటలకి నిన్ను చంపుకుపోతాను జాగ్రత్త.'

వెంకటరావు భయప్రచలితగాత్రుడైపోయాడు నోటమాటవచ్చుటలేదు. అప్పుడాఛాయామూర్తి, మరల తల భయావహంగా వూపుచూ 'రేపే నాలుగైయ్యేటప్పటికే నీకు కలరా ప్రారంభిస్తుంది, చూచుకో'అని చెప్పి, మాయమయిపోయింది.

అట్టి విచిత్రసంఘట్టన మెప్పుడూ చూడలేదు వెంకటరావు. కలా కాదు.తను కన్నులారా చూచాడు. తెల్లవాఱగానే ముసలివాని మరణవార్త టెలిగ్రాముద్వారా ముందు స్థిరపర్చుకోవా లనుకొన్నాడు.

౫

అప్పటికి తెల్లవాఱి పదిగంటలైనది. చక్కని ప్రశాంతసూర్యకిరణ సుశోభితమైన ఉదయకాలం, పిల్లతెమ్మెరవీచుతోంది.

వెంకట్రావుకళ్ళు గుంటలుపట్టాయి, ముఖం తేజోవిహీనమైవుంది. ముసలి రామనాథంపోయినమాట నిజమని ధ్రువపర్చేరిప్లయిపెయిడు టెలిగ్రామువచ్చింది.

సరిగా ఆసమయమున కావూరిలోవున్న ఒక స్నేహితుడు రంగారావను మిత్రుడక్కడికి వచ్చాడు. అతడు బహుద్రష్ట, తియాసఫీకి చెందినవాడు.

వానితో వెంకట్రావు రాత్రిజరిగినదంతాచెప్పి 'మీరు పిశాచములుంటవని నమ్ముతారా?' అని దీనంగా అడిగాడు. దానికి,

రంగారావు

నేను నమ్ముతాను హిందువుల పురాణేతిహాసాలు శాస్త్రాలూ యీవిషయం యిదివఱకే స్థిరపర్చాయి. ఇప్పుడు పాశ్చాత్యతత్వవేత్తలంతా యీవిషయాన్ని నిరూపించి వప్పుకుంటున్నారు.

వెంకట్రావు

అది వట్టిపిచ్చిభ్రమ, ఈప్రాణిపోగానే యీశరీరం మట్టిలో కలిసిపోతోంది. ప్రాణం వాయురూపంగా పోయి గాలిలో కలిసి పోతోంది. ఇంక మిగిలేదేమివుంది?

రంగారావు

అల్లాకాదు యీప్రపంచమంతా శక్తిమయం. ఆచైతన్యం స్థావరజంగమంగావుంది అదే భగవంతుని మహిమ. ఒకేసముద్రము అనేకఅలలు వేస్తున్నరీతిగా, విశ్వాత్మే వివిధాత్మలుగా కనపడుతోంది. జీవముక్రింద నుంచి క్రమసాగవచ్చి మానవుడిలో ప్రత్యేకత్వంపొందుతోంది. నిత్యుడైన ఆ జీవుడే మలినవస్త్రం విడిచినట్లు యీబొంది వదిలేసి పైకిపోతుంది.

వెంకట్రావు

అంటే పరలోకంవుందనా? నే నమ్మను. పిశాచాలు ఎల్లావచ్చాయి?

రంగారావు

విను మరి,పైకిపోయిన యీజీవుడు సూక్ష్మదేహంతో పైలోకంలోవుంటాడు, జ్ఞానిఅయిన జీవుడైతే ఏమమకారాలు లేక స్వర్గానికెళ్ళి దేవత్వంపొందుతాడు, లేకపోతే సూక్ష్మశరీరధారియై పరిచితస్థలాలు వదలకుండా తిరుగుతో కాంక్షలకులోనైవుంటాడు అవే పిశాచాలు. అవి యీకంటితో కనిపెట్టలేము.

వెంకట్రావు (సంశయంలో)

ఛా! నే నమ్మనోయి!

రంగారావు

చచ్చినట్టు నమ్ముతావు. నీలెక్కేమిటి? యిక శెలవు. పనివుంది.

## ౬

లీలాదేవి స్వగృహము చేరుకొన్నది. తండ్రిలేని ఆ శూన్యగృహము పాడుగావున్నది. ప్రజలకంట పడ చాల కందే తలదాచుకుంటోంది.

అది సాయంతనసమయం, స్వదేశమాతకి నిజరక్తం ధారపోసి స్వగాత్రంకానుకగా సమర్పించెడు భారత వీరునివలె లోకబాంధవు డస్తంగతుడయ్యాడు, మఱపున పడిపోయే, గత వృత్తాంతంవలె, సంధ్యారాగంకూడా చీకటిలో లీనం అవుతోంది.

ధ్యానమగ్నమానసయై లీల కూచుంది. ఆమె విలాసలాలసదేహం యిప్పుడు బూడిదరేగింది. ఆకాటుకకళ్ళలోని తళతళా, ఆపచ్చని గుండ్రనివంపులుతీరిన, నిమ్నోన్నతసుందరశరీరనిర్మాణంలోనిలావణ్యం అంతరించిపోయాయి ఇప్పుడామె ఒక జీర్ణశిథిలగాత్రి.

అంతలో ద్వారం చెంత నెదో టక్కు టిక్కుమని ధ్వని వినవచ్చింది. మొట్టమొదట లీలాదేవి పాటింపలేదు. ఆ ధ్వని మరలమరల వినవచ్చుటచే విసుగెత్తి తలుపు తెఱచి వైచినది. తక్షణం వెంకట్రావు లోనికి ప్రవేశించాడు శరీరం తూలిపోతోంది, మనిషి వట్టి అస్థిపంజరం. కళ్ళు చాలా లోతుకిదించుకుపోయాయి. ఆయాకృతి చూచేసరికే లీల భయవిహ్వల అయింది.

అప్పుడు వెంకట్రావు 'లీలా! నేను కలరాజాడ్యంవల్ల మరణించినాను. దానికి నీ తండ్రిగారి ఛాయామూర్తియే కారణం. నీకు నేను చాలా అపకారంచేసాను. నేను చేసినతప్పు క్షమించాలి. పరలోకంలేదనీ, భగవంతుడు లేడనీ సంచరించాను. నీవు ఆత్మహత్యచేసికోవాలని అప్పుడప్పుడు తలపోస్తున్నావు. అది చాలాతప్పు. కర్మ అనుభవించితీరాలి. నీ విప్పుడు గర్భిణివి. ఆత్మహత్య చేసికొనుటవల్ల మరల పాపము మూటకట్టుకొనెదవు.

లీలాదేవి దిగ్భ్రమచెంది వెలవెలపడిపోయి చూస్తూ ఆలకిస్తోంది. మరల వెంకట్రావు ఛాయామూర్తి చెపుతోంది మాకు మనుష్యలోకం విడువగానే అద్భుతశక్తులు కలుగుతాయి. భవిష్యత్తు చెప్తాను విను. నీకొక కుమారుడు పుడతాడు. వానికి నీ తండ్రిగారి పేరుపెట్టు. నేను నాలుగువేలరూపాయిలకి ఎండవమెంటు చేసాను. అది నీకు వచ్చునట్లుగా వ్రాసి మరీ మరణించాను. ఇవిగో కాగితాలు పట్టుకొచ్చి నీకిస్తున్నాను పుచ్చుకో' అని చేతి కిచ్చాడు.

లీలాదేవి అప్రయత్నంగా ఆకాగితాలు పుచ్చుకొనే టప్పుడు సుంచుకంటె చల్లనైన వానిచెయ్యి తగిలి శరీరం గజగజవణికి అచేతనయై పడిపోయింది.

మరల కొంతసేపటికి లీలాదేవికన్నులు విప్పేసరికి వెంకట్రావుఛాయామూర్తి మాయమైనది. అత డిచ్చిన ఎండవుమెంటు కాగితాలుమాత్రము మిగిలినవి.

అది కలగాదు, భ్రాంతికాదు, కాగితాలు ప్రబలనిదర్శనంగా వున్నవి. అందుచేత లీల అత్యాశ్చర్యంతో మునిగితేలుతూ పరమేశ్వరుని ప్రార్థించింది.

—పెమ్మరాజు రాజగోపాలము, బి.ఏ



శివరాత్రి : జంగముదేవర.

# భూకంపములు

జనవరి 15-వ తేదీ మధ్యాహ్నము 2-30 గంటల వేళకలిగిన భూకంపము హిందూ దేశమున ఒక శతాబ్దిలోపున సంభవించిన భూకంపములలో ప్రచండమైనది. ఈభూకంపము సంభవించినపుడు వైస్రాయి దంపతులు హౌరాస్టేషనులో నుండిరి. అపుడు వెల్లింగ్డనుప్రభువు ఇట్లు చెప్పెను: 'మదరాసును మేము తుపానులో వదలితిమి. కలకత్తాను భూకంపములో వీడుచున్నాము.' ఈ భూకంపము కొద్దిగనో గొప్పగనో హిందూదేశమునంతటిని కదలించినది. అటు లక్నోనుండి ఇటు కలకత్తావఱకును, అట డార్జిలింగునుండి ఇట కన్యాకుమారివఱకును కంపము కనిపించినది. ఉత్తరహిందూదేశమున దీనివలని నష్టము అపారముగనున్నది, ముజఫర్‌పూర్ శ్మశానవాటికయై వఱదలలో మునిగియున్నదని వాయువిమానముపై తిరిగి తెలిసికొన్నారు. పాట్నానగరము ధ్వంసమయ్యెను. జమాల్‌పూరుస్టేషను విరిగి రైలుబండి మీదపడెను. కాశీలో చీమలు, ఎలుకలు కూడ ఆసమయమున ఇండ్లువదలెను. కూచ్ బీహార్‌లో ధరాకంపమునకు ఏనుగు ఒకటి మతిచెడి ఇండ్లపైబడెను. ఆర్యావర్తమున కలిగిన నష్టమునకు అంతులేదు. మన ఆంధ్రదేశమునకూడ ఈ ధరాకంపము బాగుగా కానవచ్చినది. రేపల్లె చెఱువులోని నీళ్లు లాంతరు స్తంభము ఎత్తున లేచెను. బెజవాడ కోర్టునసబు ప్లీడర్లు తన్నుకదలించుచున్నారని భయపడెను. గోదావరికాలువలోని నీళ్లు వఱదరోజులలోవలె బురదలయ్యెను. కనుముపండుగ ఇట్లు భూకంపముతో కడచెను.

జపానువారికివలె మనకు భూకంపములతో ఎక్కువ పరిచయము లేదు. 1897 జూను 12-వ తేదీని అస్సాములోను; 1900 ఫిబ్రవరి 8-వ తేదీని కోయంబత్తూరుప్రాంతమునను; 1905 ఏప్రియలు 4-వ తేదీని కాంగ్రాలోయయందును గడచిన నలుబదివత్సరములలో హిందూదేశమున ధరాకంపములు సంభవించినవి. కాంగ్రాలోయయందు కంపము తెల్లవాఱకట్ల ప్రజలు జాగ్రతవస్థలో లేని సమయమున కలుగుటచే ఇరువదివేలకుపైగా జననష్టము కలిగెను. ఈధరాకంపములనుండి తప్పించుకొనుటకు మార్గమేమి అని భూగర్భశాస్త్రజ్ఞులను ప్రశ్నింపగా వెదురుగుడిసెలలో నివసించుటయే అని చెప్పుదురు. ధరాకంపములతో ప్రతిదిన పరిచయముగల జపానీయులు ఇందుచేతనే వెదురు ఇండ్లయందు నివసింతురు. మానవుడు తనప్రజ్ఞనుపయోగించి నిర్మించు బ్రహ్మాండభవనములు ఈ కంపములధాటికి ఆగజాలవు.

అయితే ఈకంపములు ఎందుకు కలుగును? జనవరి కంపము సప్తగ్రహకూటము వలననే కలిగినదని పలువురి నమ్మకమైనట్లు పత్రికలలోని వ్రాతలవలన స్పష్టమగుచున్నది. పురాణములలో భూకంపకారణము వేఱుగ వివరింపబడినది. దేవతలకోటయగు ఆకాశము గాలిమీద, ఆగాలి భూమిమీద, ఆధరణి సముద్రములమీద నిలిచియున్నది. ఆసముద్రములను ఒకపెద్దతాబేలు మోయుచున్నది. ఆతాబేటిని వాసుకి అను మహానాగము తన సహస్రశీర్షములలో నొకదానిపై నిలుపుకొనుచున్నది. భారము ఎక్కువైనపుడు దానిని ఒకతలనుండి మఱియొకతలకు

మార్చుకొనును. ఆ మార్చుకొనుటలో ధరణికి కంపముకలుగును.

భూగర్భశాస్త్రజ్ఞులు దీనికి అంగీకరింపరు. వారి అభిప్రాయమున భూకంపములకును అగ్నిపర్వతములకును సన్నిహిత సంబంధము కలదు. తనచుట్టు తానుతిరుగుట, సూర్యుని చుట్టు తిరుగుట అనుచలనములకుతోడు భూమికి నుఱియొకవిధమైన చలనముగలదు. ఈ చలనము కొన్నికొన్ని ప్రదేశములందుమాత్రమే యుండును. ఈ చలనమును చెట్లు చేమలు మొదలగునవి కదులుటచే కంటితోడను; నేలలో గలుగు ధ్వనిచే చెవివలనను పోల్చుకొనవచ్చును. దీనినే భూకంపమందురు. అగ్నిపర్వతముల విజృంభణావసరమున ధరాకంపములు సంభవించును.


నేలమీదిభాగము చల్లబడి లోనికిదించుకుపోవుటవలనను, ధరణీగర్భమున నీటియావిరి విశేషముగాబుట్టి విస్తరించి వ్యాపించుటవలనను ధరణియందు చలనముజనించి అది యొక అలవలె వ్యాపించును. ఇదియే ధరాకంపము. ఇట్లు సంకోచవ్యాకోచములు రెండును ధరాకంపమునకు కారణములే. కొన్ని కంపములు తేలికగ తేలిపోవును. ఇట్టివి ఈ విశాలవిశ్వమునందు ఏదో యొకమూల దినదినమును కలుగుచునేయుండును. కొన్ని భూకంపములు ప్రచండములై యుండును. ఇవి సాధారణముగ అగ్నిపర్వతప్రాంతములందుమాత్రమే కలుగుచుండును.

జపానునందు, ఆసియామైనరునందు, దక్షిణ అమెరికాపశ్చిమతీరమునందు, మెడిటరేనియన్ సముద్రపు ఉత్తరతీరమునందు తఱుచు భూకంపములు కలుగుచుండుటను భూగోళశాస్త్రము చెప్పుచున్నది. భూకంపములవలన కొన్నితావులయందు కొండలు ఎత్తుఅగును; కొన్నితావులయందు వానికి స్థానచ్యుతికలుగును; బ్రహ్మాండభవనములు నేలమట్టమగును; నేలపగిలి నూతులు ఏర్పడును; ఇసుకమేటలు వేయును; నదులు సన్నగిల్లును; రైలుపట్టాలు కొంకరులువోవును; వంతెనలు క్రుంగిపోవును. చెట్లు భూమిలో దించుకుపోవును. తుదకు గడియారముల పెండ్యులమ్ చలనముకూడ అరికట్టబడును.

శాస్త్రవిజ్ఞానము విచిత్రపరిణామమునందిన ఈ దినములలోకూడ మానవుడు భూకంపములను అరికట్టలేకపోవుచున్నాడు. పంచభూతములను లోగొంటినను ఆతనిప్రజ్ఞ ఉత్తరకుమారప్రజ్ఞయే యైనది. భూకంపములు ఇన్నిమైళ్ళలో కలిగినవి అని రికార్డు చేయుటకుమాత్ర ముపయోగించు సీస్‌మొగ్రాఫ్ అను యంత్రము నొకదానినిమాత్రము మానవుడు కనుగొనియున్నాడు. పోర్చుగిల్ దేశపు రాజధానినగరమగు లిజ్బన్‌నగరము 1775 లో భూకంపముచే సర్వనాశనమైనది. 1775 నుండి నేటికి శాస్త్రమెన్నియో మడుంగుల అభివృద్ధినిగాంచినది. కాని ఆనాడు లిజ్బన్‌లో జరిగిన సర్వనాశనమువంటిదే నేడుపాట్నా, ముజఫర్‌పూర్ మున్నగుతావులయందును జరిగినది. 1775 లో కంటె నేడు వాయువిమానము లొకటి యొక్కుడైన కతనమున మానవుడు పైకి ఎగిరి కలిగిన నష్టమును అవలోకించి ఆవార్తను లోకమువారికి త్వరగ అందింపగలిగినాడు.

లండనునందలి భూగర్భశాస్త్రజ్ఞుడు షాగారు ఈ ధరాకంపమునుగూర్చి ఇట్లు ప్రచురించినారు: "నాయంత్రము గంటను ప్రమోగించి ఈధరాకంపమును రికార్డుచేసెను. అది ఒకగంట కాలముండెను. లండను మహానగరమునకు అది 4600 మైళ్ళదూరమున సంభవించెనని సూచించెను."

—ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.




# రాజపాళెయమందలి ఆంధ్రక్షత్రియులు

## (తమిళదేశమందలి రామనాథపురం జిల్లా, రాజపాళెయ మందలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

విద్యావిషయములందుగూడ మాపూర్వులు విశేషమైన శ్రద్ధవహించియుండిరి. ఆంధ్రదేశమునకు వందలమైళ్ళదూరమున నున్నను యాంధ్రవాణిని తమగృహములందు బ్రతిష్ఠించుకొని పూజలు సల్పియుండిరి. వారు రచించిన యాంధ్రగ్రంథముల నిచట దెలుపుటకు సంతసమగుచున్నది.

శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల కృష్ణమరాజుగారు **(1)** దశావతారచరిత్ర యను పదియాశ్వాసముల పద్యకావ్యమును ; **(2)** సీతాకల్యాణమను యక్షగానమును—శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల కుమార పెద్దిరాజుగారు (3) సావిత్రీయక్షగానమును—శ్రీమన్మహామండలేశ్వర గొట్టిముక్కల సింగరాజుగారు (4) పారిజాతాపహరణమను యక్షగానమును—రచించియుండిరి.

దేవగురుబ్రాహ్మణభక్తిగలిగి వినయ సౌశీల్యాది సద్గుణములతో అసామాన్యమగు దేహపటుత్వముతో సుఖముగ కాలము గడుపుచుండిన క్షత్రియసంఘము నేడెట్లున్నదో తెలుపుకొందును.

### విద్య

మా గ్రామమున నొక బోర్డుహైస్కూలు, ఒక మాధ్యమిక పాఠశాల, ముప్పది ప్రాథమికపాఠశాలలును పనిజేయుచున్నవి. ఇందులో మాధ్యమిక పాఠశాలయు, నాలుగైదు ప్రాథమిక పాఠశాలలును రాజులచే నడిపింపబడుచు క్షత్రియబాలురతో నిండియున్నవి. మొత్తముమీద సుమారొకవెయ్యివిద్యార్థులు మాత్రమే మాసంఘమునకు జెందియున్నారు. పాశ్చాత్యులకన్న భారతీయులం దెవిధమున నిరక్షరత వ్యాపించియున్నదో ఆదేవిధమున మారాజులుకూడ విద్యావిషయములందు వెనుకబడియున్నారు. చేవ్రాలుచేయ దెలియనివారు లెక్కకుమించి యున్నారు. వ్రాయ జదువ నేర్వనందున ఇంటివ్యవహారములందు వా రనుభవించు కష్టములు, పొందు అమర్యాదలు చెప్ప నలవిగాదు. నిరక్షరత వ్యాపించియున్న సంఘము, ప్రస్తుతయుగమునందు ముందున కడుగిడలేక, తెలివితేటలతో మెలగుట కవకాశములేక నాగరిక ప్రపంచమునకు దూరమైపోవును. మనపూర్వుల యభిప్రాయములో విద్యయన అక్షరజ్ఞానముమాత్రము కాదని చెప్పవచ్చును. అక్షరముల స్వరూపముతో పనిలేకనే మనపూర్వులు వేదపురాణాది సమస్తవిద్యలను సాధించియుండిరి. వట్టి అక్షరజ్ఞానమున కంతప్రాముఖ్యతలేదు. కాని ఆకాలము, ఆ ఉద్దేశ్యములు ఆపరిస్థితులు మారినందున ప్రతికులమునందును నూటికి నూరుగురు వ్రాయ జదువ నేర్చియుండుటయే అవసరముగా గన్పట్టుచున్నది. ఐనను, వట్టి పుస్తకముల జదువు చదివి, పరీక్షలనిచ్చియు సాహసించి ఒకకార్యమైనను చేయలేక, కాయకష్టములుచేసి జీవించుశక్తిలేక, సంసారమందలి దుఃఖములనోర్పుతో నెదుర్కొనలేక, సంతోష మననెట్టిదియో యెఱుగక, జీవచ్ఛవములవలెనుండు ఇక్కాలపు విద్యార్థులను మన సంఘమువా రనుసరింపబనిలేదు. ఇంగ్లీషువిద్య వ్యాపించి చాలకాలమైనను మా రాజపాళెపుక్షత్రియులలో నుండి ఇంతవఱకు ఐదారుగురు బియ్యేలు మాత్రమే వెలసియున్నారు. ఇంక కొందరు వెలయ సిద్ధముగ

నున్నారు, పలువురు మెట్రిక్యులేట్లును తయారై యుండిరి. ఇట్టి స్వల్పసంఖ్యనుజూచి వగవ బనిలేదని మా తలంపు. రాజపాళెయపురాజులు వ్యవసాయముజేసి బ్రతుకవలసినవారగుటచేతనే వారిలో ఉన్నతవిద్య నభ్యసించువారుగాని ప్రభుత్వోద్యోగములకై పరితపించువారుగాని లేకున్నారు. దీనినిబట్టియే ప్రస్తుతపు విద్యావిధానము మా అక్కరలకును పరిస్థితులకును తగియుండలేదని నిశ్చయముగా జెప్పవచ్చును. వ్యవసాయమునందు మావారికున్న ఉత్సాహమును ఎక్కువజేసి, అందులోనే అభివృద్ధిమార్గముల దెలుపునట్టివిద్య వారికి నేర్పుట అవసరము. అదియు విశేషవ్యయప్రయాస సాధ్యమైనదిగా నుండగూడదు. అందఱికిని అందుబాటులో నుండవలయును. మాక్షత్రియయువకులలో నుండునియమబద్ధతను, వినయవిధేయతలను విశాలభావమును వృద్ధిజేసి పరోపకారజాతి దేశసేవాదులకు ఉపయోగపడునట్లు వారిని తయారుచేయువిద్య అవసరమై యున్నది. అంతేకాని విశృంఖలతకును, అవిధేయతకును సంకుచితస్వార్థదృష్టికిని ఎడమిచ్చు విద్యాపద్ధతులు, అనుసరింపదగినవి కావు. సెకండరీవిద్యగూడ లాభించనందుననే మనవిద్యార్థులుగాని, వారి తలిదండ్రులుగాని దానియెడల సుముఖతను జూపుటలేదు. ఐనను నిరక్షరతను వృద్ధిజేయక, మన జాత్యభివృద్ధికి అనుకూలమగు మార్గముల దెలుసుకొని అందుకు తగిన విద్యావిధానము నేర్పరచుకొనుట సంఘనాయకుల కర్తవ్యమగుచున్నది.

## స్త్రీవిద్య

పురుషులస్థితియే యిట్లుండ స్త్రీవిద్యనుగుఱించి చెప్ప బనియుండదు. దేశభాషయగు తమిళము క్షత్రియ స్త్రీలకు తెలిసియుండుట కొంతవఱకవసరముగానే యున్నది. సామాన్యముగా కావలసిన స్వల్పపుతమిళ జ్ఞానమును నేర్పించుటకై, ఇప్పుడు చేయుచున్నటుల క్షత్రియబాలికల నారంభమునుండియు తమిళపాఠశాలలకంపి అరవమునే నేర్పించినచో శీఘ్రకాలములోనే మాతృభాష యంతరించకమానదు. మొత్తముమీద ప్రస్తుతపు విద్యావిధానము పురుషులతోబాటు స్త్రీలకు గూడ నిరుపయోగముగనే యున్నది. మాతృభాష తెలుగయ్యు, చిన్నప్పుడే యది సరిగ నేర్పకపోవుటవలన, అరవము నేర్చుకొనుట కష్టమగుటయేగాక దెలిసిన కొంచెము తెలుగుగూడ మఱచిపోవలసివచ్చుచున్నది. విదేశములలోనున్నను, మాతృభాషను ఇంకను మఱచిపోక నిలిచియుండుటకు మాస్త్రీలే కారకులై యున్నారు. ఇకముందుకూడ దానినుద్ధరించవలసినవారు స్త్రీలే యైనందున, మాతృభాషాభివృద్ధియగునటులును, దేశభాషాజ్ఞానము కలుగునటులును తగిన విద్యావిధానముతో, క్షత్రియస్త్రీలకుగాను ప్రత్యేకమైన పాఠశాలను నిర్మింపవలసియున్నది. దక్షిణదేశమునందును, ముఖ్యముగా మాగ్రామమునందును ఆంధ్రభాషాప్రచారముచేయ చెన్నపురి దక్షిణాంధ్రభాషాభివర్థనీసభవారలోగ కొంతప్రయత్నించియుండిరిగాని ఇపుడట్టిప్రయత్నములు బొత్తిగా కానము.

## ఆర్థికము

మాక్షత్రియసంఘపు ఆర్థికస్థితిని గుఱించిగూడ కొంచెము మనవి జేయవలసియున్నది. మాలోకొన్ని ధనవంతములైన కుటుంబములున్నను మొత్తముమీద చూచిన, రాజులందరును ఆర్థికముగ వెనుకబడియున్నారనియే చెప్పవలయును. సాధారణముగ దేశమందలి దారిద్ర్యమునకు పరిపాలనాలోపమే కారణముగ నుండును. అట్టిది ప్రస్తుతము మన భారతదేశమునంతను ఆవరించియే యున్నది. ఇదిగాక సోమరితనమును, భోగలాలసత్వమునుగూడ దరిద్రమును దెచ్చిపెట్టును. మా సంఘములో నున్న బీదతనమునకు ఇదెంతమాత్రము కారణముకాదని చెప్పవచ్చును. ఈ ప్రాంతమందలి ఇతర జాతులతో పోల్చిచూచిన మావలె కాయకష్టముచేయువారు లేరనియే చెప్పవలెను. చీకటిలో 3 గంటలకే మేల్కాంచి ఏడెనిమిది మైళ్ళదూరముననున్న పొలములలోను అడవులలోను కష్టపడి పనిజేసి రాత్రి పదిగంటలపైననే ఇల్లు చేరుకొనువారు, మాలో ఎందరోయున్నారు. ప్రతిదినము ఇంతదూరము నడచి వ్యవసాయము చేయుచుండువారిలో సోమరితనము మచ్చునకైన నుండదనిన అతిశయోక్తిగాదు. కాన సోమరితనముగాక వేరుకారణము లుండితీరవలయును. —సశేషము.

# ఆరోగ్యవిజ్ఞానము

## ౯. తేనెయొక్క ఆహారపు విలువ

శక్తిని ఉత్పాదించు ఆహారపదార్థములలో తేనె ఉత్కృష్టమైనది. సులభముగా జీర్ణమై శరీరమున శీఘ్రముగ వ్యాప్తినొందు చక్కెరపదార్థములతో తేనె నిండారియున్నది. ఇతరవిధములయిన చక్కెరలు తేనెలోనుండు సాధారణమైనచక్కెరపదార్థములుగా మారుటకు అన్నాశయమునందును, పేగులయందును స్రవించు ద్రవములతో మేళవింపు నొందవలసిన యక్కఱగలదు. రోగమువలనగాని, వృద్ధాప్యమువలనగాని జీర్ణకోశముయొక్కస్థితి చెడియున్నప్పుడు తేనె —సులభముగా జీర్ణమగునదగుట—విలువయైన ఆహారపదార్థ మగుచున్నది. జీర్ణకోశమునకు విశేషము పని కల్పించకయే శరీరమున జారబాఱునదగుట తేనె శిశువులకు, పిల్లలకు మంచిఆహారమగునని అమెరికను డాక్టరొకడు చెప్పుచున్నాడు. కసరత్తుచేయువారి ఆహారపదార్థములందు తేనె తప్పక చేర్పబడవలయును. మల్లులుగావించు విశేషమైన దేహపరిశ్రమవలన వారి కండరములందును, రక్తమునందునుగల చక్కెరలు త్వరత్వరగా విలుప్తమగుచుండును. వాని స్థానమున క్రొత్తగా చక్కెరపదార్థములు కలిగించుటకు తేనెకు మించిన ఆహారపదార్థము మఱియొకటి లేదని రూఢిగచెప్పవచ్చును.

## ౯. మేకపాలు సౌందర్యవర్ధకములు

బ్రిటీష్‌గోట్ సొసైటీవారి జర్నలులో ఆ పత్రికా సంపాదకులగు ఎ. జె. ఫామరుగారు ఇట్లు వ్రాయుచున్నారు: "బ్రిటనుదేశమున ఇప్పుడు మేకపాలు విశేషముగ త్రాగు ఆచారము ఏర్పడియున్నది. ఈ దేశమున ఇరువది యేండ్లకు క్రితము ఏడాదికి 2,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తిచేయబడు చుండెను. ఆ రేండ్లక్రితము ఈ ఉత్పత్తి 12 000,000 గాలనులకు పెరిగెను. నేడు 20,000,000 గాలనుల మేకపాలు ఉత్పత్తి చేయబడుచున్నవి. ఆవుపాలకంటె మేకపాలు సులభముగా జీర్ణమగునవియగుట—వెన్న సంబంధమైన క్రొవ్వు వీనియందు విశేషముగానుండుట—క్షయకారకక్రిములకు ఇవి దూరమైనవగుట—ఆవును పెంచుటకంటె మేకనుపెంచుట చవుకయగుట—ఆవు మొదలగువాని దూడలు, గొఱ్ఱెపిల్లలు, గుఱ్ఱము మొదలగువానిపిల్లలు, పందిపిల్లలు మున్నగువానికి పాలదాదిగా మేక పనికిరాగలిగియుండుట—ఈ కారణములకు తోడు మేకపాలు సౌందర్యవర్ధకములగుట ఈ దేశమున మేకలను పెంచుటకు ప్రత్యేకహేతువగుచున్నది. దినమునకు మూడునాలుగుసారులు తమ మొగములను, కంఠములను, ముంజేతులను మేకపాలతో తడుపుకొనుచు కొంచముసేపుండి కడిగివైచికొనుచుండవలయును. ఇట్లుచేయుటచే చర్మము నునుపుదేరి మంచి కాంతిని పొందుచున్నది. సౌందర్యపోషణము నిమిత్తము స్త్రీలు ముఖ్యముగా మేకపాల నాశ్రయించుట వాంఛనీయమని ఇచటి డాక్టరులు పలువురు పత్రికలలో వ్రాయుచుండుట పత్రికాపాఠకులెల్లరును గమనించియేయుందురు."

## ౯. రోగులకు ఆహారమిచ్చుటలో చూపవలసిన మెలుకువలు

'నీబలమును నిలుపుకొనుటకు నీవు ఆహారమును గొనవలయును' అనునది ఎల్లరెఱింగిన సత్యము. 'నీవు నీరసముగానున్నచో పలువురు నీవు తగినంత ఆహారమును తీసికొనుట లేదని తలంతురు. బలమును పొందు

టకు నీవు ఎక్కువగా తినవలయును' అనునది పలువురి అభిప్రాయమైయున్నది. కాని ఆరోగ్యశాస్త్రవేత్తల అభిప్రాయమున ఇదియొక దురభిప్రాయమైయున్నది. ఈదురభిప్రాయము ననుసరించి వర్తించుచుండుటచేతనే పలువురు ఆజన్మము బలహీనులై ఉండుచున్నారు. తినుటకును, జీర్ణించుకొనుటకును సన్నిహిత సంబంధము కలదని ప్రాయకముగా గుర్తింపబడదు. జీర్ణకోశమును ఆహారముతో నింపినమాత్రమున అది బాగుగా అరగి శరీరమునకు శక్తినొసంగు పదార్థముగా మారుననుకొనుటకు వీలుచాలదు. ఆహారమును లోగొనుటకు ఆవశ్యకత, దానిని జీర్ణముచేసికొనజాలుటకు శక్తి ఉండవలయును. జీర్ణించుకొనుటకు శక్తి చాలనిస్థితిలో అన్నాశయమును ఆహారముతో నింపుట విషము ఉత్పత్తి అగుటకు అవకాశము కల్పించుటయే. అది శరీరమునకు అనవసరపదార్థము. దానిని శరీరమునుండి పూర్తిగ వెలికిత్రోసివైవవలయును. కాని అది తఱుచు పేగులలో చేరి నిలవయుండి కుళ్ళి విషముల నుత్పన్నముచేయును. ఆవిషములు శరీరమున విపులముగా వ్యాపించి దుస్సాధ్యరోగములను పుట్టించుటకు కారణభూతములగుచున్నవి. ఇట్టిపరిస్థితులలో రక్తము చెడిపోవును. ఈ విషము ఆహారకోశమునుండి వెలువడును. ముసిడిసత్తు విసముకంటె కూడ నిది తీవ్రతరమైయుండును. రోగి ఉదరమున ఇట్టి విషము ఉత్పన్నమగుట ఎంతటి ప్రాణాంతకమో సులభముగ నిర్ణయించుకొనవచ్చును. ఇట్టి విషముల పుట్టుకచే రోగి మఱింత నీరసించుచున్నాడు; శక్తి మఱింత చెదరుచున్నది; ఆకలి బొత్తిగా కొఱవడుచున్నది; ఆహారముపై ఏమాత్రము తలంపు పోవుట లేదు. ఇట్టిస్థితిలోకూడ రోగికి ఏదైన ఆహార మీయవలయుననను ప్రయత్నము వైద్యుడును, రోగి బంధువులును కూడ చేయుచున్నారు. రోగికి ఆహారమిచ్చుట ఒక గొప్ప విషమపరీక్ష. ఆహారముయొక్క ప్రధానతత్త్వమును ఏమఱిన వైద్యుడు తన అవ్యక్తతచే ఒక్కొక్కప్పుడు రోగి ప్రాణములను పోగొట్టును. ఇట్టి ప్రమాదములచేతనే రోగులలో పలువురి మరణములు సంభవించుచుండునని నా అభిప్రాయము. ఆమయస్థితిలోగాని నిరామయస్థితిలోగాని ఆకలిలేకనే ఆహారము నెన్నడును గైకొనరాదు; తిని అరగించుకొని అనుభవించగలుగుదునను ధైర్యములేనిదే ఆహారము చేకొనరాదు. ఆరోగ్యస్థితిలో నున్నవాడు ఆకలిలేనప్పుడు ఆహారము గైకొనుటచే తోడనే ప్రమాదము కలుగక పోవచ్చును. రోగస్థితిలో నున్నవాడుమాత్రము ఆకలిలేనప్పుడు ఆహారమును బొత్తిగా దరికి చేరనీయకుండుటను మఱువరాదు. బలమును నిలుపుకొనుటకు అవశ్యము ఆహారమును గైకొనవలసినదే. కాని అగ్గైకొనుటలో విశేషమైన మెలుకువను చూపవలయును. తినిన ఆహారము తప్పక జీర్ణమగునని ధైర్యము చిక్కినప్పుడును, శరీరము ఎక్కువ పోషణపదార్థమును కోరుచున్నదని తోచినప్పుడును అగ్నిబలము ననుసరించి అధికాహారమును గొనవలయును. మిగిలినసమయములందు ఆహారమును గొనుట విషమును మెక్కుటయే. రోగులకు ఆహారమొసంగునపుడు ఆహారపదార్థముల విపుల విజ్ఞానమును కలిగియుండుట అతిముఖ్యము. బలముకాని నీరసముకాని ఆహారపదార్థములవలననే కలుగుననియు, బ్రతుకుటగాని మరణించుటగాని ఆహారపదార్థములవలననే సంభవించుననియు జ్ఞప్తియందుంచుకొనవలయును. హితమైన ఆహారమును మాత్రమే ఈయవలయుననియు, హితముకాని ఆహారమును ప్రయత్నపూర్వకముగా విడనాడవలయుననియు ఎన్నడును మఱచిపోగూడదు.''

—బెర్నార్డు మాక్ ఫేడెన్.

## ౯. చర్మరోగులు : సి. విటమిను

విటమినులలో సి. విటమిను రక్తశుద్ధిచేసి రక్తమును ఆరోగ్యస్థితిలోనుంచును; శరీరమును అంటురోగములనుండి కాపాడును. చర్మరోగములు, సెగగెడ్డలు, కురుపులు సి. విటమినుగల పదార్థములను భుజించుటచే తప్పక కుదురును. సీమవంకాయలు, నీరుల్లిపాయలు, నిమ్మకాయలు, నారింజకాయలు, కాబేజి వీనియందు సి. విటమినులు విశేషించియున్నవి. పెసలు మొదలగు పప్పుగింజలయందు మొక్కలు మొలుచుస్థితిలో సి. విటమినులు విస్తరించియుండును. సి. విటమిను చర్మరోగుల పాలిటి వరప్రసాదము.

# ✣ గ్రంథాలయోద్యమము ✣

## వాటికన్ గ్రంథాలయ పునర్నిర్మాణము

### వాటికన్, అందలి గ్రంథాలయము

'వాటికన్' అనునది ఒక నగరనామము. అది రోము దేశమునగలదు. రోమన్ కాథోలిక్ మతస్థుల పీఠాధిపతియగు పోప్ కాపురవుకాణాచి. ఆనగరరాజ్యమున పోప్‌నకు నిరంకుశాధికారము గలదు దాని వైశాల్యము 108 యకరములు. జనాభా 500 మంది. ప్రపంచమునందలి ప్రాచీనగ్రంథాలయములలో వాటికన్‌గ్రంథాలయ మొకటి. ఆగ్రంథాలయము ఈనడుమ పునర్నిర్మాణముగావింపబడినది. గ్లాస్గోనగరమునుండి ప్రచురింపబడుచున్న 'ఈవినింగున్యూస్' పత్రిక ఆపునర్నిర్మాణవిధానమునుగూర్చి విపులముగ నిట్లు ప్రచురించుచున్నది.

### పునర్నిర్మాణావశ్యకత

"వాటికన్ గ్రంథాలయమున అతి ప్రాచీనమైనవి, అమూల్యములైనవినగు పలు గ్రంథములుగలవు. కట్టడము మిక్కిలి పురాతనమైనది. గతవత్సరప్రారంభమున గోడలు కూలునను భయముతోచెను. అమెరికా దేశమునుండి వాస్తుశాస్త్రజ్ఞుని ఒకనిని రప్పించి నూతన భవన నిర్మాణమునకు మదింపులు తయారుచేయించుచుండిరి. ఇంతలో గతవత్సరపు క్రిస్టమసు పండుగుల ముందు ఆగ్రంథాలయభవనకుడ్యములు కూలిపోయెను. అప్పుడు లిఖితపుస్తకములన్నియు పరిరక్షింపబడినవి కాని అచ్చుపుస్తకములు కొన్నియు, పింగాణీసామగ్రికొంతయు పాడయ్యెను.

### గ్రంథాలయాధికారి

పోప్ పదునొకండవ పయస్ గ్రంథాలయాధికారి. ఆతడు వెనుక మిలాన్ నందలి యాంబ్రోషియన్ గ్రంథాలయమున పాలకుడుగానుండెను. 'పోప్' అధికారమునుపొందకపూర్వము ఆతడు ఈవాటికన్ గ్రంథాలయమునగూడ కొంతకాలము పనిచేసియుండెను. పుస్తకపఠనము ఆతని అభిమానవిద్య. పోప్ అధికారమును పొందినపిమ్మట కూడ తన తీరికసమయములందెల్ల నాతడీగ్రంథాలయమున గడుపుచుండును. వాటికన్ గ్రంథాలయమునందలి గ్రంథనిక్షేపముయొక్క భవిష్యత్తును గూర్చి పోప్ ఆలోచనాపరుడై యుండెను.

### అమెరికన్ నిపుణుల సాహాయ్యము

గ్రంథాలయోద్యమము అమెరికా దేశమున విశేషమైన అభివృద్ధినొంది ప్రత్యేకకళయై విరాజిల్లుచుండుటచే ఈవాటికన్ గ్రంథాలయపునర్నిర్మాణవిషయమున పోప్ అమెరికన్ నిపుణుల సాహాయ్యము నర్థించెను. పుస్తకములు వాతావరణమునందలి వేడికి, శీతలమునకు చెడిపోకుండునట్లు అమెరికా దేశమునందలి నగరరాజములలో నొకటియగు చికాగో గ్రంథాలయమున శాస్త్రసమ్మతమైన ఏర్పాటులుగావింపబడినవి. ఇట్టి ఏర్పాటులు ఈగ్రంథాలయమునందును సమకూర్ప సంకల్పించియున్న కారణముచేతగూడ పోప్ ఈ విషయమున అమెరికన్

నిపుణుల సాహాయ్యము నర్థించెను.

వాటికన్ గ్రంథాలయ పునర్నిర్మాణ పర్యాలోచనవిషయమున రప్పింపబడిన అమెరికన్ నిపుణులలో ఆంగస్ మేక్డొనాల్డు మేటి. ఆతడు న్యూయార్కు నగరవాసి. గ్రంథాలయపునర్నిర్మాణపర్యాలోచనము ముగిసినపిమ్మట ఆత డిట్లు ప్రకటించెను :

### విద్యుచ్ఛక్తిచే సమశీతోష్ణస్థితి కలిగించుట

'తన పరిపాలనమునకు, ఖ్యాతికి తగినట్లు క్రొత్తగ్రంథాలయము నిర్మింపబడవలయు నని పోప్ సంకల్పము. అమూల్యములును, అపూర్వములును అగు తన గ్రంథసముదాయము వాతావరణమునందలి శీతోష్ణములకు చెడిపోకుండ కాపాడు ఏర్పాటుగావించుట ఆతని ప్రధానవాంఛితము ఇటలీదేశమున తఱుచుగా గాలి ఇవతాళించుచుండును. అట్టి సమయములందు ఇవముచే గ్రంథములు ముడుచుకుపోవుట, వంకరపోవుట సంభవించుచుండును. ఆదేశమున ఉన్నట్టుండి అప్పుడప్పుడు గాలి వేండ్రముగా వీచుచుండును. అట్టి సమయములందు పుస్తకముల బైండింగు పెట్లిపోయి, రూపుచెడి, విడిపోవుచుండును. ఇవమువలన, వేండ్రమువలన పుస్తకములు చెడిపోకుండ అరలలో సమశీతోష్ణము నిలచియుండుటకు యంత్రములు నిర్మింపబడినవి. ఈయంత్రములు విద్యుచ్ఛక్తివలన నడుపబడుచున్నవి. వాతావరణమున ఇవము హెచ్చుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తిసహాయమున వేడిని కలిగించును. వాతావరణమున వేండ్రము అధికమగుచో ఆయంత్రము విద్యుచ్ఛక్తి సహాయమున నీటిఆవిరిని విరజిమ్మును. దానితో వేడితగ్గి సమశీతోష్ణము ఏర్పడును.

### తమంతటతాము ఆరిపోవు దీపములు

ఈ భాండాగారమున మఱియొక క్రొత్త ఏర్పాటు ఎలక్ట్రిక్ దీపములను నియమితకాలమున ఆర్పువిధానము. అరలయందు పుస్తకము తెచ్చుకొనుటకు పోయినపుడు ఎలక్ట్రిక్ మీటు నొక్కి దీపము వెలిగించి మరలివచ్చునపుడు దీప మార్పు మీటు నొక్కుట తఱుచు మఱచిపోవుచుందురు మఱి ఒకరుపోయి దానినిచూచి ఆర్పువఱకును అది అట్లు వెలుగుచునేయుండునది. అందుచే విద్యుచ్ఛక్తి చాలగ ఖర్చు అగుచుండునది. ప్రస్తుతనిర్మాణమున ఇది తొలగింపబడినది. మీటునొక్కి దీపమువెలిగించి అరలోని పుస్తకము గైకొని పాఠకులు వెడలిపోవచ్చును. వెలిగించిన తరువాత ఏడు నిముసములు మాత్రము వెలిగి ఆదీపము దానియంతట అదియే ఆరిపోవును. ఈ ఏడునిముసములలో వలసిన పుస్తకమును ఎన్నుకొని తీసికొనిపోవుటకు తగిన సావకాశముండును.

### పుస్తకములుంచుటకు ఏడుమైళ్ళ ఉక్కుఅరలు

సమశీతోష్ణస్థితిని కలిగించుట, దీపముల విషయమున క్రొత్తఏర్పాటు చేయుట అను రెండు విషయములందుమాత్రమేగాక పుస్తకము లుంచు తీరునందును క్రొత్త విధానమువలంబింపబడుచున్నది. విడివిడి కొయ్యబీరువాలయందు పుస్తకములుంచు విధానము విడనాడబడి, ఉక్కుతో ప్రత్యేకము అరలుగల మందిరము నిర్మింపబడినది. ఈ మందిరమున ఒకదానిపై నొకటి మూడు అంతస్థులుగలవు. ఈమూడు అంతస్థులలో ఇమిడియున్న ఉక్కుఅరల నిడివికొలత ఏడు మైళ్లు అనుటచే ఈభాండాగారము ఎంత పెద్దదిగానుండునో ఊహించుకొనవచ్చును.''



స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతులు క్రీడింతురు.



# మహిళాలోకము

## నేటి యుగోస్లావియా స్త్రీలు

### స్త్రీలు అతిలోకసుందరులు—అత్తలు చాలమంచివారు.

యుగోస్లావియా యూరపుఖండమునందలి ప్రత్యేక రాజ్యములలో నొకటి. విస్తీర్ణము 248,050 చతురపు మైళ్ళు. జనాభా 13,000,000. బెల్‌గ్రేడ్ పట్టణము రాజధాని. దాని జనాభా 240,000.

యుగోస్లావియాస్త్రీలు ప్రపంచమునందలి వివిధ దేశపు స్త్రీలందఱికంటెను గొప్ప సుందరులను ప్రఖ్యాతినార్జించియున్నారు. సూర్యాతపమున నిరంతరము పరిభ్రమించువారగుటచే కించిత్తు కమలి వింతసోయగము వెలార్చు బుగ్గలతో, కళ్ళను మిఱుమిట్లు గొలుపు వివిధములైన ముదురురంగు బట్టలతో బజారువెచ్చమునకై దుకాణములను చుట్టుచుండు యుగోస్లావియా సుందరులను మాడ చాలముచ్చటగ నుండును.

యుగోస్లావియాస్త్రీల నిజస్థితిని తెలిసికొనుటకు ఆదేశపు పట్టణములనుచూచి లాభములేదు. పల్లెటి సీమలకు బోవలయును. పల్లెటిపట్టులయందు మనకు అన్ని తరగతుల స్త్రీలతోడను పరిచితి కలుగుటకు అవకాశములు విరళముగానున్నవి. గ్రామసీమలయందు ఇంకను వృద్ధాచారములే అవలంబింపబడుచున్నవి. యుగోస్లావియాస్త్రీలకు అతిథిపూజ ప్రియమైనది.

ఇతర యూరోపియను దేశములందువలె యుగోస్లావియాయందు కుటుంబజీవితము ఇంకను భ్రష్టము కాలేదు. ఆదేశమునందలి కుటుంబములలోని వివిధవ్యక్తులు అన్యోన్యవిశ్వాసము అను సూత్రముచే బంధింపబడియున్నారు. వ్యష్టికుటుంబములు ఆదేశమున అరుదు. పలుకుటుంబములు సమష్టిగా ఒక్క ఇంటనే తఱుచు నివసించుచుండును. ఈసమష్టికుటుంబజీవనపద్ధతిని వారు వారిభాషలో 'జాడ్రుగా' అని పిలుచుచుందురు. ఈసమష్టికుటుంబము సాధారణముగా ఒకనాయకురాలి అధికారమునకు లోగియుండును. ఈఅధికారము ఒక్కొక్కప్పుడు పురుషునిహస్తములందుండుటయు గలదు. కాని అట్లున్న నిదర్శనములు మిక్కిలి తక్కువ. శాఖోపశాఖలు ఒక్క కాండమునాశ్రయించి యున్నట్లు పలుకుటుంబములు ఒక్క గృహము నాశ్రయించి యుండును. ఇట్టి సమష్టికుటుంబములలో ఒక్కొక్కయింట నలుబదిమంది వ్యక్తులు కూడియుండుటకు పలు నిదర్శనములుకలవు.

ఈ విశేషసంఖ్య వ్యక్తులపై ఆగృహయజమానురాలికి నిరంకుశాధికారముగలదు. యజమానురాండ్రు సాధారణముగ నడివయస్సుగల విధవరాండ్రై యుందురు. సర్వవిషయములును ఆమెయే చర్చించి నిర్ణయించును. పొలములో పనిచేయుటకు ఎవరుపోవలయును, ఇంటిదగ్గరనుండి ఎవరు పనిచేయవలయును మున్నగు స్వల్పవిషయములుకూడ ఆమెయే నిర్ధరించును. ఎట్టి చిక్కులును లేక ఈపద్ధతి సవ్యముగ సాగిపోవుచుండును. ఏమన ఆమెచెప్పినదానికి ఎదురుచెప్పు తలంపు ఆవ్యక్తులకు కలలోగూడ నుండదు.

యూరపుఖండమునందలి వివిధదేశములలోని గృహములందు అలుమగల తగవులనుగూర్చి మనము తఱుచు వినుచుందుము. యుగోస్లావియాదేశమున గృహములందు అలుమగల తగవులు చాలఅరుదు. భార్యవాంఛలు భర్తవాంఛలతో జతపడక పోయినచో ఇతర దేశములందు ఆవిషయము రచ్చకెక్కును. యుగోస్లావి

యలో ఆవిషయము యజమానురాలికి నివేదింపబడును. ఆమె వెంటనే దానినిగూర్చి పూర్తి పర్యాలోచనము సల్పి పరిష్కరించును. ఆమాతృశ్రీనిర్ణయమునకు ఆ అలుమగలు మాటలాడక తలయొగ్గుదురు.

పెద్దయింటినుండి విడివడిన ప్రత్యేకమందిర మొకటి భార్యకు ప్రత్యేకింపబడును. ఏకాంతవాసమును గోరు సమయములందు ఆమె నిరభ్యంతరముగ ఆ మందిరమునకు పోయి విశ్రాంతికొనవచ్చును. కాని యుగోస్లావియా స్త్రీలు ఏకాంతవాసమును గోరరు ఎల్ల వేళల చుట్టుపక్కములతో కలసిమెలసి యుండుటకే వారు ముచ్చటపడుదురు సాధారణముగ వారికి తీరిక యుండదు. అగుటచే ఏకాంతవాసముపై వారికి మనసు పోదు. పొలముపనినిగాని, ఇంటిపనినిగాని వారు వతనులప్రకారముగా చేసికొందురు. ఆపెద్దయింట వారి వారి అభిమతములకు సరిపోవు వివిధములైన పనులు అన్ని సమయములందును ఏర్పడియుండును.

ఒకయింట రెండుకొప్పులు ఇముడవను సామెత తెనుగునందు గలదు. ఆ అర్థమును తెలుపు సామెతలు ఇతరభాషలందునుగలవు. స్త్రీలలో అన్యోన్యసామరస్యములేకుండుట ఇట్లు ప్రతిదేశపువాఙ్మయమును సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతిదేశపువాఙ్మయమునందును అత్తల చెడ్డతనమునుగూర్చిన ప్రస్తావనలు విరళముగానే యున్నవి. ప్రపంచమునందలి వివిధదేశములలో అత్తలు మంచివారై యున్న దేశము ఈ యుగోస్లావియా దేశము ఒక్కటియే. వివిధదేశములందలి జనపదములందు వ్యాప్తములై యున్న పాటలను, పదములను సేకరించు పనిమీద వివిధదేశసంచారమును గావించిన జూలియా ఛాటర్ టన్ యుగోస్లావియాదేశమున ప్రయాణము సల్పుచు ఒకరియింటవిడిసి వారికి ఆంగ్లనాటకము నొకటి చదివి వినిపించెను. అందు అత్తల చెడ్డతనమును గూర్చి ప్రస్తావనగలదు. దానికి ఆయుగోస్లావియా కుటుంబమునందలి వ్యక్తులు అత్యాశ్చర్యమును జూపిరి. తమ జాద్రుగా కుటుంబములయందు అత్తలు ఎట్లు మంచివారైయున్నారో వారు విసువెఱుంగక ఆతనికి వర్ణించిరి. ఆత డీవిషయమునుగూర్చి 'ఈవినింగున్యూస్' పత్రికలో ప్రత్యేకవ్యాసమును వ్రాసెను.

వారు అరుణోదయమగుటతోడనే పడకనుంచి లేతురు. అవసరమగుచో మగవారితోకలసి పొలములకు ముంతమూళ్ళతో నేగుదురు. ప్రాతఃకాలమునకు, మధ్యాహ్నమునకు కలిసి వారికి ఒక్కటే భోజనము. ఆ భోజనము తఱుచుగా మేకపాలు, రొట్టె, అపుడపుడు వెన్న వీనితోగూడియుండును. రాత్రిభోజనము ఇంటివద్ద. పందిమాంసము, గ్రుడ్లు మొదలైనవి అప్పటి ఆహారపదార్థములు చిన్నపిల్లలు సయితము బ్రాందిత్రాగుదురు. వృధాకాలాక్షేపము యుగోస్లావియా స్త్రీలకు సరిపడదు. గొఱ్ఱెలను కాచునపుడు పడుచులు, పాఠశాలకుపోవుచు బాలికలు కాలము వ్యర్థపడకుండుటకై చిన్నచిన్న పంటికోలలకు నూలుచుట్టుచుందురు.

అచట పెళ్ళిళ్ళు పెద్దలే నిర్ణయింతురు. వధూవరులతో నెట్టి సంప్రదింపునులేదు. కన్య వివాహయోగ్య కాగా ఇంటి వీధికిటికీయందు ఒక బొమ్మను వ్రేలాడదీతురు. తమకొమారులకు వివాహము చేయదలచియున్న తండ్రివచ్చి ఇచట సంప్రదింపవచ్చుననుట కిది గుఱుతు. పెండ్లిదినమున చర్చికిపోవుటకుముందు మామయింట వధూవరులు కలసికొందురు. పాశ్చాత్యపద్ధతికి విరుద్ధముగా చర్చికి వధువే ముందుపోవును. చర్చికిపోవుటకు ముందు వధువునకు ఆమెతోబుట్టువు ఒక నాణెము నిచ్చును. అది ఆమె నాలుకక్రింద పెట్టుకొని యుంచుకొనవలయును వివాహకాండపూర్తియగువఱకు అది పాయరాని తాయెతు ఇంటిదడిలో తనస్నేహితుడు గావించిన కంతగుండ పెండ్లికుమారుడు అందఱికి ఆఖరున చర్చికి ప్రయాణమగును.

చర్చినుండి తిరిగివచ్చునపుడు పెండ్లికూతురు ఒక దారిని, పెండ్లికుమారుడు వేఱొకదారిని ఇంటికి వత్తురు. ఎముక అచట దుశ్శకునము వధూవరులు కలిసివచ్చుచో దారిలో ఎవరైన ఎముకపెట్టిన వారికి మరణము కలుగునని యుగోస్లావియా దేశీయుల నమ్మకము. భార్యాభర్తల మొదటిభోజనము ఏకాంతమున. అంతయు మధురపదార్థమే. వారిజీవితమంతయు ఇట్లు మధురమైయుండగల వాంఛను సూచించుటకైన దీయేర్పాటు.

# మణిమాల

## సోమరులు చిరకాలము జీవింతురా ?

బ్రూసుబార్టన్ ఇట్లు వ్రాయుచున్నాడు : "ఈ యుగమున దేహపరిశ్రమ ఒక దేవతవలె ఆరాధింపబడు చున్నది. మనపూర్వుల మితిమీరిన దైవభక్తిని ఇప్పుడు మనలో కొందరు ఎట్లు ఈసడింతురో మనసంతతివారు మన ఇప్పటి దేహపరిశ్రమయను దేవతఆరాధనము నట్లు ఈసడింపవచ్చును. ఈ ఆరాధకులు తఱుచుగా 'జంతువులను చూడుడు, అవి ఎట్లు విశేషమైన దేహపరిశ్రమను గొనుచున్నవో గమనింపుడు' అనుచుందురు. ఈ వాక్యమునందలి నిజానిజములు తెలిసికొనుటకై జార్జి జీన్‌నాథన్ అను నతడు జంతువుల దేహపరిశ్రను విషయమున పరిశోధనలు గావించి ఇట్లు ప్రకటించుచున్నాడు. 'జంతువులలో విశేషభాగము ఎట్టి దేహపరిశ్రమను గొనవు. వానిలో దేహపరిశ్రమ విశేషించి గొను వాని జీవితకాలపరిమితి మిక్కిలి తక్కువగా ఉంటున్నది. జీవులలో తాబేలునుమించిన సోమరులు లేరు. అట్టి తాబేలు సాధారణముగ 200 మొదలు 300 ఏండ్లవఱకు జీవించుచున్నది. ఏనుగు మఱియొక సోమరిజంతువు. దాని జీవితకాలపరిమితి 150 మొదలు 200 ఏండ్లవఱకు. పక్షులలో హంస సోమరియగుట ప్రసిద్ధి. జంతు ప్రదర్శనశాలలయందు ఉంచబడినవే హంసలు 102 వత్సరములదాక జీవించుచున్నవి. విశేష దేహపరిశ్రమగొను చుఱుకుజంతువులగు కుక్కలు పదిపదిహేను ఏండ్లకంటెను, ఉడుతలు పది పన్నెండు సంవత్సరములకంటెను, కుందేళ్ళు ఏడెనిమిది వర్షములకంటెను, ఎలుకలు మూడునాలుగు వత్సరములకంటెను హెచ్చుకాలము జీవింపవు."

—హెరాల్డు ట్రిబ్యూన్ మేగజైన్.

* * *

## ఒక న్యూయార్కు పత్రిక చేసిన తమాషా

రాల్ఫు డి. బ్లుమెన్ ఫీల్డు అనునత డిట్లు లిఖించుచున్నాడు : "న్యూయార్కు హెరాల్డు పత్రికాప్రచురణకర్తయగు జేమ్సుగార్డన్ బెన్నెట్టు తాను అభిలషించిన దానిని ప్రజలచే చేయింపగలనని నమ్మియుండెను. అరువదిఏండ్లకు పూర్వము ఒకనాటిరాత్రి తన స్నేహితులతో నాతడు తన ఈనమ్మిక నిజమైనదని రుజువుచేయుటకుగాను మఱునాడు న్యూయార్కు పట్టణమునందలి ఒక్క వ్యక్తికూడ తనగడపదాటి రాకుండ చేయుదునని చెప్పెను. మఱునాటి ఉదయము హెరాల్డు పత్రికలో స్థానికజంతుప్రదర్శనశాలలోని క్రూరమృగములన్నియు తప్పించుకొనివచ్చి ఊరిమీద పడినవను ఘోరవార్త ప్రచురింపబడెను. పెద్దపెద్ద శైపులలో 'ఎచ్చటచూచిన వికలాంగులు' 'మాంసభక్షక జంతువుల రూపమున మృత్యుదేవత వీరవిహారము' ఇత్యాది అర్థమును సూచించు తలపేరులతో ఆ పత్రిక పిక్కటిల్లియుండెను. పత్రికతోబాటు ఈవార్త జలతైలబిందువై క్షణములో ఇంటింట వ్యాపించెను. వీధులలో ఒక్కపిట్టకూడ కానరాలేదు. గడపదాటి కాలు బయటపెట్టుటకు ప్రతివారును భయపడిరి. పట్టణమునందలి ప్రతియింటి వీధితలుపు మూయబడెను. పాఠశాలలన్నియు మూసివేయునట్లు ఆర్డరుపుట్టెను. కొన్ని గంటలవఱకు న్యూయార్కున ప్రాణులు లేనట్లే యుండెను. బయటకుపోకతప్పనిసరియైనవారు తమ ప్రాణములపై ఆశవదలుకొనియే బయట కాలుపెట్టిరి. కుక్కయఱపు సింహగర్జనయయ్యెను. దొంగతనముగా దాగి గోడమీదనుండి జాఱిపోవు పిల్లి మానవరక్తమున గ్రోల నుంకించుచున్న చిఱుతపులియయ్యెను. హెరాల్డు అధిపతి బెన్నెట్టు న్యూయార్కునంతటిని భయసముద్రమున ముంచి తేలించెను. కాని కొలదిగంటలలో నిజము వెల్లడియయ్యెను ; పట్టణప్రజలు చలివిడిచిరి ; అంతయు తిరిగ యథాస్థితినొందెను."

—నాష్ మేగజైన్.

* * *

## జాతిసమితి : దాని కార్యవిధానము

"ప్రస్తుతము జాతిసమితిలో 54 ప్రభుత్వములు సభ్యత్వము వహించియున్నవి. అనగా ప్రపంచమున నాలుగింట మూడుభాగములు జాతిసమితికి అనుబంధమైయున్నవన్నమాట. బ్రిటిష్ సామ్రాజ్యాంతర్భాగములగు ఐరిష్ ఫ్రీస్టేటు, ఇండియా మొదలగునవి ప్రత్యేక సభ్యత్వార్హతను, ఓటింగు హక్కును గలిగియున్నవి. జాతిసమితి ఎజంబ్లీ ప్రతిసంవత్సరమును సెప్టెంబరు 10-వ తేదీని జినీవాలో కూడును. సభ్యత్వము వహించిన ప్రతిదేశము ముగ్గురు ప్రతినిధులను పంపవచ్చును. దేశము ఒకటింటికి ఒకఓటు. కార్యనిర్వాహకవర్గము ఏడాదికి మూడుసారులు సమావేశమగును. గ్రేటు బ్రిటను, ఫ్రాంసు, ఇటలీమాత్రమే ఇపుడు శాశ్వత సభ్యత్వముగలవి. జపాను, జర్మనీలు విరమించుకొన్నవి. ఏటేట మఱి తొమ్మిదిదేశములు తత్కాలిక సభ్యత్వమునకు ఎన్నుకొనబడుచుండును. ఈ తొమ్మిది ఏవిఅనగా: పోలెండు, యుకోస్లావియా, పెరూ, స్పెయిన్, వెనిజులా, పెర్షియా, గాటిమేలా, నార్వే, ఐరిష్ ఫ్రీస్టేటు. జాతిసమితి చేయవలసినపని పలుతెఱగులది. అది దినదినము పెరుగుచున్నది. సమరనిరోధము; యుద్ధములులేకుండ తగాదాలు పరిష్కరించుకొనుటకు హేగ్‌నందొక శాశ్వతన్యాయస్థాననిర్మాణము; వివిధ జాతీయపునర్నిర్మాణము; ప్రపంచారోగ్యపరిరక్షణము, అభివృద్ధి; వ్యభిచారనిర్మూలనము; శిశుసంరక్షణవిధానము—ఇత్యాదులు జాతిసమితి చేకొనిన బహుకార్యములలో కొన్ని."

—సండే క్రానికలు.

* * *

## బడితోటలు

"జనవరిమాసపు సంచికలోని మణిమాలయనే శీర్షికక్రింద ప్రచురితమైన 'బడితోటలు' అను వ్యాసభాగమును చూచాను. ఆంధ్రులు బడితోటలు, గృహారామములు, చెట్టుకూరపాదులు మొదలగువాని విషయమున చూపే అశ్రద్ధ మిక్కిలి శోచనీయమైవుంది. ఆంధ్రావని సుజలపూరితమనీ, సుఫలభరితమనీ, సస్యశ్యామల అనీ భావపుత్రులు కీర్తిస్తూంటే ఏవూళ్ళోనూ ఎన్నివాడల తిరిగినా దేవపూజకుకూడా గుప్పెడుపూలు సమకూరడము కష్టంగావుంది. దొడ్లోవున్న పాదుని పట్టుమని పదికాయల్ను కోసుకుని కూరవండుకుని భుజించే సంసారులుకూడా లెక్కకు మిక్కిలి అల్పం. రాజమంద్రి కళాశాలకు అధ్యాపకుడై కళోపాసకుడై కవితాకుమారుడై ఆంధ్రావనియెడల అమితానురాగం చూపి 'థేమ్సు—గౌతమి' అను ఖండకావ్యసంపుటమును ఆంగ్లములో ప్రచురించిన కూల్డ్రెదొర ఒక సంధర్భములో అన్నమాట లివి: "మీదేశం ఫలపుష్పశోభితమని మాదేశస్థులు చెప్పుకుంటారు. ఇప్పుడు రెండూకూడా క్షీణించివున్నాయి. కారణమేమి?" మననేల ఫలవంతమైనదే, మనసూర్యభగవానుడు వనస్పతులను ఏవెల్ల కాలము పోషింపగలవాడే. అయితేయేమి? దానికి కావలసిన పురుషకారములేదు. తీరికసమయాల్లో పురుషులు విలాసలాలసులై యేచీట్లపేకలో ఆడతారు; స్త్రీలు యేగచ్చకాయలో ఆడుకుంటారు; పెద్దలను అనుకరిస్తారు చిన్నలు. కనుక మనతెనుగుసీమలో గృహారామములు వెలయడంలేదు. పచ్చతోరణము నిత్యకల్యాణంగా ప్రతి ఆంధ్రునియిల్లూ వుండే మంచిరోజులు యెప్పుడు వస్తాయోగదా! బడితోటలవిషయం యింతకన్నా అన్యాయం. నూటికి 90 స్కూళ్ళకు ఆవరణవుండదు. వున్నా తోటవేయడానికి వలసిన సౌకర్యాలువుండవు. మాస్టర్లు నిస్సహాయులు; ప్రెసిడెంట్లు నిష్కాములు; ఇన్స్పెక్టర్లు నిర్లిప్తులు. ఇంక తోటలేలా వెలుస్తాయి? కనుక 'ఆంధ్రభూమి'లో 'తోటపని' అనే శీర్షికక్రింద ప్రతినెల ఒకపేజీ ప్రత్యేకించి యేదైనా వ్యాసం ప్రకటిస్తే బాగుంటుంది. భోజ్యములగు పొట్ల, కాకర, రామములగ, మట్టుబచ్చలి, తోటకూర, మెంతికూర మొదలగు కాయగూరలనుగూర్చి ముందు వ్రాయించండి. ఇవి తెలియనివారుందరని అనుకోవద్దు వానిని శాస్త్రీయముగ పాతిపెట్టి వన్నెగలిగేతీరుగా పెంచి, కాయించుట అందరకును తెలియదు కనుక

ఆంధ్రభూమి ఈ ప్రయత్నం చేయగలదని తలంచుచున్నాను."

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

* * *

## పాశ్చాత్యనవలాకారులు :

పుస్తకములు వ్రాసేతీరు.

"ఆంగ్లమహాకవి జాన్సనువలె మిద్దెమీదిగదిలో కూర్చుని ఆకుపచ్చని తేయాకు, నల్లటికాఫీ తాగుచు నిరంతరము పనిచేసి వారము దినములలో 'రాసిలాస్' వంటి ఒక పుస్తకమువ్రాసి మఱియొకపుస్తకము వ్రాయుటకు పదియేండ్లు కష్టపడు కవులు ఇప్పుడులేరు. నేటి గ్రంథకర్తలు ఇతరవృత్తులయందలివారు పనిచేయునట్లే నియమక్రమమున సమర్థతతో పనిచేయుచున్నారు. నవీనగ్రంథకర్తలలో—కీర్తిశేషుడైన ఆర్నాల్డు బెన్నెట్టువలె—తమ మనస్సులు యంత్రమువలెనే నిరంతరము పనిచేయునని గర్వపడువారు నాయెుకలో కనీసము పండ్రెండుగురు కలరు. రాబోవు మాసములందలి తమసారస్వతవ్యాసంగమును వారు ముందుగనే నిర్ణయించుకొని పెట్టుకుందురు. నవలారచనకు ఇంతకాలము, పత్రికలకు వ్యాసములు వ్రాయుటకు ఇంతకాలము, నాటకరచనకు ఇంతకాలము అని ఏర్పఱచుకొందురు. కలముకంటె టైపురైటరును ప్రేమింతురు. వీలుపడినపుడెల్ల సాధారణముగ తమ కార్యదర్శులకు తాముచెప్పుచుండుదానిని ఉపన్యసింతురు. కొందఱు ఎట్టిచిత్తుకాపీయు లేకయే టైపురైటరు మెషినుదగ్గరకూర్చుండి తమరచనములను ఆలోచించుచు టైపుచేయుదురు. ఈపద్ధతివలన శక్తి, కాలము కూడివచ్చునని వారితలంపు. బహుళగ్రంథకర్త ఎడ్గారువేలస్ ఇదే పద్ధతి నవలంబించి రోజు ఒక్కంటికి ఇరువదివేల పదముల చొప్పున రచింపగలిగెను. హెచ్. జి. వెల్సు కొంతసేపు పెనసలు, కొంతసేపు కలము ఉపయోగించును. సాధారణముగ అతడు దినమునకు అయిదు గంటలు పనిచేయుచుండును. కాని ఒక్కొక్క రచనమున పర్యాప్తుడైయున్నప్పుడు ఒకేదమ్మున ఎనిమిది తొమ్మిది గంటలు పనిచేయును. అర్ధరాత్రములందు లేచి మంచిమంచి భావములను కాగితముముక్కలపై వ్రాసికొనుచుండును. గ్రాసీయందలి తనపల్లెటిగృహమున అతడు అప్పుడప్పుడు ఒక్కటాకీని పదునెనిమిది గంటలు పనిచేయును. చిన్నచిన్న కాగితముముక్కలపై తనరచనములను టైపుచేసి ఉంచుకొని పూర్తియైన తరువాత అతడు వానినన్నిటిని గుదిగ్రుచ్చును. ఓపెన్ హీమ్ అను గ్రంథకర్త దినమునకు మూడువేలు మొదలు నాలుగువేల మాటలవఱకు రచియించును. ఇందు చాలభాగము ప్రొద్దుటిపూటయందే రచింపబడును. తాను రచింపవలసినదానిని ఈతడెప్పుడును నిర్ణయించుకొనడు. ప్రథమప్రకరణమును ప్రారంభించును. తన కల్పనాశక్తి ఎట్లు గొనిపోయిన అట్లు పోవును. ఉద్రేకము కలిగినపుడుమాత్రమే పలుపుటలను వ్రాయగలవారు ఇప్పుడునుగలరు. అట్టివారిని టైపురైటరుతో తమరచనమును సాగింపుమనిన వారికి సాధ్యము కాదు. ప్రఖ్యాతిగల నేటి అమెరికను రచయితలలో పలువురు కలముపట్టుటకు కక్కసించెదరు. ఎక్కడికిపోయినను ఒక పోర్టబుల్ టైపురైటరును గొనిపోవుదురు. వనసీమలయందును, నదీతీరములందును కూర్చుండి వారు తమభావములను ఆటైపుమెషినుసాయమున లిఖితమొనర్తురు. సింక్లరులూయి అను అమెరికను గ్రంథకర్త చిత్తువ్రాసికొని పిమ్మట సాఫువ్రాసికొనును. ఒకనవల రచించుట పూర్తియైనతరువాత మఱియొక నవల రచించుటకు పూనుకొను మధ్యకాలమున స్టీఫెన్ మెక్కన్నా అను గ్రంథకర్త తన మనస్సు శాంతిపడుటకై పెక్కుదినములు శలవులు గొనును. మఱియొక గ్రంథమునకై తానువైచిన కథయొక్క అస్థిపంజరము పూర్తియైనతోడనే తలుపువైచుకొని తనగదిలో కూర్చుండును, ఎవరికిని దర్శనమీయడు, నిరంతరము పనిచేయును, దినమునకు ఒకగంటమాత్రము షికారుపోవును. గిల్బర్టుఫ్రాంకా అత్యాశ్చర్యకరమైన త్వరరచయిత. అలసటవచ్చువఱకు నాతడు ఉపన్యసించును. ఆ ఉపన్యాసము టైపుచేయబడి పిమ్మట ఆతని కందీయబడును. దాని నాతడు చదివి రివైజుచేయును. కొన్నికొన్ని భాగములను తిరిగి వ్రాయును, అక్కడక్కడ మెఱుగులు

దిద్దును; పిమ్మట దానిని ఒకచోట పడవైచి యుంచును తనకు తృప్తికలుగువఱకు మెఱుగులు దిద్దుచుండును. ఫ్లాబర్టు నెమ్మదిగాను, విశేషపరిశ్రమతోడను వ్రాయువాడు. వేయిమాటలు వ్రాయగలిగినచో ఒక దినమునకు బాగుగా పనిచేసినట్లు ఆతడెంచువాడు. కిప్లింగును విడిచినచో నేటిగ్రంథకర్తలలో నెవడును ఇంతటి కొద్దిపాటి రచనమును చేసినవాడు మఱియొకడు లేడు. ఇంతమాత్రముచే పూర్వగ్రంథకారులందఱును తక్కువ పుటల రచనమును చేసినవారని అనుకొనుటకు వీలులేదు. అధునికులగు వేలెస్, ఓపెన్‌హీమ్‌లకంటె ప్రాచీనులగు డికెన్సు, డ్యూమాస్, డీఫో మొదలగువారు త్వరరచయితలై యుండిరి. నవ్వుపుట్టించు నవలలు రచించుటలో ప్రఖ్యాతినార్జించిన ఐరిష్ గ్రంథకర్త లీవర్ ఉదయము ఐదింటికిలేచి ఏడుగంటలవఱకు గ్రంథరచనము సాగించువాడు. ఈ రెండుగంటలకాలమును ఆతడు ఒక్కొక్క పావుగంటకు 250 మాటల చొప్పున రచించువాడు.''

—రాల్ఫు డర్క్.

* * *

## పంజాబులో ఉర్దూ పత్రికలు

ఢిల్లీయందలి హిందుకాలేజీలో అధ్యాపకులగు శ్రీ బూల్‌చందు అనువారు పంజాబు యూనివర్సిటీ యొక్క హిస్టారికల్ సొసైటీవారి జర్నలులో ఇట్లు వ్రాయుచున్నారు: 'ఢిల్లీయందు 1837 లో స్థాపింపబడిన 'సయ్యాద్ ఉల్ అక్బర్' అనునది మొదటి ఉర్దూపత్రిక. 1838 లో ఢిల్లీనుండి వెలువడనారంభించిన 'ఢిల్లీఅక్బర్' అను పత్రిక విశేషజనామోదము నందెను. ఈ పత్రికలోని సంపాదకీయములందలి వాక్యములు కొన్ని నేటికిని సామెతలుగా నిలిచియున్నవి. సిఫాయీల తిరుగుబాటుకాలమున ఇది ఆగిపోయెను. పంజాబు ఉర్దూ వార్తాపత్రికల చరిత్రలలో 1850 జనవరి 14-వ తేది అతిముఖ్యమైనది. అప్పుడు లాహోరులో 'కోహినూరు' అను వారపత్రిక ప్రారంభింపబడెను. అది 1888 లో దినపత్రికయయ్యెను. 1890లో దాని సంపాదకుడు చనిపోయెను. అప్పటినుండి 1904వఱకు వారపత్రికగా నడచి ఆగిపోయెను. 'కోహినూరు' సమకాలికపత్రికలలో 'అక్బరు-ఐ-ఖాష్‌నా-ఐ ఫెయిజ్' ఒకటి. ఇది 1853లో లాహోరులో ప్రారంభింపబడెను. 1857 లో దీని ప్రచురణ నిరోధింపబడెను. సిఫాయిల తిరుగుబాటునకు పిమ్మట ఇది సియాల్‌కోట్లులో 'విక్టోరియా' అను నామముతో తిరిగి ప్రారంభింపబడి నేటికిని సాగుచున్నది. 1870లో 'అక్బరిఆమ్' వెలువడెను. సాలు చందా రూ 2-8-0 మాత్రమే. పోస్టల్ కన్సెషన్ లేని ఆదినములలో ఇంతచవుకగ పత్రికనిచ్చుట విశేషమైనది. 1878 లో 'పైసా అక్బర్' ప్రారంభింపబడెను. కాపీఒక్కింటికి పైసా. అగుటనే దాని కాపేరు. సంపాదకునకు మంచి ఆదాయమువచ్చెను. వ్యాపారదృష్టిలో జయమునందిన ప్రథమ ఉర్దూపత్రిక ఇదియే. చాలప్రకటనలు వచ్చెను. దేశభాషాపత్రికలలో విశేషగౌరవమునందెను. 1900లో ఈపత్రికాసంపాదకుడు పాశ్చాత్యవార్తాపత్రికల నిర్వహణపద్ధతినిగూర్చి తెలిసికొనుటకు యూరపువెడలెను. 1882 లో వర్నాక్యులర్‌ప్రెస్సుఆక్టు రద్దుఅయ్యెను, దేశభాషాపత్రికలకు కూడ పోస్టల్‌కన్సెషన్ ఇచ్చిరి. యుద్ధమునకు పూర్వము ఉర్దూపత్రికలలో పేరు మోసిన- వాతన్, హిందూస్థాన్, జమీందార్ - అను మూడును ముఖ్యమైనవి. 1908 లో వార్తాపత్రికల శాసనమును, 1910 లో ముద్రణాశాసనమును గావింపబడినను యుద్ధకాలమున వార్తాపత్రికల ప్రచారము హెచ్చెను. పంజాబుప్రభుత్వమువారు యుద్ధవార్తలు తెలుపుటకు 'హక్' అను పేరుతో నొక దినపత్రికను ప్రారంభించిరి. దినమునకు డెబ్బదివేల కాపీలు సెలవగునవి. ప్రత్యేకసంచికలు అంతకంటె హెచ్చు సంఖ్య ఖర్చుఅగునవి. యుద్ధానంతరము ఉర్దూవార్తాపత్రికల అన్నిటి ప్రచారము అతిశయించెను. పంజాబునందలి అన్ని ఉర్దూవార్తాపత్రికల మొత్తపుగ్రాహకుల సంఖ్య 1917 లో 246,000 మంది; 1918 లో 320,000 మంది, 1919 లో 342,000 మంది; 1920 లో 358,000 మంది; నేడు దానికి దాదాపురెట్టింపు—594,000 మంది.''

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవిత భీమా : ప్రజా సేవ

భీమాశాస్త్రపారంగతులగు శ్రీ సిరిల్ జేమ్సు ఫాక్సు కె. సి. గారి రేడియో ఉపన్యాసమున కిది తెనుగు సేత.

జీవితభీమానుగూర్చి మనము మాటలాడునపుడు భావి కాలమున నిర్మింపబడగల నొక సంస్థను ప్రస్తావించుటలేదు ; రెండవందల సంవత్సరములనుండి పరంపరాగతమైయున్న సంప్రదాయము, అనుభవము, నిపుణుల కార్యదక్షత వీనిచే పరిపుష్టి నొందియున్న ఒక గొప్పసంస్థను ప్రస్తావించుచున్నాము

ఈ రెండువందల సంవత్సరములలో ప్రపంచమున అనేకవిపత్తులు సంభవించినవి. యుద్ధములు, ఆధివ్యాధులు లోకులను పీడించుచు వచ్చినవి. ఆర్థికమాంద్యములు, ఆర్థికవిపత్తులు అపుడపుడు కలుగుచునచ్చినవి. కాని జీవితభీమాఉద్యమముమాత్రము వీనిఅన్నిటి దాడిని నెట్టుకొని ప్రశంసాపాత్రముగ బయటపడుచువచ్చుచున్నది ఒక్కొక్కదాడిని తట్టుకొని బయటపడిన ప్రతిపర్యాయమును జీవితభీమా నూత్నశక్తిని, వ్యగ్రోత్సాహమును పొంది ప్రజాబాహుళ్యమున తనస్థిరత్వమును గూర్చిన విశ్వాసమును పెంపొందించుచు క్రమముగా అధికవ్యాపారానుభవమును, స్వానుభవముతో గూడిన అధికవిజ్ఞానమును సంపాదించుచున్నది. ఈ విజ్ఞానానుభవసంపాదనచే జీవితభీమా భావికాలమున ఎట్టి గొప్పవిపత్తులు వచ్చినను తట్టుకొనగలుగు శక్తిని, రెండువందల వత్సరములుగ తాను కాపాడుచున్న విశేష సంఖ్య మానవుల అక్కఱలను ప్రయోజనములను ఇక ముందు కూడ నిరభ్యంతరముగ కాపాడగలనను ధీమాను పొందుచున్నది.

**1929**-వ సంవత్సరమునుండియు తనభారమును లోకముపై మోపి దానిని క్రుంగదీయుచు ఇప్పుడుకూడ లోకమున మూగియున్న ఆర్థికమాంద్యము ప్రపంచచరిత్రలో అశ్రుతపూర్వమని పలువురు చెప్పుచున్నారు. అట్టి బృహత్పరిమాణమందిన ఆర్థికమాంద్యమునకు కూడ ఎదురొడ్డి నిలిచి దానిని గెలిచిన గొప్ప సత్వము జీవితభీమా.

జీవితభీమా—దాని నామము సూచించునట్లు—జీవుల క్షేమలాభములకొఱకు. ఒకానొకడు చనిపోవునను భావముతో జీవితభీమా కొనబడుటలేదు. భీమాదారునిపై ఆధారపడియుండు కొందఱు వ్యక్తులు అతని మరణానంతరముకూడ జీవించి ఆర్థికరక్షణావశ్యకతను కలిగియుండనగుటచేతనే జీవితభీమాచేకొనబడుచున్నది. పోషణకు, అభివృద్ధికి మనపై ఆధారపడియుండువారి జీవితాధారములను జీవితభీమా సంశయస్థితినుండి తప్పించి నిశ్చితస్థితిలో నిలుపుచున్నది. అంతియగాక జీవితభీమా ప్రాణుల భద్రతకై ఉద్దేశింపబడినదిగావున భీమాదారుని స్వప్రయోజనమును గూడ రక్షించుట కదిపూటకాపై యున్నది. అది తృప్తిపఱుపగల మానవుని అక్కఱ లెట్లు వివిధములై యున్నవో దాని ఉద్దేశములును అట్లు వివిధములై యున్నవి. జీవితభీమా సంచిత ధననిధి ; పటిమ గోలుపోవని రక్షణ ; ఒడుదొడుకులు లేని పెట్టుబడి: ఉన్నతమైన అంతస్థుకు చెందిన వ్యాపారపుటాస్తి. జీవితభీమా విధులను గౌరవముతో నిర్వహింప సాయపడును, బాధ్యతలను తృప్తికరముగ నెఱవేర్పతోడుపడును. రాగల దుస్సంఘటనములనుండి జాగ్రత్త

పెట్టి జీవితమునందలి ఆర్థికసంబంధమైన చిక్కులను ఎడలించి జీవితభీమా భీమాదారుని సేవించుచున్నది. అది అత్యవసరమును గూర్చి జాగ్రతగొనును; గడించిన ధనమును కూడబెట్టచేయును; నిరుద్యోగముచేత గాని, వృద్ధాప్యముచేతగాని, అంగవైకల్యము మొదలగు ప్రతిబంధములచేతగాని జీవితసౌకర్యము తగ్గినప్పుడు జీవితభీమా సహజమైన రాబడియొక్క స్థానమును ఆక్రమింపగలుగుచున్నది. పేదవారును, ధనవంతులును సమముగా గుతికాగల ఆర్థికసంబంధమైన విపత్తులను జీవితభీమా తప్పించుచున్నది. అది పొడిమిఅను గుణమును అలవఱచుచున్నది. గృహములను కాపాడుచున్నది, కుటుంబములను రక్షించుచున్నది, విద్యాసముపార్జనమునకు అవకాశమిచ్చుచున్నది, చొఱవను కలిగించుచున్నది, ఏదైన నొక కార్యమును ప్రారంభింప ఉత్సాహమును పుట్టించుచున్నది, పాటుపడుటయందు అభిముఖులను చేయుచున్నది, వ్యాపారమున తగిన కాలమున అర్హమగు డబ్బు సహాయము లేకపోవుటచే జాఱవిడువబడు సదవకాశముల లాభమును పొందగలుగుటకు సమర్థత నిచ్చుచున్నది. క్రమాభివృద్ధిని కలిగించుటకు జీవితభీమా వ్యక్తికి ఎంతలాభకరమైన దగుచున్నదో రాష్ట్రమునకుకూడ అంతటి లాభప్రదమైనదై యున్నది.

సమమైన ఆలోచనగల ఏమానవుడును తాను బీదవాడై యుండుటకుగాని, తానొకరిపై ఆధారపడియుండుటకుగాని అంగీకరింపడు; తన పోషణపై ఆధారపడియున్నవారిని ఇతరులపోషణకు పోవలసినవారుగా గాని, క్రమజీవితపథమునుండి తప్పిపోయినవారుగా గాని అగుటకును అంగీకరింపడు. ప్రతి సాధారణవ్యక్తి హృదయమునందును తన జీవితపథమును తానే నిర్ణయించుకొని తనబ్రతుకుతెరువుతానే కల్పించుకొనవలెనను వాంఛ దృఢముగ పాతుకొనియుండును. ఈవాంఛ మెచ్చదగినది, పెంపదగినది, ప్రోత్సహింపదగినది. ఇట్టి వాంఛగలవారిలో ఉత్తమజాతివారు ఇతరుల అనుగ్రహమును ఆశింపరు, తమకుగల పలుకుబడినిగాని ఉద్యోగమునుగాని దుర్వినియోగ మొనర్చి స్వప్రయోజనమునకై ఉపయోగింప నిరాకరింతురు, తమ బుద్ధిబలముచేతను శక్తి సంపదచేతను జీవించ ఆశింతురు. తాను జయశీలి అగుటకే అతడు గాఢముగ కోరును. శిఖరములను అతడు అందుకొనలేక పోవచ్చును. అయితే అంతమాత్రమున అట్టయడుగపడియుండ నక్కఱలేదు. ప్రయోజకుడు, మర్యాదస్తుడునగు పౌరుడై; భగవంతునకు భయపడుచు; రాజును గౌరవించుచు; జీవితసారస్యమును గ్రహించి ఆనందింపగల సమర్థుడగుచు, గృహమునుపొంది దానివలన రాగల ఆనందములను అనుభవించి బాధ్యతలను నిర్వహింపగలవాడై యున్న చాలును.

## సుభాషితము

### ౧౮

"వ్యక్తుల ఆర్థికసౌఖ్యమును గూర్చి విశేషముగా శ్రద్ధగొనుటకై మానవునిచే నిర్మింపబడిన ఏకైకసంస్థ జీవితభీమా. మానవుని వృద్ధాప్యమును శాంతమయముగాను, సుఖమయముగాను చేయుటకై అది కల్పింపబడినది. దానిరక్షణము కోరువారి అందఱకును అది శుభాశీర్వాదముల నొసంగి విరలాభములను కలిగించును. వ్యక్తులను కాపాడి వారిని సవ్యమార్గముల నడపించుటకు ఉద్దేశింపబడినదగుట అది దూరపుటాలోచనను కలిగించి అనుకొనని సంభవములను తగ్గించుచున్నది. ప్రజాసేవ గావించుట కుద్దిష్టమైనదగుట అది నాగరికతాభివృద్ధికి గావించిన సాహాయ్యము అంకెలతో మాత్రమే కొలబెట్టరానిది. ప్రజాక్షేమము, మానవసౌఖ్యము హెచ్చుగ ఆధారపడియుండు చక్కని ఉపదేశము, అన్యోన్యసహకారము, క్రమమైన ఏర్పాటు వీనిసాముదాయకసంపత్తితో జీవితభీమా నాగరికతాభివృద్ధికి గావించిన సాయమును కొంతవఱకు కొలబెట్టవచ్చును."

—పీస్ గార్డియన్.

ఈ వాంఛలను ఈడేర్చుకొనుటకును, ఈ స్వప్నములను నిజము లొనర్చుకొనుటకును అతడు లెస్సగ పాటుపడవలసియున్నది. ఆ పాటుపడుట ఉద్దేశపూర్వకమైయుండవలయును. ఇక ఆఉద్దేశము ఎట్టిదై యుండవలయును? తాను ఏర్పఱచుకొనిన పద్ధతులను నిర్వహింప తనకు శక్తినిచ్చుటకై తన ఆదాయమునుండి కొంత మిగుల్చుకొను మనోనిశ్చయమై యుండనగును. ఈమనోనిశ్చయము ఫలోదయాంత మగుటకు సహకారియైనవానిలో జీవితభీమా ఆదర్శప్రాయమైనది, నిరుపమానమయినది అగుచున్నది. యౌవన కాలముననే—అనగా తనజీవితమును భీమాచేయగల తరుణము దాటిపోకుండగనే—భీమాను కొని దానివలన పొందగల పూర్తి లాభములను పొందుట ఈవాంఛాపరిపూర్తికి సవ్యమయిన మార్గము.

జీవితభీమా ఆర్థికరక్షణకు రాచబాట. అది ఒక జాతివారి ప్రత్యేకహక్కు కాదు. అది అందఱికిని స్వాగతము చేయును. పేదవారు, ధనికులు దాని ఆహ్వానము నందుదురు.

రాబడి తక్కువగా నున్నవానికి జీవితభీమా అత్యవసరమగుచున్నది. భావికాలమున రక్షణపొందుటకును, తనపై ఆధారపడియున్న వారిని పరిరక్షించుటకును అది ఆతనికి కావలసియున్నది. కొద్దియో గొప్పయో ఆర్జించువారిలో తమ ఆర్జనలో కొద్ది మొత్తమునైన మిగిల్చి దానితో భీమాను కొనజాలనివారు చాలతక్కువగ నందురు. ఇక తనఆక్కఱకు మీఱిన రాబడిగల వ్యక్తికి జీవితభీమా ఒక గొప్ప స్నేహితుడే. కొంత మూలధనమును కూర్చుటకును, దానిని ఉపయోగించుకొనుటలో ఆర్థస్వాతంత్ర్యమును పొందుటకును ఆతని ఆర్థికస్థితిని సునిశ్చయమొనర్చుటకును ఆతనికి జీవితభీమా ఎంతయో అక్కఱకు వచ్చును.

ఆర్థికముగ ఎట్టి చిక్కులను పడకుండగనే ఇప్పటికంటె ఇంకను హెచ్చుమంది భీమాలను కొనుటకును, ఇదివఱకే భీమాచేసియున్నవారు ఇంకను పెద్ద మొత్తములకు భీమాచేయుటకును అవకాశముగలదని నిరభ్యంతరముగ చెప్పవచ్చును. ఇట్లు భీమా చేయించుట ఆచరణ సాధ్యమైనదే. భీమాయొక్క విలువను మనము పూర్తిగ గ్రహించినపుడిది సులభముగ నెఱవేఱును. జారీచేయబడిన ప్రతి పట్టాయు, చెల్లింపబడిన ప్రతి క్లెయిమును ఒక్క వ్యక్తిని మాత్రమేకాపాడి ఆతనికిమాత్రమే లాభము కలిగింపదనియు అది దేశమున కంతటికిని లాభకరమైనదనియు, వ్యక్తి సంపదను పెంపొందించుటతోబాటు దేశసంపదను గూడ పెంపొందించుననియు, ఆర్థికక్లేశములను దూరముచేసి ధనవిషయమున మానవునకు స్వాతంత్ర్యమును ప్రసాదించుచున్నదనియు మనము తెలిసికొనవలసియున్నది. తెలిసికొని దాని లాభమును పొందుటకు ప్రజలు విశేషముగా ప్రయత్నించు దేశము త్వరలో ముందుకు రాగలదు.

## సుభాషితము

### ౧౯

అనిశ్చయములను నిశ్చయములుగాను, అసమములను సమములుగాను చేయుటకు నేడు మానవు డవలంబించు క్రొత్తపద్ధతికే భీమా అని పేరు. ప్రతిభీమాపట్టాయు నొక స్వాతంత్ర్య ప్రకటనము; ఆర్థిక స్వేచ్ఛాపత్రము. భీమాపట్టా కలవాడు దారిద్ర్యమును జయించినవాడు. పొదిమి అను పునాదియే భీమాయొక్క ఆశయమునకు జనిస్థానము. సంయమముపై కూడబెట్టు శక్తి ప్రధానముగా ఆధారపడియుండును. కూడబెట్టుశక్తి మానవుని సద్గుణములలో అతిముఖ్యమైనది. ప్రతి పౌరుడును తాను ఆదర్శకుడు అగుటకు అభిలషించుచో ఈ శక్తిని బాగుగా కలిగియుండవలయును. జీవితభీమాపట్టాను అమ్ము ప్రతివాడును మానవస్వభావవిషయకమగు నొక యోగ్యతాపత్రమును అమ్ముచున్నాడన్నమాట. భీమాపట్టా కలిగియుండుట మంచిపౌరుడనుటకు గుఱుతు, స్వపరిపాలనస్వత్వము నందుటకు నిరాక్షేపణీయమైన హక్కు గలదనుటకు చిహ్నము —

—కాల్విన్ కూలిడ్జి.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౫౨. తురుష్క ప్రజాస్వామికము

ఫ్రెంచి స్వాతంత్ర్యవిజయమును, అమెరికా సంయుక్త రాష్ట్ర స్వాతంత్ర్య విజయమును రచించి ప్రచురించి ఆంధ్రవాఙ్మయమును రాజకీయశాఖలో పరిపుష్టి నొందించుచున్న దేశసేవాతత్పరులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు రచియించిన గ్రంథ మీ తురుష్క ప్రజాస్వామికము. 'మనప్రక్క దేశముల వారు తమజాతీయసమస్యల నెట్లు పరిష్కరించుకొనుచున్నారో తెలిసికొనుట చాల లాభకారి. అట్టి యుద్దేశ్యముతో మహమ్మదీయజాతులలో మిగుల ప్రఖ్యాతమగు తురక (తురుష్క) జాతిచరిత్ర వ్రాసినాను' అని శ్రీరావుగారు తొలిపలుకులో తెలుపుచున్నారు. సుప్రసిద్ధప్రతిభాశాలురగు శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు ఈగ్రంథమున కొక చక్కనిపీఠికను వ్రాసినారు. 'అత్యంతప్రతిభాశాలియగు ముస్తఫా కెమాల్ పాషా యొక్క ఉత్తేజకనాయకత్వమున తురుష్కులెంత శౌర్యముతోను, ఎంత పట్టుదలతోను, తమజన్మభూమి స్వాతంత్ర్యమును, పారతంత్ర్యదంష్ట్రలనుండి కాపాడుకొనిరో, తరువాతనా స్వాతంత్ర్యమును నిలువబెట్టుకొనుటకును-తమజాతికిని రాష్ట్రమునకును ప్రపంచమునందు శాశ్వతగౌరవమును ప్రతిష్ఠించి దానిని నిలుపుకొనుటకును రాజకీయ సాంఘిక ఆర్థిక విషయములందు ప్రజాజీవనములో అన్నివిషయములందును, నవీనపద్ధతుల నెట్లవలంబించిరో ఆచరిత్ర మిందుకలదు. పాశ్చాత్య సామ్రాజ్యతత్త్వమునకును, తురుష్కజాతీయోద్యమమునకును జరిగిన గొప్పపోరాట మిందు విపులముగ వర్ణింపబడినది.' అని పీఠికాకారులు. పలుగ్రంథములు పరిశోధించి వ్రాసిన ఈ అమూల్యగ్రంథరత్నమును ఆంధ్రులెల్లరును శ్రద్ధతో జదివి తమ విజ్ఞానమును పెంపొందించుకొనగలరని నమ్ముచున్నాము. క్రౌను సైజున 360 పుటలుగల ఈ గ్రంథమూల్యము ఒక రూపాయి మాత్రమే. ఈ 'తురుష్కప్రజాస్వామికము' విజ్ఞానచంద్రికాగ్రంథమాలలో 39-వ పుష్పముగ ప్రచురితమైనది. క్యాలికో బైండు. ప్రతి చందాదారులకు రు 1-8-0 ; ఇతరులకు 1-12-0. ప్రతులు వలయువారు బెజవాడయందలి విజ్ఞానచంద్రికా గ్రంథమండలి కార్యస్థానమునకు వ్రాయునది.

## ౫౩. వ్యాసభాషాంతరీకరణచంద్రిక

ఆంధ్రవిశ్వవిద్యాలయమునందును, మదరాసు విశ్వవిద్యాలయమునందును స్కూలుఫైనలు పరీక్షకు చదువు ఆంధ్రవిద్యార్థుల ఉపయోగార్థము ఈ వ్యాసభాషాంతరీకరణచంద్రిక రచియింపబడినది. మదరాసునందలి యస్. యమ్. బెన్‌టిక్ హైస్కూలునందు సీనియరు తెలుగుపండితులుగానున్న విద్వాన్ యమ్. శ్రీపతి శాస్త్రిగారు దీనిరచయితలు. ఈగ్రంథమున రెండు ప్రకరణములు కలవు. ప్రథమప్రకరణమున భాషాంతరీకరణమును గావించునపుడు గమనింపవలసిన కొన్ని ముఖ్యాంశములు వివరింపబడి దృష్టాంతమునకై పదునైదు తర్జుమాలు ఈయబడినవి. ద్వితీయప్రకరణమున వ్యాసములు వ్రాయబడునపుడు గమనింపవలసిన ముఖ్య విషయములు వివరింపబడి దృష్టాంతముగా ఏనుగు, నేలబొగ్గు, కలరా, ఆకాశవిమానములు, వార్తాపత్రికలు మొదలగు పలువిషయములనుగూర్చి వ్యాసములు ప్రస్తరింపబడినవి. దీనిని చదువు స్కూలుఫైనలు విద్యార్థులకు వ్యాసభాషాంతరీకరణ విషయమున జయము సులభము. క్రౌనుసైజున 72 పుటలు. వెల రు. 0-5-0 అణాలు. దొరకుచోటు : ది లిటిల్ ఫ్లవర్ కో, 317, లింగిశెట్టివీధి, జి. టి, మదరాసు.

## ౫౪. కరుణలేని కమతము

కార్మికసంఘ ప్రచురణము ౧. శ్రీ స్వామి తత్త్వానంద ప్రణీతము. ప్రకాశకులు ధూళిపాళ్ళ కోటయ్య

గారు, అనంతవరము, తెనాలి తాలూకా. జానకయ్య, సుందరమ్మ, లక్ష్మి, కోటడు పాత్రలమూలమున 'కరుణలేనికమతము'లో చూపబడిన నీతిపాఠము ఎంతయు గ్రహింపదగినదైయున్నది. ఇట్టి యుత్తమగ్రంథమును ప్రచురించి దానిని పాఠకులకు ఉచితముగానిచ్చుచున్న ధూళిపాళ్ళ కోటయ్యగారి దేశసేవ యెంతయు కొనియాడదగియున్నది. ఆంధ్రులీప్రచురణమును అర్హప్రచారమునకుతెచ్చి శ్రీ కోటయ్యగారి కృషిని సఫలమొనర్తురుగాక యని కోరెదము. క్రౌనుసైజున 16 పుటలు.

## ౫౫ భక్తరామోపాఖ్యానము

రచయిత బాలకవి పొన్నూరు బాపయ్యగారు. కోలాటకీర్తనలు. 'నంపనంపనుని నందితచరితానందభరితులైన'వలెనను పల్లవి. ఇది బాలుర కుదిష్టమైనదగుట సులభశైలిలో ఒప్పుచున్నది. ఈ బాలకవి భావికాలమున ఉత్కృష్టగ్రంథరచనముచే ఆంధ్రభాషాభగవతిని భవ్యరీతిని సేవించుగాకయని కోరెదము. చిన్నసైజు చక్కని అచ్చు. 16 పుటలు. వెల రు. 0—1—0.

## ౫౬. భక్తజీవనము

పరీక్షిద్విలాసము, భక్తహృదయము అను ఉత్తమగ్రంథములను తెనుగుతల్లి పాదపంకేరుహములకు సమర్పించిన సారస్వతార్చకులు శ్రీయుత పుతుంబాక శ్రీకృష్ణయ్యగారిచే రచియింపబడిన ఈ గ్రంథము ఆమూలాగ్రముగ చదివి అమితానందము నందితిమి. వెంకటేశ్వరవచనములు, భవానీ శంకరవిన్నపములు మొదలగు వానిని రచియించిన కవులవలె 'భక్తజీవన' గ్రంథకారులుకూడ భగవదానందములో తన్మయులై పరవశులగుచుండుటను ఈ గ్రంథమునందలి ప్రతియక్షరమును ప్రస్ఫుటముచేయుచున్నది. భక్తుడగు ఈకవి ఈ గ్రంథమున భక్తిరసపిచ్ఛిలమగు ప్రౌఢగద్యకవితను జాలువార్చియున్నాడు. ప్రార్థనావసరమున నిత్యము పారాయణచేయదగి ఈ గ్రంథము గ్రాలుచున్నది. నిదర్శనముగా ఒక ఘట్టమును ఎత్తిచూపుచున్నాము... "బంధవిరామా! పాదములబట్టి బహుభంగుల బ్రార్థించితిని. దీనుడనై మ్రొక్కితిని; దీనజనబాంధవుడవని నమ్మితిని; పతితపావనుడవని పజ్జను జేర్చుకొనుమంటిని; అనాథనాథుడవని యాశ్రయించితిని; సకల సౌఖ్యదాయివని సాష్టాంగపడితిని; కరుణాస్వరూపుడవగు నీవు నావాడవని నమ్మితిని: నిన్ను బ్రార్థించుటకు నాహృదయము నుండి వెలువడగల భావముల నన్నియు నుపయోగించితిని; నాచేతనైన భావనంతయు వినియోగపరచితిని. ఇంక నేజేయగలిగినదేమున్నది? కింకర్తవ్యతామూఢుడనై యూరకుండు టేగదా? అక్కటా! మ్రొక్కిన నాడు లేనిమురిపెము, యాచించిననాడు లేనియాతురత, బ్రతిమాలిన నాడు లేనిపరమదయ, హతాశుడనై చేతులు ముడిచికొని మూగవలె కూర్చుండిననాడు కలుగునా? యేమో యెట్లు జేసెదవో? నీ లీలలను నేనెట్లు గుర్తింపగలను? నమో నమశ్శ్రీమన్నారాయణా!" గ్రంథముద్రణముకూడ చాల ఆకర్షణీయముగనున్నది. జేబునందిముడు చిన్నసైజు. దళసరితెల్లకాగితములు. ఆంటిక్ టైపు. 74 పుటలు. వెల 0—5—0 అణాలు. పబ్లిషర్సు: సేవాశ్రయము, పెదపాలెము. ప్రతి ఒక్కరి దగ్గరను ఉండదగిన భగవద్గీతవంటి ఉత్తమగ్రంథము.

## ౫౭. వయోజనవిద్య

పశ్చిమగోదావరిజిల్లా, కొవ్వూరునందలి వయోజన విజ్ఞాన గ్రంథమాలలో రెండవకుసుమము. దేశసేవకులగు శనివారపు సుబ్బారావుగారిచే రచియింపబడినది. వయోజనవిద్యాప్రాధాన్యము గుర్తింపబబడుచున్న ఈ దినములలో ఈ ఈగ్రంథ మెంతయు వరణీయమైనది.

# క్రొత్త పత్రికలు

## ౧౦. ఆంధ్రవిశ్వకళాపరిషత్ కళాశాల తెనుఁగు సంఘపత్రిక

తెనుఁగు కైతకు క్రొత్త తెన్నులుచూపెన తొలకరి కవులలో నొకరగు శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు, ఎమ్.ఏ, ఈ పత్రిక సంపాదకులు. దసరా సంచికగ వెలువడిన రెండవసంపుటపు ఈ తొలిసంచికలో శ్రీ దివాకర్ల వెంకటావధానిగారి 'రసములెన్ని? శాంతమునకు స్థాయియేది?' అనునది పూజ్యస్థానమునందియున్నది. శాంతమునుగూర్చి వివిధరసవేత్తల నిర్ణయమును వివరించి పిమ్మట శ్రీ అవధానిగారు ఈ వ్యాసమున శాంతరస

మునకు తత్త్వజ్ఞానపర్యాయమైనశమమే స్థాయిభావమగుట నిరూపించియున్నారు. ప్రతాపరుద్రీయము కాక ఆంధ్రసామ్రాజ్యచరిత్రను పరిశోధింపతలంచువారికి నెట్లుపకరించునో శ్రీవడ్డాది శ్రీరామచంద్రమూర్తిగారు 'ప్రతాపరుద్రీయచారిత్రకప్రాధాన్యము' అను వ్యాసమున వివరించిరి. శ్రీ గోడవర్తి సూర్యనారాయణరావుగారి 'తెనుఁగు చాటువులు' చదువతగియున్నది. శ్రీ పాటిబండ మాధవశర్మగారి 'ఎఱ్ఱన: సోముడు' అనునది చక్కని విమర్శకవ్యాసము. బెల్జియము దేశపు షేక్స్పియరు మేతరులింకు నాటకములనుగూర్చి 'శాస్త్రి' అనువారు దిఙ్మాత్రముగ వ్రాసిరి. శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి షష్టిపూర్తినిగూర్చి సంపాదకీయము. శ్రీ దేవరాజు వెంకటసత్యనారాయణమూర్తిగారి 'విషాదాంతనాటకములు' అను వ్యాసము పఠనార్హమైయున్నది. ఆంధ్రవిశ్వవిద్యాలయమువారిచే స్వాయముగ నడుపబడుచున్న కళాశాలలో ఆంధ్రశాఖకు చెందిన ఆంధ్రయువకుల నవనవోన్మేషమగు మేధ వివిధసారస్వతశాఖలలోనెట్లు పరుగులువాఱుచున్నదో ఈ సంచిక నిదర్శనమిచ్చుచున్నది. సంవత్సరమునకు మూడు సంచికలు. సాలు చందా ఒకరూపాయి. విడి పత్రిక 0—6—0.

## ౧౧. ప్రబుద్ధాంధ్ర

రాజమండ్రి కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక. రాయల్ సైజు. 40 పుటలు. సంవత్సరపుచందా రూపాయి. విడిసంచిక అణానర. సంపాదకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. రూపాయి పత్రికకు తెనుగున శ్రీ శాస్త్రిగారే ఆద్యబ్రహ్మలు. తరువాత అట్టి రూపాయిపత్రికలు తెనుగున పదింటికి పైగా వెలసినవి. రెండు మూడు నేడును జీవించియున్నవి. దాదాపు పదిసంవత్సరములకు పూర్వము ప్రబుద్ధాంధ్ర సంపాదకులఅనారోగ్యకారణమున నిలిచిపోయినది. నిలిచిపోవుసరికి దాని చందాదారులసంఖ్య 2700. నేడు 'వినోదిని'ని తప్పించినచో అందఱు చందాదారులుగల మాసపత్రిక మఱియొకటిలేదు. అట్టి ప్రబుద్ధాంధ్ర పునరుద్ధరింపబడి తెలుగువారి అస్పర్ధ అనదగిన రాజమహేంద్రవరపుకీర్తిని విస్తరింపజేయనుండుట యెంతయు సంతోషింపదగినది. రచయిత, స్వానుదారుడు ఒక్కఁడే అయిన సంపాదకునకు నోచిపుట్టిన తెనుగు మాసపత్రికలలో ప్రబుద్ధాంధ్రయొకటి. జనవరి మాసమున వెలువడిన ఐదవసంపుటపు తొలిసంచికలో 'జాగ్రత్తపడవలసిన ఘట్టాలు' అను సంపాదకులు వ్రాసిన సాంసారికకథావ్యాసము గొప్పనీతిని బోధించుచున్నది ప్రఖ్యాతాంధ్రకథకులగు శ్రీ చింతాదీక్షితులుగారు వ్రాసిన 'ఈ మాటనిజం' చమత్కారముగ నున్నది. శ్రీకొడవటిగంటి కుటుంబరావుగారి 'సుస్వాగతం' అను కథావ్యాసమున ప్రతి అక్షరమును పాత్రపోషణగుణసంపన్నమై తెలుగువారి స్వతంత్రకథావ్యాసములలో అత్యున్నతస్థాన మందజాలియున్నది. డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు, (ఎం.ఏ.) జయంతి రామయ్యపంతులుగారి ఉత్తరరామచరిత్రముపై విమర్శకవ్యాసమును; శ్రీ శేకుమళ్ళ కామేశ్వరరావుగారు, బి.ఏ., 1872 లో ప్రచురింపబడిన నరహరి గోపాలకృష్ణమసెట్టిగారి 'శ్రీరంగరాజుచరిత్ర' అను నవల 1878 లో ప్రచురింపబడిన వీరేశలింగముపంతులుగారి 'రాజశేఖరచరిత్ర' రచనకు ఎంతవఱకు తోడుపడినదో చూపు పరిశోధకవ్యాసమును, శ్రీ మారేమండ రామారావుగారు (ఎం.ఏ.) 'ప్రాచీనకాలపు జనాభాలెఖ్ఖలు' అను విజ్ఞానవ్యాసమును రచించి ఈ సంచిక విలువను పెంచియున్నారు.

## ౧౨ పశుసంరక్షణ

ద్వైమాసపత్రిక. సంవత్సరపుచందా ఒకరూపాయి. సంపాదకులు డాక్టర్ యేజెళ్ల శ్రీరాములుచౌదరిగారు జనవరిమాసమున వెలువడిన రెండవసంపుటపు తొలి సంచికలో 'ఎటువంటి వృషభములు మంచివి కావు', 'గోసంరక్షణోద్బోధము', 'పాలలోని వాసనలు', 'పశుపోషణ', 'కాలుగోట్టు', 'పశువ్యాధి: గర్భపాతము', 'భారతదేశము: పశువులు', 'కాలుమాద' మొదలగు మంచి వ్యాసములుగలవు. రైతులకెంతయు నుపయోగకారిగనుండగల దీపత్రిక. చిరునామా : పశుసంరక్షణ, అంగలూరు, కృష్ణాజిల్లా.

# సంపాదకీయ సమాలోచన

## పులిగడ్డ ఆక్విడక్టు:—

గోదావరిపాయలలో రెండింటిపై ఆక్విడక్టులుకట్టబడి తూర్పుగోదావరిమండలమున మాగాణిభూముల విస్తీర్ణమును పెంచినవి. ఇపుడు కృష్ణానదిపాయలలో నొకదానిపై ఆక్విడక్టుకట్టుటకు కాంబెల్ దొరవారు శంకుస్థాపనగావించిరి. దివిచెంతగల పంపింగు విధానము దివియందలి పల్లపుసాగుకు సరిపోవు నీటిని సరఫరా చేయజాలకుండెను. నీటి సరఫరా తృప్తికరముగ చేయుటకు ఆక్విడక్టు నిర్మాణముతప్ప గత్యంతరము లేకపోయెను. బందరుకాలువనుండి ఒక బ్రాంచికాలువ ఈ ఆక్విడక్టుద్వారా కొనిపోపడి దివిసీమకు నూతనచైతన్యమును ప్రసాదించును. పంపింగు ప్రాజెక్టువలన ఈవఱకు నలుబదిరెండు వేల యకరములు మాగాణిసాగు అగుచున్నది. ఈ ఆక్విడక్టు నిర్మాణమువలన మాగాణిసాగు అగు ఈ విస్తీర్ణము రెండింతలు కాగలదు. క్రొత్తగా త్రవ్వింపబడు కాలువ నలుబదిమైళ్ళ పొడవుండును. దీనినుండి పలుముఖముల పంటకాలువలు సాగగలవు. పెద్దకాలువగట్టుననే చక్కని కంకరరోడ్డు నిర్మింపబడును. వ్యాపారసౌకర్యము, ప్రయాణసౌలభ్యము కలిగించు రహదారీపడవల, మోటారుకారుల సౌభాగ్యము దివిసీమకు పట్టగలదు. జలసమృద్ధి, సస్యసమృద్ధి పెంపొందగా దివిసీమ కృష్ణామండలపుకోనసీమ కాగలదు. ధాన్యముధర మూడువంతులు పడిపోయియున్న ఈ దినములలో ఈ ఆయకట్టు పెరుగుదల అనుకున్నంత ఉత్సాహమును రైతుజనులలో కలిగింపకున్నను రాగలకాలము దీనిలాభమును ప్రజలకు చూపగలదు. ఆక్విడక్టుతోబాటు ఇచట కృష్ణపాయపై వంతెన నిర్మింపదలచిన కృష్ణాజిల్లాబోర్డువారి ప్రజాసేవాభిలాష ప్రస్తుతింపదగియున్నది. తెలుగువారి జీవనదులగు గోదావరి కృష్ణానదులపాయలపై ఇంతవఱకు ఒక్కదానిమీదకూడ వంతెనలు నిర్మింపబడలేదు. పులిగడ్డపాయమీది వంతెనయే అట్టి వంతెనలకు తొలుతటిది కాగలదు. ఈవంతెన నిర్మాణవిషయమున విశేషశ్రద్ధ చూపుచున్న కృష్ణాజిల్లాబోర్డు అధ్యక్షులు శ్రీ చల్లపల్లి రాజాగారు కృష్ణాజిల్లావాసుల కృతజ్ఞతకు విశేషముగ పాత్రులుకాదగియున్నారు.

## కీ. శే. ప్రొఫెసరు దేవులపల్లి అప్పల నరసింహముగారు:—

కుంభకోణమునందలి ప్రభుత్వకళాశాలలో ఆంగ్లశాఖాధికారిగానుండి ఆంధ్రకీర్తిని వెలయించుచున్న శ్రీ దేవులపల్లి అప్పలనరసింహముగారు (ఎం.ఏ) జనవరి 15-వ తేది మధ్యాహ్నము రెండుగంటలకు దివంగతులైరని తెలుపుటకు విచారించుచున్నాము. చనిపోవుసరికి వారికి ఏబదిరెండువత్సరములు. రాజమహేంద్రవరమునందలి ప్రభుత్వకళాశాలలో వీరు పలువత్సరములు ఆంగ్లభాషోపన్యాసకులుగ నుండిరి. కోడితో మేల్కాంచి గోదావరిలంకభూములకు షికారుపోయి స్నానముచేసి సూర్యోదయముకాకుండ తిరిగి ఇంటికివచ్చువారు. గొప్ప ఆస్తికులు. రాజమండ్రియందుండగా జామాతను గోలుపో

యిరి. పదివత్సరములుగ కుంభకోణమున ఉద్యోగరీత్యా ఉండుచుండిరి. తెలుగుదేశముననున్నను, అరవదేశముననున్నను ఈ అధ్యాపకుడు విద్యార్థుల విశేషాభిమానమును చూఱగొనుచుండెను. ఆంగ్లవిద్యాధికులగు ఆంధ్రుల కొందఱివలె వీరు ఆంధ్రభాషను ఈసడింపలేదు. అందు కుశలప్రవేశమును సంపాదించిరి. సంస్కృతమున పెక్కు కావ్యనాటకములను పఠించిరి. 'భారతి' తొలి సంపుటమున ఆంధ్రమునందు వీరు రచియించినకొన్ని విమర్శక వ్యాసములు ప్రచురితములై యున్నవి. ఆంధ్రభక్తకవిశిఖామణి పోతనామాత్యునిగూర్చి వీరు ఆంగ్లమున నొక చక్కని విమర్శకగ్రంథమును రచియించి ప్రచురించిరి. ఆంధ్రమునగల భక్తికవితను గూర్చి తెలిసికొనగోరు ఆంధ్రేతరుల కది యెంతయు నుపకరింపగలదు. ఇట్లు తమ ఆంగ్లభాషాపాండిత్యమును ఆంధ్రసారస్వతప్రతిభను వ్యక్తీకరింప నుపయోగించి ధన్యజీవనులైన ఈ ఆంధ్రపుత్రుని పవిత్రాత్మ శాంతిధామమున నెలకొనునుగాక!

కీ శే. చల్లా శేషగిరిరావుపంతులుగారు బి.ఏ.

---

ఆంధ్రుల ఏకైకదినపత్రికయగు ఆంధ్రపత్రికకు 1918 నుండి 1933 నవంబరు 14-వ తేదీవఱకు ప్రధానసంపాదకులుగనుండిన శ్రీ చల్లా శేషగిరిరావుపంతులుగారు జనవరి 16-వ తేది తెల్లవారుజామున నరసారావుపేటలో దివంగతులైరి. చనిపోవునరికి వారికి నలుబదియారు వత్సరములు. ప్రధానసంపాదకులుగనున్న పదునైదువత్సరములును ఆంధ్రపత్రికయే వారిలోకము. ఫిలాడెల్ఫియా నుండి ప్రచురింపబడు 'లేడీస్ హోమ్ జర్నలు'నకు సంపాదకుడై దాని విశేషప్రచారమునకు తోడుపడిన సుప్రసిద్ధుడు ఎడ్వర్డు బాక్ వలెనే శ్రీ శేషగిరిరావుగారును సంపాదకకార్యనిర్వహణమున ఎన్నడును గడియారమును చూడలేదు. ప్రతిదినమును కార్యాలయమునకు వచ్చుటలో వారు ప్రథములు; వీడుటలో వారు కడపటివారు. చెప్పిచేయించుకొను నేర్పు లేకపోవచ్చును కాని సర్వము తానే చేసికొనగల ఓర్పు ఉండినది. సంపాదకకార్యనిర్వహణమున వీరు పూర్తిగ ఐక్యమైయుండిరని చెప్పుటకు ఎంతమాత్రమును సందేహము లేదు. లండనులో డెయిలీమెయిలుపత్రిక పెట్టినప్పుడు దాని స్వామిదారుడు లార్డునార్త్‌క్లిఫ్ మొదటి రెండు రోజులును రెండురాత్రులును ఆఫీసువదలి బయటకురాలేదు, రాత్రులయందు నిద్రించలేదు. విధినిర్వహణమున సంపాదకుల కట్టిదీక్ష యుండిననే పత్రికలుసాగును. శ్రీ శేషగిరిరావుగారి విధినిర్వహణబుద్ధియు అట్టి ఉత్తమశ్రేణికి చెందినదేయని చెప్పితీరవలయును. వీరికిపూర్వము ఆంధ్రపత్రికకు ప్రధానసంపాదకులుగనుండిన శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి భావములకుగల ఉద్రేకము, భాషకుగల ఉత్తేజము వీరిభావములకు, భాషకు లేకపోవచ్చును. కాని—శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు చెప్పినటుల—"శేషగిరిరావుగారి కర్ణధారత్వనైపుణ్యమేమియో కాని ఆంధ్రపత్రికానౌక గడ్డపట్టలేదు. కయ్యలలో మునగలేదు. ఒడ్డుకొట్టుకోలేదు. ఒడుదుడుకులు లేనిభావములు, మృదువైనశైలి. మెల్లగ వెన్నెలవలె ప్రవహించి అమృతప్రాయముగ ఆంధ్రులకు ఆమెత లొసంగినది."
ఆరోగ్యమును తుదకు ఆయుర్దాయమును ఆంధ్రపత్రికకు ధారపోసి ఆంధ్రులను సేవించిన ఈ ఆంధ్రసంపాదకమహాశయుని పవిత్రాత్మ ఈశ్వరసాయుజ్యము నందుగాక!

## మహాత్ముని హరిజనయాత్ర : ఆంధ్రదేశము

హరిజనయాత్ర సందర్భమున మహాత్ముడు ఆంధ్రదేశమున 1708 మైళ్ళు సంచరించెనని తెలుపబడినది. ఈమైళ్లలో పోయిన మార్గముననే పోవుటచేత పెరిగిన మైళ్ళు ఎన్నిగలవు? మహాత్ముని ఆంధ్రదేశ సంచారకార్యక్రమమును ఎవరు నిర్ణయించిరోకాని వారు ఆంధ్రదేశభూగోళమును మనస్సునందుంచుకొని మాత్రము నిర్ణయించలేదని నిస్సందేహముగ చెప్పవచ్చును. అసలు మహాత్ముడు ముందెప్పుడో కలకత్తా మీదుగ ఆంధ్రదేశసంచారమునకు వత్తునని తెలిపెనట. కాని మదరాసు వారు మహాత్ముడు క్రిష్టమసులోపుననే వచ్చి ఖాదీ ప్రదర్శనమును జరుప పట్టుబట్టుటచే 'సింగిపెళ్ళిలో పోలిగానికి ఒకపోచ' అను సామెతగ వారి మదరాసురాక ననుసరించి ఆంధ్రదేశయాత్ర నిర్ణయింపబడినది. ఇట్లు నిర్ణయింపబడిన తరువాతనైనను వారి సంచారకార్యక్రమము భూగోళశాస్త్రము ననుసరించి ఏర్పరుపబడినదా? ఏలూరువారు ముక్కోటినాడు వచ్చినగాని మహాత్ముని చూచుటకు అంగీకరింపలేదు. వారి అభిలాష ఈడేర్చుటకుగాను మహాత్మునిచే తెలుగు జిల్లాలు రెండుమూడింటిపై కప్పదాట్లు వేయించిరి. విలువగల మహాత్ముని కాలమును ఎంతయో వ్యర్థపఱచిరి. ప్రయాణావసరమున కలిగిన ఇంతటి అసౌకర్యమునకు, కాలము వ్యర్థమైపోవుటకు నైనను సహించి మహాత్ముని సరిగా ముక్కోటినాటికి ఏలూరు తీసికొనివచ్చుటకు అతిశ్రద్ధచూపిన ఆంధ్రమహనీయులు పొన్నమండ హరిజనసేవకుడు నిరశనవ్రతదీక్ష పూనినను కోనసీమకు మహాత్ముని పాదస్పర్శ లేకుండ చేసిరి. ఈ ఆంధ్రదేశ సంచారమున మహాత్ముడు కర్నూలు గంజాము జిల్లాలు చూడలేదు కర్నూలు, చూడకపోవుటచే గలుగగల ప్రత్యేకనష్ట మేమియు లేదుగాని గంజామును విడనాడుటచే మాత్రము ప్రస్తుతస్థితిలో ఆంధ్రులకు గొప్ప అన్యాయము జరిగినదని అనకతప్పదు. గంజాముజిల్లా ఆంధ్రులదా? ఉత్కళులదా అను సమస్య నేడు తీవ్రతరమైయున్నది. ప్రభుత్వమువారి దృష్టిలో అది ఉత్కళులదిగానే లెక్కింపబడు సూచనలు గాన్పించుచున్నవి. ప్రభుత్వము వారు ఇట్లు లెక్కింపకుండ చేయుటకు గంజాంజిల్లా ఆంధ్రులు చేసిన విశేషాందోళనమునకు ఉత్తరసర్కారుల ఆంధ్రులు వీసమంతేని సాయము చేయలేదు. ప్రభుత్వములో పలుకుబడిలేదు కావున సాయముచేయలేకపోతిమని వారు చెప్పవచ్చును. కాని కాంగ్రెసులో మాకెంతయో పలుకుబడిగలదని చెప్పుకొనుచు ఇపుడిట్లు కాంగ్రెసువారిచేతనే గంజాంజిల్లా ఉత్కళములో జమకట్టించిన ఈ ఉత్తరసర్కారుల కాంగ్రెసు నాయకుల నేమనవలయునో తెలియకున్నది. గంజాంజిల్లానుకూడ ఈ ఆంధ్రదేశ యాత్రలో చేర్పింప అచటి ఆంధ్రనాయకులు చేసిన విశేషకృషికి ఇతరఆంధ్రనాయకులు తోడుపడకపోగా ఉత్కళయాత్రలో మహాత్ముడు మీజిల్లాను చూడగలడని చెప్పివైచిరి. ఉత్కళయాత్రలో కలిపిచూచిన కాంగ్రెసు దృష్టిలోకూడ గంజాముజిల్లా ఉత్కళులదైనట్లే అని చెప్పికొని ఉత్కళులు గంజాము ఆంధ్రులను ఉడికించుట కెంతేని అవకాశమేర్పడినదికదా! గంజాము ఆంధ్రులకు గలిగిన ఈ ఘోరమైన అన్యాయము ఇంతటంతట తొలగునదికాదు. ఇన్నిరీతుల ఆంధ్రుల అస

మర్థత గాంధిగారి ఈ హారిజనయాత్రలో ప్రస్ఫుటమైనది


## అభినవాంధ్రకవిపండిత సభ .—

అభినవాంధ్రకవిపండితసభవారి ద్వితీయసమావేశము రాజమహేంద్రవరమున జయప్రదముగ జరిగినందులకెంతయు సంతోషముగనున్నది. సభలో కొందఱు కవులు తమరచనములను పఠించిరి. అందు కొన్ని ఈవఱకు ప్రచురింపబడినవే. సమావేశమైనవారు చదువెఱిగిన పెద్దలు - అందును వారు అభినవాంధ్రకవిపండితులు. క్రొత్త రచనములను మక్కువతో చదువు సారస్వతప్రియులు. అట్టివారి సమక్షమున - ఈవఱకు ప్రచురణభాగ్యమునందుటచే ప్రాబడిన రచనములను చదివి వినిపించుటలో గల సారస్యము మాకు బోధపడుటలేదు. ఆంధ్రుల వర్డ్సువర్తు అని కూల్డ్రిదొరచే ప్రశంసింపబడిన శ్రీకవికొండల వెంకటరావుగారి కవిత్వములోని మంజులభావములను వారి పదములను, పాటలను పఠించువిధానము తెలియకపోవుటచే గ్రహింపజాలకున్నారమని అభినవాంధ్రకవులే పలువురు చెప్పుచుండగా మేము వినియున్నాము. అట్టి సందర్భమున ఈ అభినవాంధ్రకవిపండిత సమావేశమున శ్రీవెంకటరావుగారిచే వారి పదములను, పాటలను పాడించుటకు ఏర్పాటు గావించిన దెంతయు సముచితముగను, సంస్తవనీయముగను ఉన్నది. కాని శ్రీవారు పాడుటకిచ్చిన గడువు మధ్యమున చాలింపుడను మాటలు అభినవాంధ్రపండిత సమావేశమునుండి వెడలుట ఆ సమావేశమున కెంతమాత్రమును గౌరవప్రదమై యుండలేదని మనవిచేయుచున్నాము. పాడిన వినరు - పాడవలసిన పద్ధతిమాత్రము తెలియదని చెప్పుదురు. ఈ అభినవాంధ్రకవిపండితసభలో శ్రీమతి దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు ఉపన్యసించి పాల్గొనిరి. ఈదేశభాంధవి భాషాబాంధవికూడ ఎప్పుడైనది ? ఈ పూర్వానువ్వాసిని అభినవాంధ్రకవయిత్రికూడ ఎపుడైనది? అభినవాంధ్రకవిపండితసభ వారి తృతీయసమావేశమున ఇట్టి చిల్లరలోపము లుండకుండ సమావేశకర్తలు జాగరూకులైయుందరని నమ్ముచున్నాము.

## నరసాపురము తాలూకాభివృద్ధి సంఘము :

## ఆంధ్రస్త్రీల పోటీపరీక్షా ఫలితములు: —

నరసాపురము తాలూకాభివృద్ధిసంఘము వారు ఆంధ్రస్త్రీలకు పోటీపరీక్షలు జరిపి వారిలో విశేషవిద్యావ్యాప్తికి ఎట్లు తోడు పడుచున్నారో ఆంధ్రభూమి పాఠకులకు తెలిసినవిషయమే. 1933 డిసెంబరులో జరిగిన స్త్రీల పోటీపరీక్ష ఫలితములు ఇపుడు ప్రచురితములైనవి. శ్రీమతి కిళాంబి సీతమ్మగారు (భీమవరము) పరీక్షయందు మొదటివారుగ కృతార్థత నొంది శ్రీయుత యఱ్ఱమిల్లి నారాయణమూర్తిగారు తమభార్య కీ. శే. శకుంతలాబాయ్‌గారి జ్ఞాపకార్థమై ఇచ్చుచున్న బంగారుపతకమును; శ్రీమతి నముయమంత్రి రాజ్యలక్ష్మమ్మగారు (నర్సాపురము) రెండవవారుగ జయముగాంచి మొగల్తుర్రు భూస్వాములు శ్రీయుత తివారీ యజ్ఞప్రసాదుగారు తమసతీమణి శ్రీమతి దేవకీబాయ్‌గారి పేర ఈయ నంగీకరించిన బంగారు పతకమును పొందిరని తెలుపుటకు ఆనందముగనున్నది. ఈసంఘమునకు కార్యద్రష్టలై యథాశక్తిని దేశసేవ గావించుచున్న ఆంధ్రపుత్రులు శ్రీ అద్దంకి బిందు మాధవరావుగారికి మా అభివాదములు.



డిసెంబరు, ౧౯33.

౨౦:—మదరాసు. మహాత్మునిరాక.

౨౨:—చెన్నపురి. ఆంధ్రమహాసభయందు శ్రీ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారి చిత్రపటము గాంధిమహాత్మునిచే ప్రతిష్ఠింపబడుట.

౨౩:—బరంపురము. ఆంధ్రవిద్యార్థి మహాసభ 12-వ సమావేశము డాక్టరు లంక సుందరంగారి అధ్యక్షతను జరిగెను.

౨౫:—రాజమండ్రి. ఆంధ్రాస్తికమహాసభ.

:—చెన్నపురి. తృతీయ ఆంధ్రనాటక కళాపరిషత్తు. శ్రీ టి. రాఘవాచారిగారి అధ్యక్షత.

౨౬:—ఎలమంచిలి. ఆంధ్రావళి సమాజమువారు సభ చేసి శ్రీగిడుగు వేంకటరామమూర్తి పంతులుగారిని పౌరులపక్షమున సన్మానించిరి.

౨౭:—రాజమండ్రి. శ్రీ చిత్రపు వెంకటాచలంపంతులుగారు దివంగతులయిరి.

:—రాజమండ్రి. రావుసాహెబు మహోపాధ్యాయ గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారి డెబ్బదవ జన్మదినోత్సవము. శ్రీజయంతి గంగన్నగారు అధ్యక్షులు.

౨౮:—బెజవాడ. 6-వ రాష్ట్రీయ మునిసిపల్ ఉద్యోగుల సభ.

:—రాజమండ్రి. అభినవాంధ్రకవిపండితసభ ద్వితీయసమావేశము. ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు

౨౯:—విజయనగరము. టి. ప్రకాశంపంతులుగారు స్వదేశవస్తుప్రదర్శనమును తెఱచిరి.

జనవరి, ౧౯3౪.

౧:—గుంటూరు. సుప్రసిద్ధ న్యాయవాది దమ్మవళం వెంకటేశ్వరరావుగారి మరణము.

3:—నూజవీడు. కీ. శే. రాజా శోభనాద్రి అప్పారావు బహద్దరు నూజవీడు రాజాగారి ఏకపుత్రిక శ్రీరంగాయమ్మరావుబహద్దరు గారు మరణించిరి.

౫:—కాకినాడ. సవితాల సుబ్రహ్మణ్యంగారు, ఎం.ఏ.,బి.ఎల్. (వకీలు) మరణించిరి.

:—శ్రీకాకుళము. రావుసాహెబు కత్తిరిశెట్టి వెంకటనరసయ్య నాయుడుగారి మరణము.

౬:—తాలూకాబోర్డులను ఎత్తివేయుటను గూర్చి ప్రభుత్వమువారి సూచనలు గెజెట్టులో ప్రచురింపబడుట.

౮:—కలకత్తా. ఆంధ్రవిద్యార్థులు మేజరు నాయుడుగారికి ఆతిథ్యమొసంగుట.

౧౦:—సుప్రసిద్ధ ఆంధ్రచిత్రకారులు శ్రీకవుతా ఆనందమోహనశాస్త్రిగారి చిత్రకళాకౌశలమును ఫ్రాంసుపత్రిక ప్రశంసించుట.

౧౧:—గుంటూరు. మధ్వ శ్రీ అవధానశిరోమణి శ్రీ పండిత కాశీ కృష్ణాచార్యులవారు వ్రాసిన సంస్కృతగ్రంథములను జర్మనుభాషలోని కనువదించుటకు అనుమతినియ్యవలెనని జర్మను పండితులు కోరుట.

౧౪:—కృష్ణానది పాయకు పులిగెడ్డవద్ద కట్టనున్న అక్విడక్టుకును, వంతెనకును సర్ ఆర్చిబాల్డు కాంబెలుగారు పునాది రాయివైచిరి.

౧౫:—పగలు 2-30 గంటలవేళ హిందూదేశమునందంతటను ప్రచండభూకంపము.

:—కుంభకోణము. ప్రొఫెసర్ దేవులపల్లి అప్పలనరసింహంగారు కాలేజీ ఆంగ్లశాఖాధికారులు, ఆంధ్రులు మరణించిరి.

౧౬:—నరసారావుపేట. ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీచల్లా శేషగిరిరావు పంతులుగారి మరణము.

# తగ్గింపు వెలలు

## త్వరపడుడు

**1934 జనవరి 20-వ తేదీ మొదలు 1934 మార్చి 20-వ తేదీవఱకు.**

### కవికొండల వేంకటరాయ విరచితములు.

| పొత్తముపేరు | ప్రతి 1-కి | అసలుధర | తగ్గింపుధర |
|---|---|---|---|
| | | రు. అ. పై. | రు. అ. పై. |
| 1. జనపదములు | ,, | 0 4 0 | 0 1 0 |
| 2. మాతృదేశసంకీర్తనము | ,, | 0 4 0 | 0 1 0 |
| 3. కలరుతము | ,, | 0 4 0 | 0 1 0 |
| 4. కుమారకంఠము | ,, | 0 4 0 | 0 2 0 |
| 5. చదువులదుత్త | ,, | 0 4 0 | 0 2 0 |
| 6. కోనేరు | ,, | 0 4 0 | 0 2 0 |
| 7. చిట్టికత | ,, | 0 6 0 | 0 3 0 |
| 8. అగడపలు | ,, | 0 8 0 | 0 4 0 |

షరా:—పై పొత్తములు విడివిడిగవలసినను ఆయా తగ్గింపుధరలకు ఈయబడును గాని తపాలఖర్చులు విశేషమగును. ఒక రూపాయకు తక్కువకాని ఆర్డరుతో రూపాయ ముందుగ మనియార్డరు చేసినయెడ తపాలఖర్చులు ప్రకాశకులే భరించి బుక్కుపోస్టుగ పొత్తము లంపగలవారు.

* ఏతత్కవికృతము లింకను అచ్చుపడి వెలకు సిద్ధముగ నున్నవి.

| | | రు. అ. పై. | |
|---|---|---|---|
| 1. త్రయి | ప్రతి 1-కి | 0 14 0 | రెండునుగలిపి |
| 2. ప్రకృతిచందనము | ,, | 0 4 0 | రు. 1 0 0 |
| 3. ఆత్మవ్యక్తి | ,, | 0 8 0 | రెండునుగలిపి |
| 4. సెలబాలుడు | ,, | 0 12 0 | రు. 1 0 0 |
| 5. జంటలు | ,, | 1 0 0 | రెండునుగలిపి |
| 6. పొట్టికత | ,, | 0 8 0 | రు. 1 0 0 |
| 7. వివిధకుసుమావళి | ,, | 0 8 0 | రెండునుకలిపి |
| 8. విప్రసందేశము | ,, | 1 0 0 | రు. 1 0 0 |

వలసినచో:—కవికొండల వేంకటరావుగారు, బి.ఏ,బి.ఎల్.

ఇన్నీసుపేట, రాజమండ్రి. అని వ్రాయనగు.

---

### గతమాసపు పోటీపరీక్ష సమాధానము

**1.** తవుడు. **2.** అవును. **3.** గోవులు. **4.** లవుడు. **5.** నివురు. **6.** బావులు. **7.** చవుక. **8.** నావుడు. **9.** పూవులు. **10.** మూవురు. **11.** మావులు. **12** కవులు. **13.** చెవుడు. **14.** బావురు. **15.** ప్రోవులు. **16.** దేవుడు.

### బహుమానము పొందినవారు

పోటీచేసిన ఏబదిఇద్దఱిలో 16 టికిని ఒకరే సరియైన పైసమాధానము నిచ్చిరి. బహుమానమునకు తగిన వారి నామము: జి. యల్. నరసింహశాస్త్రిగారు, సేలము.

---

# రత్నపురుష

శుక్లనష్టమును

నూటిగ

కుదుర్చు

తిరుగులేని మందు.

### మేహరోగులపాలిటివరప్రసాదము.

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టి నొంది బలారోగ్యములను పొందుదురు. డబ్బీ రూ. 3-0-0.

**చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.**